www.jagritiweekly.com

సంపుటి : 75 సంచిక : 20 పుటలు : 52

# జాగృతి

కలి 5124 - శ్రీ శుభకృత్ ఫాల్గుణ శుద్ధ చతుర్దశి

06-12 మార్చి 2023

వెల : ₹15/-



# ఆరో ఏడు.. 1వ తరగతి

చాలామంది నిపుణులు ఆరో ఏట చిన్నారులను బడికి పంపడమే మంచిదన్న అభిప్రాయంతో ఉన్నారు

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

75 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక



# కశ్మీర్‌లో శివరాత్రి


కాళిక

ఫిబ్రవరి 22న మళ్లీ కశ్మీర్‌లో ఒక పండిట్‌ను ఉగ్రవాదులు కాల్చి చంపారు. ఏటీఎం దగ్గర గార్డ్‌గా పనిచేసే సంజయ్ శర్మ మార్కెట్‌కు వెళ్లివస్తుండగా ఆయన మీద తుపాకీ గుళ్ల వర్షం కురిపించారు. అడపాదడపా ఇలాంటి దుర్ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. గత ఏడాది 30 సార్లు హిందువుల మీద ఉగ్రవాదులు దాడులు చేశారు. 18 మంది చనిపోయారు. అందులో ముగ్గురు పండిట్లు. శివరాత్రి పర్వదినాన్ని ఈ సంవత్సరం కూడా హిందువులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అయితే ఆలయాలకు వచ్చిన వారి సంఖ్య గత ఏడాదితో పోలిస్తే కొంచెం తగ్గింది. ఈ సందర్భంగా నటరాజుగా కూడా ఆరాధనలు అందుకునే శివుని ప్రీత్యర్థం కళాకారులు రకరకాల ప్రదర్శనలు నిర్వహించారు.



శివపార్వతులు

ఆసక్తి కలిగించే విశ్లేషణలు.. జాగృతపరిచే కథనాలు..
చైతన్యం నింపే వాస్తవాలు.. స్ఫూర్తిని నింపే రచనలతో
ఇపుడు జాగృతి వారపత్రిక మరింత కొత్తగా మీ ముందుకు వస్తున్నది.




రండి..
జాతీయభావాల వేదిక
జాగృతి చందాదారులుగా
చేరుదాం.. చేర్పిద్దాం!

ఏప్రిల్ 1, 2023 నుండి జాగృతి వార్షిక,
5 సంవత్సరాల చందా పెరగనున్నది..

ఒక సంవత్సర చందా
రూ.850/-

విడి ప్రతి
రూ.20/-

ఐదు సంవత్సరాల చందా
రూ.4000/-

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో మీ మొబైల్ నుంచి చెల్లించడానికి
ఇక్కడ ఉన్న క్యు.ఆర్. కోడ్‌లను
గూగుల్ సెర్చ్‌బార్‌లో ఉండే గూగుల్ లెన్స్‌తో స్కాన్ చేయండి.
లేదా క్రిందనున్న లింక్‌లను ఉపయోగించండి.

ఒక సంవత్సర చందా రూ.650/-
http://payit.cc/S18970

Jagriti Bank A/c details :
Jagriti Prakashan Trust,
A/c No.920010061405325,
Axis Bank, Kothapet Branch, Hyderabad.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

ఐదు సంవత్సరాల చందా రూ.3000/-
http://payit.cc/S18973

3-4-228/4/1, Kachiguda, Hyderabad-500027.
Ph : 040-27561453, 9959997013. email : jagritiweeklysub@gmail.com

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

## జాగృతి చందా - సూచనలు

**5 సం॥ల చందా రూ.3000, సంవత్సర చందా రూ.650, విడి ప్రతి రూ.15**

✦ అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.

✦ తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.

✦ పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

✦ చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.

✦ రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.

✦ ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.

✦ మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

✦ 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

✦ **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

✦ చెక్కు, డిడిపై **Jagriti Prakashan Trust** అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ | |
| కె. హరీష్ | సబ్ ఎడిటర్ | 9959991304 |


డిజైనర్ : సిహెచ్. కుమార్

‘ఇది మహాపరాధం, జరిగింది ఘోర తప్పిదమే, వెనక్కి తీసుకోలేని పొరపాటే, క్షంతవ్యులం.. క్షంతవ్యులం’ అంటూ కాంగ్రెస్ 85వ ప్లీనరీ వేదిక మీద నుంచి క్షణాల మీద వేడుకోళ్లు వెల్లువెత్తాయి. అది తప్పిదమో, మారని కాంగ్రెస్ పార్టీ బుజ్జగింపు ధోరణికి నికార్సయిన నిదర్శనమో తేల్చుకోవడం కష్టమేమీ కాదు. ఫిబ్రవరి 24 నుంచి 26 వరకు ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో మూడు రోజుల ప్లీనరీ జాతర ఆరంభమవుతున్నట్టు అక్కడి దినపత్రికలలో వ్యాపార ప్రకటనలు ఇచ్చింది పార్టీ. ఇందులో తప్పు లేదు కానీ, ఆ ప్రకటనలో చోటు కల్పించిన ఫోటోలలో ఒక వ్యక్తి బొమ్మ కనిపించకపోవడం రౌరవాది నరకాలు పట్టిపోయేటంత పాపం కాదా అంటూ నిలదీశారు మనీష్ తివారీ. గాంధీజీ, నెహ్రూ, సర్దార్ పటేల్, బీఆర్ అంబేడ్కర్, సుభాశ్ చంద్రబోస్, లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్, పీవీ నరసింహారావు, సరోజినీ నాయుడుల ఫోటోలు వేశారు. కానీ, దేశ ప్రథమ విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఫోటో వేయనందుకు మనీష్‌కు తల కొట్టేసినట్టనిపించింది. తన ఆక్రోశాన్ని ఆయన దాచుకోలేదు. పత్రికల ప్రకటనలలోనే కాదు, వేదిక వెనకాల అలంకరించిన ఫోటోలలోనూ ఆజాద్ అదృశ్యమయ్యారంటూ ఇంకొందరు వాపోయారు. దానికే ఈ క్షమాపణల వరద. మొత్తానికి మనీష్ పుణ్యమా అని ప్లీనరీకి ఆజాద్ ఫోటో పితలాటకమైపోయింది.

ఇంతకీ మనీష్ ఆవేదన అబుల్ కలాం ఫోటో కనిపించనందుకా? పటేల్, పీవీ ఫోటోలు కొత్తగా వచ్చి చేరినందుకా? స్వాతంత్ర్య పోరాట సమయంలో ముస్లింలంతా పాకిస్తాన్ ఆలోచన వైపు జారిపోకుండా చూస్తూ, సమైక్య భారత్ కోసం పాటుపడిన ఆ వర్గం నాయకులు ఉన్నారు. వారిని మరచిపోతే ఎలా? ఇది ముస్లిం సమరయోధులను చరిత్ర నుంచి మినహాయిస్తున్నారన్న అభిప్రాయానికి వచ్చి ఆ వర్గం కుమిలిపోదా అంటూ దాదాపు కన్నీటి పర్యంత మయ్యారు మనీష్. మాకు మాత్రం బాధ లేదా ఏమిటి? ఆయన (ఆజాద్) పార్టీకీ, దేశానికీ ఎప్పటికీ ప్రేరణే. అందుకే అత్యంత నిజాయితీతో క్షమాపణలు

**శాలివాహన 1944 శ్రీ శుభకృత్ ఫాల్గుణ శుద్ధ చతుర్దశి**

**లోపలి పేజీలలో...**

ముఖపత్ర కథనం
**ఆరో ఏడు.. 1వ తరగతి**
6లో



చర్చ
**విశ్వనగరానికి కుక్కకాటు**
14లో



ధారావాహిక నవల
**వరాహమిహిర**
- పాలంకి సత్య
20లో

# జాగృతి

## సంపాదకీయం

కోరుతున్నామని ఆ పార్టీ మేధావి జైరామ్ రమేశ్ చెంపలు వేసుకున్నంత పనిచేశారు. ఈ తప్పిదం చేసిన వారి మీద చర్యలు తీసుకుంటామని కూడా ముక్తాయించారు.

గోరు చుట్టు మీద రోకటి పోటు అన్నట్టు, రాహుల్ మొదట తన పార్టీలో ఉన్న ఆర్ఎస్ఎస్ వారిని ఏరేసి, క్షాళన చేయడం అవసరం అంటూ బీఎస్పీ ఎంపీ కున్వార్ దానిష్ మంటను ఇంకాస్త ఎగదోశారు. దీనికి రుజువుగా ఆయన ఆజాద్‌ను విస్మరించిన తాజా ఉదంతాన్నీ, గతంలో సావార్కర్ బొమ్మను పార్లమెంట్‌లో ప్రతిష్టించినప్పుడు కాంగ్రెస్ నేతలు ప్రణబ్‌ముఖర్జీ, శివరాజ్ పాటిల్

# ప్లీనరీ పితలాటకం

సమర్థించిన సంగతినీ కూడా గుర్తు చేశారు. పటేల్, శాస్త్రీజీ, బోస్, అంబేద్కర్, పీవీ ఫోటోలు కాంగ్రెస్ వేదిక మీద పెట్టడం మరీ ఎబ్బెట్టుగా ఉందంటూ బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యానించారు. ఈ నేతలను గాంధీ– నెహ్రూ కుటుంబం ఎలా చూసిందో జాతి మరచిపోలేదంటారాయన.

సోనియా కాంగ్రెస్‌కు సంబంధించి ప్లీనరీలంటే మళ్లీ అధికారంలోకి రావడం గురించి ఎత్తులు వేయడమే. ఈ ప్లీనరీ తొలి ప్రాధాన్యం కూడా అదే–2024లో మోదీని గద్దె దింపడానికి ఉన్న మార్గాలూ, గాంధీ నెహ్రూ కుటుంబీకుడిని ప్రతిష్టించే సూత్రాలూ వెతకడం. వారి మేథో మథనం అంటే ఇదే. మోదీని గద్దె దించడానికి భావసారూప్యత కలిగిన పార్టీలతో పొత్తులు ఉంటాయట. అయితే నిన్న త్రిపురలో కాంగ్రెస్, సీపీఎం కలసి పోటీ చేశాయి. రేపు కేరళలో ఇదే ముచ్చట కనిపిస్తుందని కలలో కూడా అనుకోనక్కరలేదు. అది వేరే విషయం. అధికారం ఇప్పుడే ఎలాగూ దక్కదు కాబట్టి, తరువాత ఎలాగూ జనం మరచిపోతారు కాబట్టి బడుగుల క్షేమం కోసం ఒక తీర్మానం చేశారు. ఎస్సీ, ఎస్టీలకి యాభయ్ శాతం రిజర్వేషన్ గురించిన తీర్మానమది. మరొక చక్కని తీర్మానమూ చేశారు. మాజీ రాష్ట్రపతులు, ప్రధానులు, ఏఐసీసీ మాజీ అధ్యక్షులని పార్టీలో శాశ్వత ఆహ్వానితులుగా చేర్చడానికి నిబంధనావళిని మారుస్తారట. ఇది ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్న వ్యూహంతో చేసిన ఆలోచన కావచ్చు. ప్రణబ్ ముఖర్జీ మాదిరిగా కాంగ్రెస్ నుంచి ఎన్నికైన మాజీలెవరూ మరోసారి నాగపూర్‌లో ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యాలయానికి వెళ్లకుండా తీసుకున్న జాగ్రత్త కావచ్చు. ఇంకా, ఇన్నింగ్స్ ముగిశాయంటూ సన్నాయి నొక్కులు నొక్కిన సోనియాను ఆ ప్రయత్నం నుంచి విరమింప చేసి, పార్టీకి ప్రేరణనొసగే దేవతగా ప్రతిష్టింప చేయడం కూడా.

అన్నట్టు అబుల్ కలాం ఫోటో కనపడనందుకు కన్నీటి పర్యంతమైన నేతలకీ, అందుకు క్షమాపణలు గుప్పించిన నిర్వాహకులకీ ఇది దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి డెబ్బయ్ అయిదేళ్లు పూర్తయిన సందర్భమన్న వాస్తవం ఎందుకు గుర్తు లేదు? ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ పిలుపు మోదీ ఇచ్చారు. కాబట్టి పట్టించుకోరా? గాంధీ, నెహ్రూ, అలాగే ఆజాద్‌లతో పాటు ఇంకా ఎందరో ఈ దేశం కోసం త్యాగం చేశారు. వారి కోసం ఒక్క నిమిషం మౌనం పాటించడానికైనా మూడు రోజుల ప్లీనరీలో అవకాశం చిక్కలేదా? మోదీని ఆడిపోసుకోవడానికీ, విదేశాంగ మంత్రి జైశంకర్‌ను విమర్శించడానికీ, గౌతమ్ అదానీ నామస్మరణకు కేటాయించిన సమయంలో నూరో వంతు కూడా మన స్వాతంత్ర్య సమరయోధులను తలుచుకోవడానికి ఇవ్వలేకపోయిన ప్లీనరీ ఇది. నేతల రాక కోసం అక్షరాల ఆరు వేల కిలోల గులాబీలను పరచిన స్థానిక నేతలకి ఆ ప్రాంతానికే చెందిన ఎవరో ఒక గిరిజన స్వాతంత్ర్య సమరయోధుని లేదా, మరొక త్యాగమూర్తి ప్రతిమ ముందు ఒక్క పుష్పమైనా ఉంచి నివాళి ఘటించాలన్న ఆలోచన రాలేదా? దీని గురించి భారతజాతి ఆలోచించాలి. ★

06 మార్చి 2023, సోమవారం


అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్


40లో

కథ


**నా లాగ ఎందరో!**

– అల్లూరి గౌరీలక్ష్మి





| | | |
|---|---|---|
| మగువ విలువ తెలుసా? (మహిళ) | – | 10 |
| రెచ్చిపోతున్న ఖలిస్తాన్‌వాదులు (జాతీయం) | – | 12 |
| ఓటమి భీతితో ఏకగ్రీవ యత్నాలు (ఆంధ్రప్రదేశ్) | – | 24 |
| వేదంలో శివుడు, హరప్పా హరుడు ఒకరే (చరిత్ర) | – | 28 |
| రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి ఏడాది (అంతర్జాతీయం) | – | 35 |
| సానియాను మరువగలమా! (క్రీడ) | – | 43 |
| లిక్కర్ స్కామ్‌లో తదుపరి అరెస్ట్..? (తెలంగాణ) | – | 44 |
| కనదగిన 'వినరో భాగ్యము విష్ణు కథ' (సినిమా) | – | 50 |




# ఆరో ఏడు.. 1వ తరగతి

చిన్నారులకి రెండు నుంచి రెండున్నర ఏళ్లు వచ్చేసరికి బడిలో వేద్దామన్న ఆలోచన తల్లిదండ్రులకు వస్తున్నది. కొందరు నర్సరీలో చేరతారు. ఇంకొందరు ఎల్‌కేజీ, యూకేజీలలో చేరతారు. ఏమైనా ఒకటో తరగతిలో చేరడానికి సరైన వయసు ఆరేళ్లు. అంటే 5+ నుంచి ఆరేళ్ల వయసు కలిగిన వారు. ఇంకా చెప్పాలంటే చిన్నారులను పాఠశాలకు పంపుతున్న ఆ సంవత్సరం మార్చి ముగిసేనాటికి వారికి ఐదేళ్లు నిండి ఉండాలి. కాబట్టి తరువాతి విద్యా సంవత్సరానికి ఆ చిన్నారికి పాఠశాలలో చేరడానికి వయసు రీత్యా అర్హత వస్తుంది.

చాలామంది నిపుణులు ఆరో ఏట చిన్నారులను బడికి పంపడమే మంచిదన్న అభిప్రాయంతో ఉన్నారు. కొఠారి (1964) కమిషన్ ఐదేళ్లకే చిన్నారులను బడికి పంపవచ్చునని సిఫారసు చేసింది. కేరళ వంటి రాష్ట్రాలు అదే అమలు చేస్తున్నాయి. ఆరేళ్లు వచ్చినప్పుడే చిన్నారులు ఉపాధ్యాయులు చెప్పేది శ్రద్ధగా వినగలుగుతారని నిపుణుల ఏకాభిప్రాయం. రాయడం, చదవడం వంటి విద్యా విషయాల మీద కూడా ఆ వయసులోనే ఆసక్తి ఉంటుంది. నిజానికి జీవితంలో విశ్వవిద్యాలయంలో గడిపిన కాలం కంటే చిన్నారికి ఆరో ఏట ప్రవేశించే కాలమే చాలా విలువైనదని అంటారు. చిన్నారి మెదడు పూర్తిస్థాయి తయారుకావడంలో ఆరో సంవత్సరం కీలకమే. అప్పుడే మెదడు 95 శాతం తయారవుతుంది. అంటే పెద్దల మెదడు దశకు చేరుతుంది. తెలివితేటలు నాలుగో సంవత్సరానికి 50 శాతం, ఎనిమిదో సంవత్సరానికి 80 శాతం వృద్ధి చెందుతాయి. అందుకే ఆరో ఏడుకు అంత ప్రాధాన్యం. భాషలు నేర్చుకోవడం, ఇతర నైపుణ్యాలను సులభంగా గ్రహించడానికి అదే సరైన వయసు. అదే గ్రహించే శక్తి 'ఎబ్జార్బెంట్ మైండ్' దశ.

ఆరేళ్లకు స్కూళ్లలో ప్రవేశం, మాతృభాషలో చదువు, నచ్చిన కోర్సులను ఎంచుకునే అవకాశం, నాణ్యమైన బోధన, రాణించటానికి విస్తృత అవకాశాలు... కొత్త విద్యాసంస్థల ఏర్పాటు ఇలా ఎన్నో అవకాశాలను ఎన్‌ఈపీ తెర ముందుకు తెచ్చింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థలో అతి గొప్ప సంస్కరణకు కేంద్రం నాంది పలికింది. అదే జాతీయ విద్యావిధానం (నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ–ఎన్‌ఈపీ). స్వామి వివేకానంద ప్రవచించిన 'మ్యాన్ మేకింగ్ ఎడ్యుకేషన్', అరవిందుడి 'ఇంటిగ్రేషనల్ ఎడ్యుకేషన్', మహాత్మాగాంధీ 'బేసిక్ ఎడ్యుకేషన్'ల సమ్మిళిత నమూనాగా ఇది రూపుదిద్దుకుంది. సామాజిక ఆర్థిక పరివర్తనకు ఉద్దేశించినదే ఈ ప్రయత్నం. కొత్త విద్యావిధానం సూచించిన రీతిలోనే ఒకటో తరగతిలో చేరడానికి ఆరేళ్ల వయసును ప్రామాణికంగా తీసుకోవాలని, ఇది కచ్చితంగా అమలు చేయాలని ఫిబ్రవరి 22వ తేదీన కేంద్రం ఆదేశాలు ఇచ్చింది.

ఐదేళ్ల తపస్సు, 2.5 లక్షల గ్రామపంచాయతీలు, 12,500 స్థానిక సంస్థల్లో సామూహిక చర్చలు, 575 జిల్లాల్లో సమావేశాలు, 15 లక్షల సూచనలు, సలహాలు. కడకు రెండు లక్షల సలహాలకు ఆమోద ముద్ర. అలా 2020లో నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ రూపుదిద్దుకుంది. 'ఇది ఇండియన్ ఎడ్యుకేషన్ కాదు... భారతీయ ఎడ్యుకేషన్' అంటోంది కేంద్ర ప్రభుత్వం. 'ఆత్మనిర్భర దేశంలో.. ఆత్మనిర్భర విద్య' అని ప్రస్తుతిస్తున్నారు విద్యారంగ నిపుణులు.

స్వాతంత్ర్యానికి ముందు బ్రిటిష విద్యా విధానంలో బట్టీపట్టటం అనేది తెలివితేటలకు కొలమానంగా ఉండేది. విద్యార్థుల్లో ఆలోచన, విశ్లేషణా సామర్థ్యం అనేది అంతగా ఉండేది కాదు. దీనివల్ల



డాక్టర్ పార్థసారథి చిరువోలు
సీనియర్ జర్నలిస్ట్

తమ చిన్నారులను ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా బడికి పంపించాలన్న తపన ఇవాళ తల్లిదండ్రులలో సర్వసాధారణంగా కనిపిస్తున్నది. మూడో ఏడు రాగానే ఎల్‌కేజీలో వేయడం ఇందుకే. ఆ విధంగా తమ చిన్నారి జీవితంలో ఏకంగా ఒక సంవత్సరం వృథా కాకుండా కాపాడుతున్నామని వారంతా తమను తాము సంతృప్తి పరుచుకుంటున్నారు. ఒక చిన్నారి ఈ సంవత్సరం మూడో సంవత్సరంలోకి ప్రవేశిస్తాడు. అతడికి ఎల్‌కేజీ అర్హత వచ్చేస్తుంది. కానీ వాస్తవంగా జరిగేది వేరు. ఒక ఉదాహరణ: ఒక పాఠశాలలో ఇద్దరు బాలులను ఒకేసారి చేర్పించారు. ఇద్దరూ ఒకే సంవత్సరంలో పుట్టిన మాట నిజమే. కానీ అందులో ఒక బాలుడు చాలా తొందరగా ఉపాధ్యాయులు చెప్పింది నేర్చుకోగలిగాడు. తోటి బాలలతో ఆటలు ఆడగలిగాడు. చలాకీగా, ఎలాంటి ఆత్మన్యూనత లేకుండా కలివిడిగా తయారయ్యాడు. కానీ రెండో బాలుడు దీనికి పూర్తిగా విరుద్ధం. కారణం ఒకటే. అన్నీ నేర్చుకున్న ఆ బాలుడు ఆ సంవత్సరం జనవరిలో పుట్టాడు. నేర్చుకోలేకపోయిన బాలుడు అదే ఏడాది డిసెంబర్‌లో పుట్టాడు. ఆరేళ్ల లోపు పిల్లలలో ఎదుగుదలకు సంబంధించి ఒక సంవత్సరకాలం చాలా కీలకం. దాని ఫలితమే ఆ ఇద్దరిలో ఆ తేడా. ఒక సంవత్సరం కాపాడామని అనుకున్న తల్లిదండ్రులకు ఆ సంవత్సరమంతా తమ చిన్నారి పడిన యాతనను గమనించే తీరిక, ఆలోచన లేవు. ఇది ఒక విశ్వవ్యాప్త వాస్తవం. బ్రిటన్‌కు చెందిన ఫిస్కల్ స్టడీస్ సంస్థ సర్వేలో ఇదే తేలింది. ఒకే సంవత్సరంలో పుట్టినా చిన్న పిల్లలు పెద్ద పిల్లలతో పోటీ పడలేకపోతున్నారు. చదువును భారంగానే భావిస్తున్నారు. అందుకే చిన్నారులను పాఠశాలలకు పంపేందుకు ఒక నిర్దిష్ట వయసు విధానాన్ని పాటించాలని కేంద్రం భావిస్తున్నది. నిజానికి ఇది పాత పద్ధతే. పెరిగిన విద్యావ్యాపారంతో పాటు, మారిన జీవన శైలి కూడా పిల్లలను సాధ్యమైనంత త్వరగా పాఠశాలలో వేయాలన్న ఒక అవాంఛనీయ పరిణామానికి కారణమయ్యాయి. అదే కొనసాగుతోంది.

సమాజంలో ఎన్నో సమస్యలు ఎదుర య్యాయి. కొత్త విద్యావిధానం (ఎన్‌ఈపీ) మాతృ భాషలో విద్యాబోధనకు అవకాశం కల్పిస్తుంది. దీనివల్ల విద్యార్థి తన ఆలోచనాపరిధి, విశ్లేషణా సామర్థ్యం, తార్కిక జ్ఞానం, పరిశోధనా పటిమలను పెంచుకోగలుగుతాడు. అలాగే మెడికల్, ఇంజనీరింగ్ లతో పాటు ఉన్నత విద్యకు సంబంధించిన సిలబస్ అంతా ప్రాంతీయ భాషలో అందుబాటులోకి తెచ్చుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పుడు భోపాల్‌లో మొదటి సెమిస్టర్ వైద్యవిద్య కోర్సును పూర్తిగా హిందీలో బోధిస్తున్నారు. గుజరాతీ, తెలుగు, ఒడియా, పంజాబీ, బెంగాలీలో బోధనకు సన్నాహాలు సాగుతున్నాయి. విద్యార్థి ఎప్పుడయితే మాతృభాషలో ఏదైనా నేర్చుకుంటాడో అతనిలో నిబిడీకృతమైన శక్తులు.. సంగీతం వంటి కళారంగంలో కావచ్చు, ఇతరత్రా రంగాల్లో కావచ్చు, బయటకు వస్తాయి. ఈ ఏడాది జులై 29 నాటికి ఎన్‌ఈపీ రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుంటుంది. 28 రాష్ట్రాలు, 6 కేంద్రపాలిత ప్రాంతాల్లో మొత్తం 2,774 ఇన్నొవేటివ్ కౌన్సిళ్లు ఏర్పాటయ్యాయని కేంద్ర విద్య మంత్రిత్వశాఖ అంతర్గత నివేదిక చెబుతోంది. ఇందులో 2వేల సంస్థలు స్కిల్ హబ్‌లుగా పనిచేస్తాయి. స్కిల్ డెవలప్‌మెంటు ఎంట్రప్రెన్యూర్‌షిప్ మంత్రిత్వశాఖ పోర్టుల్లో దాదాపు 700 వరకూ రిజిస్టర్ అయ్యాయి.

ఈ ఆలోచన అమలులో తొలి సోపానమే ఒకటో తరగతిలో ప్రవేశానికి కనీసం ఆరేళ్ల వయసు ఉండాలంటూ ఇటీవల కేంద్రం ఇచ్చిన నిబంధన. కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన 5+3+3+3 విధానం ప్రకారం చిన్నారులకు ఆరేళ్ల వయసులో ఒకటో తరగతి మొదలవుతుంది. మూడు నుంచి ఐదేళ్ల వయసులో మధ్య ఉన్న చిన్నారులందరికీ ఫౌండేషన్ దశలో భాగంగా విద్య అందిస్తారు. ఇందుకు గాను




ప్రీస్కూలు. ఆ తర్వాత 1, 2 తరగతులను చిన్నారులు అభ్యసించవలసి ఉంది. మూడేళ్ల వయసులో పిల్లలను స్కూలుకు పంపటం వల్ల మంచి పునాది పడటంతో పాటు ప్రీస్కూలు నుంచి రెండో తరగతి వరకూ చిన్నారుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడతాయి. అంగన్వాడీలు, ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్, ప్రయివేటు, ఎన్జీఓ సంస్థల ఆధ్వర్యంలో నడిచే ప్రీస్కూళ్లలో అభ్యసిస్తున్న చిన్నారులందరికీ ఒకటో తరగతిలో చేరటానికి ముందే నాణ్యమైన విద్యను అందించేందుకు ఈ విధానం దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. నూతన విద్యా విధానానికి అనుగుణంగా ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఉన్న వయసు నిబంధనను సర్దుబాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్రం స్పష్టంగా ఆదేశించింది.



**అసలు జాతీయ విద్యావిధానం ఏమిటి?**

1986 నుంచి కొనసాగిస్తున్న విద్యావిధానంలో మార్పులు చేస్తూ కొత్తగా తెచ్చిన జాతీయ విద్యావిధానానికి కేంద్ర క్యాబినేట్ 29 జులై 2020న ఆమోద ముద్ర వేసింది. అంతకు ముందు ఇస్రో మాజీ ఛైర్మన్ కె.కస్తూరిరంగన్ ఆధ్వర్యంలో కమిటీ డిసెంబర్, 2018లో ముసాయిదాను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించింది. లోక్‌సభ ఎన్నికల అనంతరం ప్రభుత్వం మే, 2019లో ప్రజాభిప్రాయం కోరింది. భారతీయ విద్యావిధానంలో సానుకూల మార్పులకిది దోహదం చేస్తుంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకూ, అవసరాన్ని బట్టి వృత్తివిద్యలను ప్రోత్స హించేలా దీని రూపకల్పన సాగింది. ఈ విద్యా విధానంలో ఫలానా భాషలో చదవాలన్న వత్తిడి ఎవరిపైనా ఉండదు. తమ ఆసక్తులకు అనుగుణంగా వారి భాషను ఎంపిక చేసుకోవచ్చు.

- ఆయా రాష్ట్రాలు ఎంపిక చేసుకున్న మేరకు మాతృభాష లేదా ప్రాంతీయ భాషలో బోధించటం అనే అంశంపైన ప్రధానంగా దృష్టి పెడతారు.
- ఇప్పుడు ఉన్న 10+2 విధానానికి బదులుగా 5+3+3+4 విధానాన్ని అనుసరిస్తారు. ఫౌండేషన్ స్టేజీ, ప్రిపరేటరీ స్టేజీ, మిడిల్ స్టేజీ, సెకండరీ స్టేజీగా వాటిని విభజించారు.
- ఉపాధ్యాయ వృత్తిని చేపట్టేవారు తప్పనిసరిగా నాలుగేళ్ల డిగ్రీ కోర్సుని విజయవంతంగా పూర్తి చేయాలని నిబంధన విధించారు.

**స్కూలు ఎడ్యుకేషన్: ఇందులో నాలుగు దశలు ఉంటాయి..**

పాఠశాల విద్య ప్రాథమిక దశ (ఫౌండేషన్ స్టేజ్)–లో మూడేళ్ల స్కూలు లేదా అంగన్ వాడీ విద్య. ఆ తర్వాత ప్రైమరీ స్కూళ్లలో 1, 2 తరగతులు. ఇది మూడేళ్ల నుంచి ఎనిమిది సంవత్సరాల వరకూ సాగుతుంది. ఇందులో యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ ఉంటుంది.

సన్నాహక దశ (ప్రిపరేటరీ స్టేజ్)– మూడు నుంచి ఐదేళ్ల మధ్య ఉంటుంది. 9 నుంచి 11 ఏళ్ల వయసు. ఇందులో రాయటం, మాట్లాడటం, చదవటం, ఫిజికల్ ఎడ్యుకేషన్, లాంగ్వేజీ, ఆర్ట్స్,



## నూతన భవిష్యత్తు వైపు చూపు

‘మన విద్యావిధానం, దాన్ని అందించే విద్యాసంస్థలపైన భారతదేశ ఉజ్వల భవిష్యత్తు ఆధారపడి ఉంది. అందుకే స్వాతంత్ర్యం అనంతరం ‘అమృతకాలం’లో విద్యాసంస్థలలో మౌలిక సదుపాయాలను కల్పించటంలో కావచ్చు, లేదా విధానాల రూపకల్పనలో కావచ్చు, ప్రతి దశలోనూ వేగవంతమైన చర్యలకు సిద్ధం అవుతున్నాం. భారతదేశం.. ఆత్మతత్త్వం నుంచి పరమాత్మ తత్త్వం వరకూ, ఆధ్యాత్మికత నుంచి ఆయుర్వేదం వరకూ, సోషల్ సైన్సెస్ నుంచి సోలార్ సైన్సెస్ వరకూ, మ్యాథ్స్ నుంచి మెటలర్జీ వరకూ, శూన్యం నుంచి అనంతం వరకూ పరిశోధనలు చేపడుతూ ప్రపంచానికి మార్గం చూపింది. లింగ సమానత్వం అనే పదం బయటకు రాని రోజుల్లోనే మహిళా పండితులు పురుషులకు దీటుగా వాదించి తమ సత్తా చూపారు. గార్గి, మైత్రేయలు అందుకు పెద్ద ఉదాహరణ. ఆ చీకటి రోజుల్లోనే భారతదేశం మానవత్వం అనే వెలుగును ప్రపంచానికి చూపించింది. ఆ కిరణాల నుంచి ఆధునిక ప్రపంచం, ఆధునిక సైన్స్ పుట్టుకొచ్చాయి. ఇంతకు ముందున్న ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేశాయి. కీలక విద్యాసంస్థలైన ఐఐటీ, ఐఐఐటీలు, ఐఐఎమ్‌లు, ఏఐఐఎమ్ఎస్‌ల సంఖ్య గణనీయంగా పెంచాం. 2014 తర్వాత వైద్యకళాశాలల సంఖ్య 65 శాతం పెరిగాయి. నూతన విద్యావిధానం కింద దేశం మొట్టమొదటిసారిగా ముందుచూపుతోనూ, భవిష్యత్తు దిశగానూ అడుగులు వేస్తోంది. మెరుగైన విద్యా విధానంలో చదువుకున్న యువతీ యువకులు, స్వాతంత్ర్యం వందేళ్ల పండుగను 2047లో జరుపుకుంటున్నప్పుడు ఆధునిక భారత స్వప్నాన్ని గుర్తించగలుగుతారు’.

(ప్రధాని నరేంద్ర మోదీ రాజ్‌కోటలోని శ్రీ స్వామి నారాయణ్ గురుకుల్ 75వ అమృత మహోత్సవ కార్యక్రమం సందర్భంగా స్ఫూర్తిమంతంగా చేసిన ప్రసంగంలోని భాగమిది.)

సైన్సు, మేథమెటిక్స్ వంటివి ఉంటాయి.

మధ్యస్థ దశ (మిడిల్ స్టేజ్)– ఆరు నుంచి ఎనిమిది తరగతుల విద్యార్థులు ఇందులోకి వస్తారు. అప్పుడు విద్యార్థి వయసు 11 నుంచి 14 ఏళ్ల వరకూ ఉంటుంది. ఈ దశలో మేథ్స్, సైన్సు, సోషల్ సైన్సెస్, ఆర్ట్స్, హ్యూమానిటీస్ వంటివి నేర్చు కుంటారు.

ద్వితీయ దశ (సెకండరీ స్టేజ్)–ఇందులో 9, 10 తరగతులు ఒక దశ, 11, 12 తరగతులు ఇంకో దశ. 14 ఏళ్ల నుంచి 19 ఏళ్ల వయసు విద్యార్థులు ఇందులోకి వస్తారు.

స్కూలు ఎడ్యుకేషన్‌లో చేపట్టిన ప్రధానమైన మార్పు.. విద్యార్థి ప్రతి సంవత్సరంలో పరీక్షలకు హాజరై తల పగలగొట్టుకోవలసిన పనిలేదు. 2, 5, 8 తరగతుల్లో పరీక్షలుంటాయి. ఆ తర్వాత 10, 12 తరగతుల్లో బోర్డ్ ఎగ్జామ్ ఉంటుంది. దీనిని కూడా రీ డిజైన్ చేస్తున్నారు. 6వ తరగతి నుంచి 'రికార్డింగ్' విధానాన్ని అమలు చేస్తున్నారు. ఎక్స్‌పరిమెంటల్ లెర్నింగ్‌కు ప్రాధాన్యం ఇస్తారు.

స్కూల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, అల్పాహారం అందిస్తారు. అలాగే కౌన్సిలర్లు, సోషల్ వర్కర్‌లను కూడా అందుబాటులో ఉంచుతారు. దీని ద్వారా విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

**వివిధ రాష్ట్రాల్లో అమలు**

జాతీయ విద్యావిధానాన్ని అమలు చేయటానికి ఉత్తర్వులిచ్చిన మొదటి రాష్ట్రం కర్ణాటక. అది 2021లో ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. ఆరేళ్ల వయసులో ఒకటో తరగతిలో చేర్చే విధానం అక్కడ అమలులో ఉంది. తర్వాత 26 ఆగస్టు, 2021న మధ్యప్రదేశ్ అనుసరించింది. దశలవారీగా దీనిని అమలు చేయదలిచామని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ ప్రకటించారు. గోవా ఈ ఏడాది ఎన్ఈపీ అమలు చేస్తానని ప్రకటించింది. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, రాజస్తాన్, అస్సాం రాష్ట్రాలు దీనిని అమలు చేయటానికి సన్నాహాలు చేస్తున్నాయి. జాతీయ విద్యావిధానంలో పేర్కొన్న అన్ని అంశాలను అమలు చేస్తున్నామని, పూర్తిగా ఈ విధానాన్ని అమలు చేస్తున్న తొలి రాష్ట్రంగా మేఘాలయ రికార్డులకెక్కుతుందని ఆ రాష్ట్ర సీఎం ప్రకటించారు. దాదాపు రెండు కోట్ల మంది విద్యార్థులకు ప్రయోజనం కలిగించేలా అక్కడ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు.

ప్రపంచమంతా రాజ్యాలు, రాజవంశాల గురించి చర్చించుకున్నప్పుడు, భారత దేశం గురుకుల విద్యావ్యవస్థను అమలు చేసింది. అవి సేవ, సమానత్వం, ప్రేమలకు ప్రతీకలుగా శతాబ్దాల పాటు నిలిచాయి. నలంద, తక్షశిల యూనివర్సిటీలు గురుకుల విద్యావ్యవస్థలకు పర్యాయ పదాలుగా ఉండేవి. పరిశోధనలు, ఆవిష్కరణలు అనేవి భారతీయ జీవనవిధానంలో ఒక భాగం. ఇప్పుడు దేశంలో కనిపిస్తున్న భిన్నత్వం, సాంస్కృతిక వైభవం అనేవి అప్పటి నుంచి వచ్చినవే. విద్య పైన జీడీపీలో 3, 4, 5 శాతం ఖర్చుచేయాలన్న చర్చలు సాగేవి. విద్యను విస్మరించారన్న విమర్శలు కూడా అధికంగా ఉండేవి. ఇప్పుడు విద్యకు బడ్జెట్లో 6 శాతం కేటాయించి విశేష ప్రాధాన్యం ఇస్తున్నారు. నలంద యూనివర్సిటీకి పూర్వవైభవం తేవటానికి రూ. 2,700 కోట్లు కేటాయించింది. ఇదంతా కేంద్రం సాధించిన అతి పెద్ద విజయం. ఎన్ఈపీలో మైలురాళ్లు.



ఎన్ఈపీ వల్ల సంస్థాగతంగా చోటుచేసుకున్న పరిణామాలు, దాని ప్రభావం గురించి కేంద్రం వివిధ సందర్భాల్లో ప్రకటనలు చేస్తూ వచ్చింది. మంత్రులు వివిధ వ్యాఖ్యాలు చేశారు. వీటి గురించి తెలుసు కుంటే ఎన్ఈపీ ఈ రెండేళ్లలో సాధించిన విజయాలను అర్థం చేసుకోవటం వీలవుతుంది.

**విద్యార్థుల్లో అంతర్గత సామర్థ్యం వెలికితీత**

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంతటి సృజనాత్మక ఆవిష్కరణ మరొకటి లేదని కేంద్రమంత్రి జితేంద్ర చెప్పుకొచ్చారు. బహుళ ఐచ్ఛిక విధానం కింద సాగే ఈ విధానం వల్ల భారతీయ విద్యావ్యవస్థ స్వరూప స్వభావాలే మారిపోతాయని అభిప్రాయపడ్డారు. 21వ శతాబ్దపు భారతదేశంలో అవసరమైన అభివృద్ధి సాధకమైన, దూరదృష్టితో కూడిన నిర్ణయమని అన్నారు. 'కేవలం డిగ్రీల కోసం కాకుండా, విద్యార్థులలో నిబిడీకృతమైన శక్తిసామర్థ్యాలను, ఆసక్తులను వెలికితీయటానికి ఉపయోగపడుతుంది. బహుళ కోర్సుల విధానాన్ని ఎంపిక చేసుకోవటం, వాటి నుంచి బయటపడే అవకాశాన్ని విద్యార్థులకు కల్పించటం వల్ల, అకాడమిక్‌గా వారికి స్వేచ్ఛ లభిస్తుంది' అన్నారు.


**క్రీడలు, స్కిల్ డెవలప్‌మెంట్ రంగాల్లో..**

క్రీడలు, స్కిల్ డెవలప్‌మెంట్‌కు ఎన్ఈపీ మైలురాయి అని కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ చెప్పుకొచ్చారు. 'స్కిల్ ఇండియా ప్రోగ్రామ్ కింద దేశానికి సంబంధించిన యువకులకు పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు లభిస్తాయి. సాఫ్ట్ స్కిల్స్‌పైన ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. దేశ, విదేశాల్లోనూ మన విద్యార్థులు రాణిస్తారు' అని అన్నారు.

'దేశం ఆజాదీ కా అమృతోత్సవ్' సంబరాలు జరుపుకుంటున్న ప్రస్తుత తరుణంలో, మనం వలసవాద మనస్తత్వం నుంచి బయటపడాలి. పశ్చిమం నుంచి వచ్చినది ఏదైనా విశిష్టమైనదన్న భావనను విడనాడాలి. నాణ్యమైన విద్యను అందించే హబ్‌గా భారత్‌ను తీర్చిదిద్దే దిశగా అడుగులు వేస్తున్నాం' అన్నారు భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు జె.పి.నడ్డా.

కొవిడ్–19 ప్రభావం మిగతా అన్ని రంగాల్లో మాదిరిగా నూతన విద్యా విధానం అమలుపైన పడింది. కార్యక్రమాలు మందగించాయి. కొవిడ్ నాటి పరిస్థితులు చాలా విషయాల్లో వచ్చిన పరిమితులు తెచ్చినట్టే టీచర్ల శిక్షణ, విద్యార్థుల బోధనల్లోనూ మార్పులు తెచ్చాయి. భిన్నమైన మార్గాలను ఉపాధ్యాయులు అన్వేషించారు. డిజిటల్ మార్గం వల్ల కలిగే ప్రయోజనాలు అర్థమయ్యాయి. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కూడా బాగా అలవాటు పడ్డారు. ఈ రకమైన అలవాట్లు కొత్త విద్యావిధానంలో మార్పులను త్వరితగతిన అందుకోవటానికి దోహదం చేస్తాయి. విద్యారంగంలో పరివర్తన వేగవంతమైంది. ఇదే తీరుగా ముందుకు సాగితే ప్రభుత్వం ఆశిస్తున్న మార్పులు సాధ్యమవుతాయి.

మారిన జీవశైలి, తల్లిదండ్రులలో వచ్చిన మార్పు, అపోహలు, విద్యారంగంలో వ్యాపార పోకడలు ఇవన్నీ విద్యా విధానాన్ని, విద్యార్థులను కొన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఆ క్రమంలోనే ఆరేళ్లకు ఒకటో తరగతిలో చేర్చాలన్న నిబంధన కాస్త అదుపు తప్పుతోంది. దీనిని మళ్లీ నిలబెట్టవలసిన అవసరం ఉంది. ★



ఇదే మార్చి నెలలో రెండు ప్రధాన సందర్భాలు. తొలి పక్షంలో ప్రపంచ వ్యాప్తంగా మహిళాదినోత్సవ సంరంభం. మలిపక్షంలో తెలుగు సంవత్సరాది ఉగాది మహోత్సవం. ఈ రెండూ ఉత్సవ ఉత్సాహాలే. స్థానికం నుంచి అంతర్జాతీయం వరకు ఎటుచూస్తే అటు సరికొత్త ఆశలూ, ఆశయాల పరంపరలే. వీటిల్లో మనం చూడాల్సింది వాడుక, వేడుకలను మాత్రమే కాదు.. అంతర్గతంగా నిండిన వాటిని మనసులోనే కేంద్రీకరిస్తే, ఒక విశాల భావన ఎవరికి వారికే ప్రత్యక్షమవుతుంది. ఇంతటి సువిశాలత నుంచే-ఇప్పటిదాకా మనమంతా చేసిందేమిటి? ఇక నుంచి చేయాల్సింది మరేమిటి? అన్నది ప్రస్ఫుట మవుతుంది. ఆ రోజు మొత్తం సందేశాలూ సమావేశాలూ శుభాకాంక్షలూ అభినందనలతోనే గడిపేస్తే సరిపోతుందా? ఊరూవాడా పండగగా చేసుకుని, ఆ మరునాటి నుంచే యథాపూర్వ స్థితితో సరిపెట్టుకుంటే అది ఉత్సవ ఉత్సాహం అనిపించు కుంటుందా? అనే ప్రశ్నలున్నట్లే సమాధానాలు కూడా మన ఎదురుగానే ఉన్నాయి. వాటి కోసం ఇంకెక్కడో వెదకాల్సిన అవసరమైతే ఎప్పటికీ లేదు. వంద మాటలు కట్టిపెట్టి ఒక్క పనైనా మొదలుపెడితే, అంతకుమించిన దినోత్సవం మరొకటి ఉండదు. అన్ని రంగాల్లోనూ సృజన, సాంకేతికత అంటున్నాం. సమానత కావాలని, ఇంటాబయటా అంతరం తొలగాలని నినదిస్తున్నాం. అంటే-సమాజ సాంకేతికీ కరణ. డిజిటల్ పేరు పదే పదే ప్రస్తావిస్తున్నాం కదా. ఇప్పుడిక డిజిటల్ కాదు... డిజిట్ ఆల్.

# మగువ విలువ తెలుసా?

డిజిటల్ భాగం, స్థానం, కళ అంతర్భాగాలు. ఇవి లేకుండా ఏ అడుగూ ముందుకు పడదు, పురోగతి ఏ విధంగానూ సాధ్యం కాదు. భాగం అనగానే చాలామంది ప్రశ్నార్థకంగా చూస్తారు. ఎంత, ఎందుకు, ఏమిటి, ఎలా, ఎప్పుడు వంటి ప్రశ్నలన్నింటినీ ఒక్కసారే ఒకే ఒక చూపుతో సంధిస్తారు. స్థానం అనే పేరెత్తితేనే మరింత మంది ఎన్నోది అన్నట్లు మొహం పెడతారు. ఇక కళ అంటే మటుకు చూపులన్నీ వికసిస్తాయి, వదనాలు



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్

కళకళలాడతాయి. 'అవునండీ. ఇంటికీ స్త్రీ మూర్తే కళాకాంతీ. ఆమె నవ్వితేనే ఇంటిల్లిపాదీ ఆనంద తరంగితం. అదే స్థానంలో ఏ విచారమో, విషాదమో చోటుచేసుకుంటే కుటుంబమంతటికీ అంతే సంగతి' అంటుంటారు. అలా అనుకునే, అనే వారంతా తెలుసుకోవాల్సింది మరొకటుంది. తగిన భాగం, సముచిత స్థానం, అన్నివేళలా కళలొలుకుతూ ఉంటేనే, వనితకు సరైన గుర్తింపూ, గౌరవం లభించి నప్పుడే సమాజమంతటికీ మనుగడ.

సామాజికంగా అతివ పరిస్థితి ఏమిటన్నది ఎవరూ ఎవరికీ ప్రత్యేకించి వివరించాల్సిన పనేమీ లేదు. శ్రమశక్తికి తానొక శాశ్వత ఉదాహరణ. ఐక్యరాజ్య సమితి ప్రకటనకు సంస్థాగత రజతోత్సవం ఏనాడో అయింది. ఒకటా, రెండా- ఇప్పటికీ పాతికేళ్ల పైమాట. 'గతాన్ని గుర్తించు, వనితభవితకు నీవంతు ప్రణాళిక రచించు' అంటూ ఎప్పుడో 1996లోనే ప్రచారాంశం వెలువడింది. శాంతి, హక్కులు, అహింస, సమత్వం, అభివృద్ధి, నిర్ణయశక్తి, అవకాశాల కల్పన, విద్య-శిక్షణ, సాధికారత, మార్పు, ఉదాత్త భవిత... ఇలా ఎన్నెన్ని ఉన్నా; అన్నింటికీ కీలకం, సర్వవిధాలా ప్రధానం స్త్రీ శ్రమశక్తి. ఆ ఏకైక ప్రాముఖ్యం ప్రతి ఒక్కరికీ తెలిసి, జీవితాలకు అన్వయించుకున్ననాడే ఉత్సవమైనా, ఉత్సాహమైనా!

### మాటలతో సరిపోదు

మహిళాదినోత్సవం మార్చి 8నే ఎందుకు? వివిధ దేశాల్లోని సామాజిక అనుభవాలే దీనికి సమాధానమిస్తున్నాయి. మొదట్లో ఇది మహిళా శ్రామిక ఉత్సవం. శ్రమశక్తి కనబరచినవారు సమాజంలో తమకు కావాల్సిన స్థానం, రావాల్సిన భాగం, అందుకోవాల్సిన కళ గురించి ముందుకు కదిలారు. విసుగూ విరామం లేకుండా పరిశ్రమిస్తున్న అందరికీ – నిర్ణీత విశ్రాంతి ఇవ్వాల్సిన సామాజిక బాధ్యతను 'గుర్తుచేశారు.' మన దేశంలోనైతే, గుజరాత్ వేదికగా ప్రత్యేకించి వస్త్ర పరిశ్రమ మహిళాశ్రామిక సంఘం

రూపొందింది. 'కలసి నడుద్దాం, ప్రగతి సాధిద్దాం' అంటూ ఆనాడు నేతృత్వం వహించినవారిలో ఎందరెందరో మహిళా మణులున్నారు. వనితల ప్రాధాన్యం తెలిపేలా, దినోత్సవ ఆవిర్భావం గురించిన పరిశోధనను అంతర్జాతీయంగా చరిత్రకారిణిరినీ నిర్వర్తించారు. అధికారిక గుర్తింపు సాధించేందుకు నటీమణి చేతా ఆ రోజుల్లోనే కృషి సాగించారు. భారత జాతీయంగా ఎన్నో పరిణామాలు సంభవించాయి. గుజరాతీ నేపథ్యంగా, పలు రాష్ట్రాలు ఎక్కడికక్కడ ఉత్సవాల నిర్వహణకు నడుంకట్టాయి. తెలుగు రాష్ట్రాలు రెండూ ప్రత్యేకత సంతరించే కార్యక్రమాలు చేపడుతున్నాయి.

కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు; మహిళా సంక్షేమ–అభివృద్ధి మంత్రిత్వ శాఖలు తమవంతు బాధ్యతల్లో నిమగ్నమవుతున్నాయి. దశాబ్దాల క్రిందట న్యూయార్క్ నగరాన మహిళాగణం నినదించడాన్ని నాయకులు నేటికీ ప్రస్తావిస్తుంటారు. అప్పట్లో పరిస్థితుల మెరుగుదల కోరుతూ నారీలోకం మార్చి నెల 8వ తేదీన కదిలింది. మహాసభలు నిర్వహించి, సమైక్యతను చాటి చెప్పింది. అది మొదలు అన్ని స్థాయుల్లో, దేశాల్లో ఇలా ఉత్సవ నిర్వహణలు. వీటి పూర్వాపరాల ప్రాచుర్యం మరింత జరిగితే తప్ప, వనితా నేతల జీవిత ఆకాంక్షలు నెరవేరవు. స్త్రీల పరంగా ఆలోచనలు సువిశాలమైతే తప్ప, నేటి స్థితిగతుల్లో మార్పు చేర్పులు రావు. వర్ణనలతో కాదు, అవగాహనా ప్రపూర్ణతతో వనితాభ్యుదయం సిద్ధిస్తుంది. కోరుకోవాల్సింది క్రియాశీలతనే!

**సవాళ్లు లెక్కలేనన్ని**

వనితల దినోత్సవ నిర్వహణం అంటే – కేవలం కొందరు విజేతల కథన పరంపరలు మటుకే కాదు. వర్ణనలు, ప్రశంసలకు మాత్రమే పరిమితమై వాస్తవిక పరిస్థితిని విస్మరించడం కాదు. ఆ ఒక్కరోజుతోనే పూర్తయ్యే ప్రసంగాల, సమావేశాల, పోటీల హోరాహోరీ కాదు. వాణిజ్య ప్రయోజనాలనే మేళవించి ప్రకటనలూ ప్రచారాలతో హోరెత్తించడం అంతకన్నా కాదు. ప్రతికూల భావనలను మెదడు నిండా నింపుకొని, ఉద్వేగాలూ, నిరసనలను సమాజమంతటా పరచడమూ కాదు. వాస్తవిక దృష్టి అంటూ ఉన్నప్పుడు, ఆలోచనల స్పష్టత సహజంగానే ముందు నిలుస్తుంది. 'అమ్మను పూజించు, భార్యను ప్రేమించు, సోదరిని దీవించు..' అని నీతిపాఠాలు వల్లె వేయించుకున్నా; స్త్రీని సాటిమనిషిగా గుర్తించి గౌరవించి ఆదరించే తత్వాన్ని ఆచరించడంవల్ల... ఎంత అవసరమో తెలిసేలా చేస్తే చాలు. మంచిని పంచి చెడును



సమస్త సృష్టిలో జననమైనా, గమనమైనా, జవమైనా, జీవమైనా, సృష్టి అయినా దృష్టి అయినా స్త్రీతోనే. ఆమె బాధితురాలైన ప్రతీ సందర్భమూ పురుషుడి ఉనికినీ మనికినీ ప్రశ్నార్థకం చేస్తున్నట్లే. ఏటేటా మహిళా దినోత్సవమనగానే; వారిపైన దురాచారాలూ, దురాగతాల గణాంకాలు వెల్లడించాల్సిన స్థితి నుంచి, సదాచారాలూ సమున్నత దశలను వివరించాల్సిన రోజు కావాలి, రావాలి.

తుంచాల్సిన వ్యవస్థలే నానా రకాల అవస్థలకు నెలవైనప్పుడు స్త్రీ మూర్తికి మన్నన ఇంకెక్కడ? ఎవరూ ఎవరికీ ఏదీచెప్పే స్థితి లేదిప్పుడు. తెల్లవారింది మొదలు పొద్దుపోయేవరకు; ఆ తర్వాత కూడా ప్రచార సమాచార సాధనాలు, పలు విధాల మాధ్యమాలు వెలువరిస్తున్న వన్నీ సామాజిక రీతిని ప్రస్ఫుటం చేస్తూనే ఉన్నాయి. వనితలపై నేరాలూ, ఘోరాలూ, వాటి అనంతర రీతులు సైతం మొత్తం మానవతకే పెను సవాళ్లుగా దాపురిస్తున్నాయి. పత్రికలూ, టీవీలూ, ఫోన్లూ ఇతరాల్లో వెల్లడవుతున్నవి కొన్నే; ఎవరికీ తెలియని, ఎంతకీ అంతుపట్టని, ఏనాటికీ బయటపడని అకృత్యాలు కొల్లలు. భావస్వేచ్ఛ మరీ విపరీతంగా ఉందో, అసలు స్వేచ్ఛ అనేదే అంతరిం చిందో తెలియదు కానీ – సమాజం కకావికలమవుతోంది. కొంతమంది వ్యక్తులు, కొన్ని సంస్థలు నోరెత్తి మాట్లాడటంవల్ల కనీసం వాస్తవా లేమిటో కాస్తో కూస్తో తెలుస్తున్నాయి. కలం యోధులు ఆయుధాల్ని ఝళిపించడం వల్లనే ఏవో కొన్ని పరిస్థితులైనా ఎంతో కొంత అదుపులోకి వస్తున్నాయి. అంతవరకూ సంతోషమే!

**మాతృశ్రీకారం**

భారతనారి తానే మాట్లాడితే, లోపలి భావాలకు వెలుపల స్వరరూపమిస్తే...

భారతీయ నారి నేను, భాగ్య సుధాధారను
లలిత నవోషస్సులా విలసిల్లిన బాలను.
నీ ఇంటిని వెలిగించిన నిరుపమ దీపాన్ని
నిను మానవునిగా చేసిన నిత్యశక్తి ధాత్రిని
జీవన సౌఖ్యామృతం చిందిన కల్యాణిని
నీ జీవిత పరిపూర్ణత నిలిపిన అర్థాంగిని

సమస్త సృష్టిలో జననమైనా, గమనమైనా, జవమైనా, జీవమైనా, సృష్టి అయినా దృష్టి అయినా స్త్రీతోనే. ఆమె బాధితురాలైన ప్రతీ సందర్భమూ పురుషుడి ఉనికినీ మనికినీ ప్రశ్నార్థకం చేస్తున్నట్లే. ఏటేటా మహిళా దినోత్సవమనగానే; వారిపైన దురాచారాలూ, దురాగతాల గణాంకాలు వెల్లడించాల్సిన స్థితి నుంచి, సదాచారాలూ సమున్నత దశలను వివరించాల్సిన రోజు కావాలి, రావాలి. అందుకే భారతాంబను అర్చిద్దాం ఇలా–

ఆమె బ్రహ్మర్షిజాత కల్యాణగీత
ధర్మ సముపేత వేదమంత్ర ప్రపూత
విశ్వవిఖ్యాత సుశ్రీల వెలయుగాత
పరమ కరుణాసమేత మా భరతమాత

అని పలికిన కరుణశ్రీ 'మాతృశ్రీ'ని ప్రార్థిద్దాం. ఏమని?

మహిళాదినోత్సవం ఒక్కరోజుకీ పరిమితం కారాదని

ప్రతిరోజూ ఆ ఉత్సాహమే శాశ్వతమై నిలవాలని. ★



# రెచ్చిపోతున్న ఖలిస్తాన్

**పాకిస్తాన్ సరిహద్దు రాష్ట్రం పంజాబ్‌లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. వేర్పాటువాదం జడలు విరబోసుకుంటోంది. తీవ్రవాదం రోజురోజుకీ పెట్రేగిపోతోంది. కొందరు అతివాదుల దుందుడుకు చర్యలు యువతను పెడదోవ పట్టిస్తున్నాయి. దీనికితోడు ప్రభుత్వ ఉదాసీనత పరిస్థితిని నానాటికీ క్షీణింపజేస్తోంది. అంతిమంగా పంజాబ్ ఉద్రిక్తతలకు ఆలవాలంగా మారింది. రాష్ట్రం ఎటువైపు ప్రయాణిస్తుందోనన్న ఆందోళన మేధావులను, సామాన్యులను కలచివేస్తోంది. పెడదోవ పట్టిన యువత వేర్పాటువాదంతో, విదేశీశక్తుల ప్రభావంతో రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మారుస్తోంది.**

ఇందుకు దారితీసిన పరిస్థితులను ఒక్కసారి అవలోకనం చేసుకుంటే ఆందోళన, ఆవేదన, ఆశ్చర్యం కలగక మానదు. 29 ఏళ్ల అమృతపాల్ సింగ్ అనే యువకుడు ఇప్పుడు రాష్ట్రంలో కేంద్రబిందువుగా మారాడు. పరిస్థితి అంతటికీ అతనే కారణం. తన వేర్పాటువాద, ప్రత్యేక ఖలిస్తానీ ప్రసంగాలతో అమాయక యువతను అతను పెడదోవ పట్టిస్తున్నాడు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి, పోలీసు యంత్రాంగానికి పెద్ద సవాల్‌గా మారాడు. అధికార యంత్రాంగానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాడు. అతని కార్యకలాపాలు పరాకాష్టకు చేరుకున్నాయి. ఎంతవరకు అంటే అరెస్టయిన తన సహచరుడిని విడిపించుకునేందుకు ఏకంగా పోలీస్ స్టేషన్‌పై దండెత్తే వరకు వెళ్లిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకుని ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాడు. అమృత్‌సర్ జిల్లా అజ్ నాలాలో ఇటీవల చోటుచేసుకున్న ఘటన రాష్ట్ర ప్రభుత్వ అధికారాన్నే సవాల్ చేసింది. ఖలిస్తానీ సానుభూతిపరుడైన తన అనుచరుడు లవ్ ప్రీతి తుపాన్ అరెస్టుకు నిరసనగా అమృత్‌పాల్‌సింగ్ నాయకత్వంలో వందల మంది పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారు. చివరికి వెనక్కితగ్గిన పోలీసులు లవ్ ప్రీత్ విడుదలకు అంగీకరించారు. దీన్నిబట్టి సింగ్ పోలీసులపై ఎంత ఒత్తిడి తీసుకువచ్చాడో అర్థమవుతుంది.

అమృత్‌పాల్ సింగ్ ఏడాది ముందు వరకు ఎవరికీ తెలియదు. అతనొక సాధారణ వ్యక్తి. మత సంప్రదాయాలను కూడా అంతగా పాటించేవాడు కాదు. ఆధునిక జీవనశైలిని అవలంబించేవాడు. కనీసం సిక్కుల సంప్రదాయ తలపాగాను కూడా ధరించేవాడు కాదు. కుటుంబ వ్యాపారాల నిమిత్తం కొంతకాలం దుబాయ్‌లో గడిపాడు. 'వారిస్ పంజాబ్ దే' సంస్థ వ్యవస్థాపకుడు, నటుడు దీప్ సిద్ధూ మరణంతో అమృత్‌పాల్ ఒక్కసారిగా తెరపైకి వచ్చాడు. అతని జీవితమే మారిపోయింది. సిద్ధూ అనుచరులకు నాయకుడిగా కొత్త అవతారం ఎత్తాడు. వారిస్ పంజాబ్ దే సంస్థకు తానే నాయకుడినని ప్రకటించుకున్నాడు. ఖలిస్తాన్ కార్యకలాపాల వేగం పెంచాడు. అనుచరులను కూడగట్టాడు. వారిలో వేర్పాటువాద భావోద్వేగాలను రగిల్చాడు. ఎంతో మంది ఖలిస్తానీవాదులు దేశ, విదేశాల్లో ఉన్నప్పటికీ అనూహ్య వేగంతో వారిని దాటి పోయాడు. కరడుగట్టిన ఖలిస్తానీవాదిగా తెరపైకి వచ్చాడు. దీంతో ఖలిస్తాన్ సానుభూతిపరులు, మద్దతుదారులు, యువకులకు అమృత్‌పాల్ ఒక్కసారి ఆరాధ్య దైవంగా మారిపోయాడు. ఇది ఎంతవరకు వెళ్లిందంటే కొంతమంది అభిమానులు ఆయనను భింద్రన్ వాలే–2గా పిలుచుకునే స్థాయికి చేరింది. అంతేగాక ప్రధాని, హోంమంత్రి వంటి వారిని మట్టుపెడతా మన్న హెచ్చరికలు వినపడుతున్నాయి. ఇందిరా గాంధీకి పట్టిన దుర్గతి వీరికీ పడుతుందన్న ప్రేలా పనలు చేస్తున్నారు. ఇది ఎంతమాత్రం క్షంతవ్యం కాదు. దేశ సమగ్రత, సార్వభౌమత్వ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ ఘటనలు సూచిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని, నిఘా వ్యవస్థలను బలోపేతం చేసుకుని ఖలిస్తానీవాదుల పీచమణిచేందుకు కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉంది.

### నాడేం జరిగింది?

తాజా పరిణామాలు 1980ల నాటి పరిస్థితులను తలపిస్తున్నాయన్న వ్యాఖ్యానాలు వినపడుతున్నాయి. అప్పట్లో పంజాబ్ రావణ కాష్టాన్ని తలపించింది. హిందువులను ఊచకోత కోశారు. హిందువులు, సిక్కులన్న విభజన స్పష్టంగా కనిపించింది. కొంపాగోడూ వదిలి హిందువులు బతుకుజీవుడా! అంటూ పొట్ట చేత పట్టుకుని వలసపోయారు.

రాష్ట్రంలో హిందువుల జనాభా గణనీయంగా తగ్గింది. నాటి ఖలిస్తానీ నాయకుడు సంత్ జర్నయిల్ సింగ్ భింద్రన్ వాలే నాయకత్వంలో వేర్పాటువాద సిక్కులు సృష్టించిన మారణ హోమాన్ని వర్ణించడానికి మాటలు చాలవు. నాటి కేంద్ర, రాష్ట్ర సర్కార్లు భింద్రన్ వాలెను కట్టడి చేయలేక చేతులెత్తాయి. సిక్కుల పవిత్ర క్షేత్రమైన స్వర్ణ దేవాలయం సాక్షిగా, కేంద్రంగా

రాష్ట్రంలో హిందువుల జనాభా గణనీయంగా తగ్గింది. నాటి ఖలిస్తానీ నాయకుడు సంత్ జర్నయిల్ సింగ్ భింద్రన్ వాలే నాయకత్వంలో వేర్పాటువాద సిక్కులు సృష్టించిన మారణ హోమాన్ని వర్ణించడానికి మాటలు చాలవు. నాటి కేంద్ర, రాష్ట్ర సర్కార్లు భింద్రన్ వాలెను కట్టడి చేయలేక చేతు లెత్తాయి. సిక్కుల పవిత్ర క్షేత్రమైన స్వర్ణ దేవాలయం సాక్షిగా, కేంద్రంగా జరిగిన అరాచకాలకు అంతే లేకుండా పోయింది. చివరికి స్వర్ణ దేవాలయంపై అనివార్యంగా సైనికచర్య జరిపే పరిస్థితి ఏర్పడింది.



# వాదులు

జరిగిన అరాచకాలకు అంతే లేకుండా పోయింది. చివరికి స్వర్ణ దేవాలయంపై అనివార్యంగా సైనికచర్య జరిపే పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటన పంజాబ్ చరిత్రలో, దేశ అధ్యాయంలో మాయనిమచ్చగా మిగిలిపోయింది. దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం జరిగిన ఆ ఘటన మరకలు ఇంకా మాసిపోలేదు. ప్రజల మనసుల నుంచి చెదిరిపోలేదు. స్వర్ణ దేవాలయంపై సైనికచర్యకు కాంగ్రెస్ మాజీ అధ్యక్షు రాలు క్షమాపణ చెప్పవలసి వచ్చింది. ఆ గాయాలు ఇంకా మానకముందే తాజాగా జరుగుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. సిక్కు సమాజం కూడా ఈ ఘటనలపై తన అసంతృప్తిని, ఆగ్రహాన్ని, ఆవేదనను వ్యక్తపరుస్తూనే ఉంది. కొందరి మూర్ఖత్వం వల్ల యావత్తు సిక్కు సమాజానికి చెడ్డపేరు వస్తుందన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీనత**

పంజాబ్‌లో నెలకొన్న ప్రస్తుత పరిస్థితికి కొంతవరకు రాష్ట్ర ప్రభుత్వమూ కారణమన్న వాదనను పూర్తిగా తోసిపుచ్చలేం. ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఖలిస్తానీవాదం చాపకింద నీరులా విస్తరిస్తూ పోయింది. అధికార యంత్రాంగం కూడా చూసీచూడనట్లు ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలున్నాయి. విస్తరిస్తున్న ఖలిస్తానీవాదం పట్ల భగవంత్ సింగ్‌మాన్ నాయకత్వంలోని ఆప్ సర్కారు అచేతనంగా వ్యవహరిస్తోంది. పోలీసు స్టేషన్‌పై దాడి ఘటన పట్ల ముఖ్యమంత్రి నుంచి సరైన స్పందన కొరవడింది. తనని తాను జాతీయ నాయకుడిగా భావించు కుంటున్న ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఖలిస్తానీవాదాన్ని ఖండించ డానికి మాటలు రావడం లేదు.

భావి ప్రధానిగా తనను తాను ఊహించుకునే కేజ్రీవాల్ రాష్టాన్ని కుదిపేస్తున్న సమస్యపై మౌనం వహించడం విడ్డూరంగా ఉంది. వాస్తవానికి ఆప్ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే ఖలిస్తానీవాదం పుంజుకోవడం, బలపడటం మొదలైంది. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టిన భగవంత్ సింగ్‌మాన్ ఖాళీచేసిన సంగ్రూర్ పార్లమెంటు సీటుకు జరిగిన ఉపఎన్నికలో ఆప్ భంగపడింది. 2019లో భారీ మెజార్టీతో మాన్ గెలిచినప్పటికి మొన్నటి ఉపఎన్నికల్లో 5 వేలకు పైగా ఓట్ల తేడాతో ఆయన పార్టీ ఓడిపోయింది. గెలిచిన అభ్యర్థి ఎవరో అకాలీదల్ లేదా కాంగ్రెస్ అభ్యర్థి కాదు. కరడుగట్టిన ఖలిస్తానీవాది సిమ్రన్‌జిత్ సింగ్. 2019లో కనీస ఓట్లు సాధించలేకపోయిన ఈయన ఉపఎన్నికలో ఏకంగా విజయం సాధించారంటే ఖలిస్తానీవాదం చాపకింద నీరులా ఎలా విస్తరిస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఈ పరిస్థితిని గమనించి అయినా ఆప్ ప్రభుత్వం అప్రమత్తం కావాల్సి ఉంది. కానీ అలాంటి చర్యలేమీ చేపట్టలేదు. దొంగలు పడిన ఆరు నెలలకు కుక్కలు మొరిగిన...అన్నట్లు తాజాగా భగవంత్ సింగ్‌మాన్ అమృత్‌సర్ ఘటనపై స్పందించారు. దీనివెనక పాకిస్తాన్ ఐఎస్ఐ హస్తం ఉందని ఆరోపించారు. తీవ్రవాదాన్ని అణచి వేసేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ప్రభుత్వ సహనాన్ని చేతగానితనంగా భావించవద్దని పేర్కొన్నారు.



అమృత్‌పాల్ సింగ్

పోలీస్ స్టేషన్ పై దాడి సందర్భంగా కొందరు యువకులు పవిత్రమైన గురుగ్రంథ్ సాహిబ్‌ను తీసుకురావడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. పవిత్ర మత గ్రంథంపై గల గౌరవంతో పోలీసులు సంయమనం ప్రదర్శించారని, అంతేతప్ప దానిని చేతగానితనంగా భావించవద్దని స్పష్టం చేశారు. ఈ విషయంలో కేంద్రంతో కలసి పనిచేస్తామని చెప్పారు. మాన్ మాటలు వినడానికి బాగానే ఉన్నాయి. ఆచరణలో ఎంతమేరకు వ్యవహరిస్తారన్నది చూడాలి. ఇక్కడ ఒక విషయాన్ని ప్రస్తావించాలి.

పాకిస్తాన్.. పంజాబ్ కన్నా గుజరాత్, రాజస్తాన్ తోనే ఎక్కువ సరిహద్దులు కలిగి ఉంది. కానీ ఆ రెండు రాష్ట్రాల్లో జరగని ఘటనలు పంజాబ్‌లోనే ఎందుకు జరుగుతున్నాయన్నది గమనార్హం. కేంద్రం విధానాలు, అభిప్రాయాలతో ఆప్‌కి, రాష్ట్ర ప్రభుత్వానికి రాజకీయంగా కొంత తేడా ఉండవచ్చు. దానిని కాదనలేం. సమాఖ్య, పార్లమెంటరీ విధానంలో ఇవి సహజం. కానీ దేశ రక్షణ, సమగ్రత, సమైక్యత విషయంలో ఒకేమాటపై నిలబడాలి. ముందుకుసాగాలి.

పార్టీలు, ప్రభుత్వాలు, రాజకీయాలను కాసేపు పక్కనపెట్టి వ్యవహరించాలి. దేశం కోసం కలసికట్టుగా పనిచేయాలి. ఖలిస్తానీ వాదం పట్ల దానికి దన్నుగా నిలుస్తున్న కొన్ని విదేశీ శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. వాటి కార్యకలాపాలపై నిఘా ఉంచాలి. వాటిని నిర్వీర్యం చేయాలి. బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియాలో ఖలిస్తాన్ శక్తులు బలంగా ఉన్నాయి. ముఖ్యంగా కెనడాలో అనేక సిక్కు సంస్థలు ఖలిస్తాన్‌కు అనుకూలంగా పనిచేస్తున్నాయి. ఆయా దేశాల్లో హిందూ ఆలయాలపై దాడులకు దిగుతున్నాయి. హిందువు లపై దాడులకు పాల్పడుతున్నాయి.

గత ఏడాది ధర్మశాలలోని హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ గోడలపై ఖలిస్తానీ నినాదాలు కనిపించాయి. ఖలిస్తాన్‌వాదం విస్తరణ వెనక పాకిస్తాన్ గూఢచార్య సంస్థ ఐఎస్ఐ (ఇంటర్ సర్వీస్ ఇంటలిజెన్స్) పాత్ర స్పష్టంగా ఉంది. రాష్ట్రంలో ఉగ్రవాదాన్ని ఉసి గొల్పేందుకు అది చేయని ప్రయత్నం లేదు. భారత్‌లో నిప్పులు పోయడమే ఐఎస్ఐ పని అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

ఇప్పటికైనా పంజాబ్‌లోని ఆప్ సర్కారు కళ్లు తెరవాలి. వేర్పాటువాద కార్యకలా పాలపై నిఘా పెట్టాలి. ఆ శక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలి. మాటల్లో కాకుండా చేతల్లో పనితనం చూపించాలి. ఈ విషయంలో కేంద్రంతో కలిసి నడవటం ఆప్ సర్కారు కర్తవ్యం.

**వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్**

# విశ్వనగరానికి



మనిషిని కుక్క కరిస్తే వార్త కాదు. మనిషి కుక్కను కరిస్తే వార్త అని జర్నలిజం విద్యార్థులకు బోధించేవారు. కాలం మారింది. కుక్కలు కరిచే స్థాయి నుంచి ప్రాణాలు తీసే స్థాయికి చేరాయి. అందుకే కుక్కలు మనుషులను కరచిన ఘటనలు టీవీల్లో, పత్రికల్లో ప్రధాన వార్తలుగా మారుతున్నాయి. దీన్నిబట్టే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. హైదరాబాద్‌లో నాలుగేళ్ల బాలుడు కుక్కల దాడిలో మృతి చెందిన దుర్ఘటన పెద్ద చర్చకే దారి తీసింది. ఈ దుర్ఘటన మిమ్మల్ని కదిలించలేదా అని కోర్టు అధికారులను ప్రశ్నించింది. కుక్కల దాడిలో ఆ చిన్నారి ప్రాణాలు కోల్పోవడంతో ప్రభుత్వ యంత్రాంగం కదలక తప్పలేదు. ఆగమేఘాల మీద చర్యలు ప్రారంభమయ్యాయి.

శునకాలు విశ్వాసానికి ప్రతీక. పెంపుడు శునకాలతో పెద్ద సమస్య లేదు. ఎవరికీ పట్టని వీధి కుక్కలతోనే సమస్య. విచ్చలవిడిగా సంచరించే ఈ కుక్కల మానసిక స్థితి ఎప్పటికప్పుడు మారుతూ ఉంటుంది. ఫిబ్రవరి 19వ తేదీన హైదరాబాద్, అంబర్‌పేట ఆరో నంబర్ బస్టాప్ సమీపంలో జరిగిన ఘటన తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ ప్రజల దృష్టిలో పడింది.

నిజామాబాద్ జిల్లా ఇందల్వాయికి చెందిన గంగాధర్ ఇక్కడ కార్ సర్వీసింగ్ సెంటర్‌లో వాచ్‌మన్. ఇద్దరు పిల్లలు. ఆరేళ్ల కూతురు, నాలుగేళ్ల కుమారుడు ప్రదీప్ ఉన్నారు. ఈ ఇద్దరితో గంగాధర్ తాను పనిచేసే కారు సర్వీసింగ్ సెంటర్ వద్దకు వచ్చాడు. ఆ సమయంలో బాలుని మీద వీధి కుక్కలు దాడి చేశాయి. కొందరు స్థానికులు ప్రదీప్‌ను ఆదుకుని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ప్రదీప్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సీసీ కెమెరాల్లో రికార్డయిన ఈ దృశ్యం ప్రతి ఒక్కరిని కదిలించింది. పసిబిడ్డ ప్రదీప్‌ని పీక్కు తిన్న రాకాసి కుక్కల దాడి జనం కంటి మీద కునుకులేకుండా చేసింది. తమ చుట్టూ ఉండే పసిపిల్లల ప్రాణాలను ఎలా రక్షించుకోవాలో తెలియని పరిస్థితిలోకి నగర వాసుల్ని నెట్టేసింది.

**పెరిగిపోయిన కుక్క కాట్లు**

అంబర్‌పేట ఘటన మొదటిది కాదు. గ్రేటర్ హైదరాబాద్‌లో కుక్క కాట్లు సర్వసాధారణ మయ్యాయి. బస్తీలు, కాలనీలు వీధుల్లో పెద్ద సంఖ్యలు కుక్కలు కనిపిస్తున్నాయి. కనిపించిన వారిపై దాడి చేస్తున్నాయి. బాటసారులు, వాహనాలపై వెళ్లుతున్నవారి వెంటపడి మరీ కరుస్తున్నాయి. రాత్రే కాదు పగలు కూడా బయటి రావాలంటే జనం వణికిపోతున్నారు. కాలినడకన వెళ్లాలంటే భయపడుతున్నారు మార్నింగ్ వాక్‌కి వచ్చినవారినీ, రాత్రి విధుల నుంచి తిరిగి వచ్చే వారినీ అవి వదిలిపెట్టడం లేదు.

మేడ్చల్ మల్కారం పరిధిలో ఇటీవల పాఠశాలకు వెళ్తున్న ఏడేళ్ల విద్యార్థిపై వీధి కుక్కలు దాడి చేసి కాలును తీవ్రంగా గాయపరిచాయి. స్థానికులు అడ్డుకోవడంతో బాలుడికి ప్రాణాపాయం తప్పింది. ఓల్డ్ అల్వాల్‌లోని ప్రెసిడెన్సీ కాలనీలో వీధికుక్కలు 20 మందిని కరిచాయి. ఆ కాలనీ కాపలాదారుడి నాలుగు సంవత్సరాల కుమారుడి కండ పీకేయడంతో నెల రోజులు ఆసుపత్రిలో చికిత్స అందించి రక్షించారు. చికిత్సకైన ఖర్చు రూ. లక్షను కాలనీ వాసులందరూ విరాళాలు సేకరించి భరించారు. కంచన్‌బాగ్‌లోని డీఆర్‌డీవో టౌన్‌షిప్‌లో మూడు వారాల క్రితం ఐదేళ్ల బాలుడు ఇంటి వద్ద ఆడుకుంటున్న సమయంలో శునకాలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. టౌన్‌షిప్‌లో కుక్కల బెడద నుంచి రక్షించాలని కోరుతూ రక్షణోద్యోగులు ఇటీవల ఆందోళన నిర్వహించారు.

**మహానగరంలో 2.75 లక్షల శునకాలు**

2022 గణాంకాల ప్రకారం కుక్క కాటు కేసుల్లో తెలంగాణ రాష్ట్రం 8వ స్థానంలో ఉంది. గ్రేటర్ హైదరాబాద్ నగరపాలక సంస్థ (జీహెచ్ఎంసీ) పరిధిలో ఏటా కుక్కకాటు కారణంగా 50 మందికి పైగా చనిపోతున్నారు. దాదాపు వెయ్యిమందికిపైగా తీవ్రంగా గాయపడున్నారు. ఈ సంఖ్య ఇటీవలి కాలంలో ఆశ్చర్యకరమైన స్థాయిలో పెరిగిపోయింది. కుక్క కాటుకు యాంటీ రాబీస్ వ్యాక్సిన్ వేసే నారాయణగూడలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం)కు రోజూ 200 మంది బాధితులు వస్తున్నారు.

ఒక్క శేరిలింగంపల్లి ప్రాథమిక వైద్య కేంద్రానికే



# కుక్కకాటు

క్రాంతి

నిత్యం 5 నుంచి 10 మంది వరకు యాంటీ రాబీస్ వ్యాక్సిన్ తీసుకోవడానికి వస్తున్నారు. ప్రస్తుత ఫిబ్రవరి మాసం ముగియక ముందే ఇప్పటికే 164 మంది ఆసుపత్రికి వచ్చారు. డిసెంబరులో 278 మంది, జనవరిలో 172 మంది వచ్చి చికిత్స చేయించుకొని టీకా తీసుకున్నారు. ఫీవర్ ఆస్పత్రిలో కొద్ది రోజులుగా అవుట్ పేషెంట్ కేసుల్లో 40 శాతం కేసులు కుక్క కాటువే ఉంటున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే వారిలో ఎక్కువ మంది కుక్క కాటు బాధితులే. కుక్క కాటుతో వచ్చే రాబిస్‌తో చాలా ప్రమాదం.

హైదరాబాద్ మహానగరంతో పాటు శివారు ప్రాంతాల్లో దాదాపు 5.75 లక్షల కుక్కలు ఉన్నాయి. ఇదే ఇప్పుడు అతిపెద్ద సమస్య. మహానగరంపై వేసవి ప్రభావం అప్పుడే మొదలైంది. ఎండల ప్రభావం మనుషులతో పాటు జంతువులపై కూడా తీవ్రంగా పడుతోంది. దీంతో వీధి కుక్కలతో పాటు పెంపుడు కుక్కలు కూడా పిచ్చికుక్కల మాదిరి ప్రవర్తిస్తున్నాయి. నీడతో పాటు నీళ్లు, ఆహారం, చల్లని వాతావరణం దొరక్క అల్లాడిపోతున్నాయి.

**అనుమానాస్పద మృతా?**

వీధి కుక్కల బెడదకు సంబంధించి అడుగడుగునా అధికారులు, పోలీసుల నిర్లక్ష్యం కనిపిస్తున్నది. అంబర్‌పేట ఘటనలో మూడు రోజుల తర్వాత పోలీసులు తీరిగ్గా స్పందించారు. మీడియాలో వరుసగా వార్తలు రావడంతో న్యాయ సలహా తర్వాత కేసు నమోదు చేశారు. 174 సీఆర్పీసీ కింద అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. కుక్కల దాడిలో చనిపోతే అనుమానాస్పద మృతి కేసు నమోదు చేయటంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ ఘటనకు కారణమైన వారిని నిందితులుగా చేర్చుతూ వారిపై కేసులు పెట్టకుండా అనుమానాస్పద మృతిగా కేసు పెట్టటమేంటని మండిపడుతున్నారు. వీధి కుక్కల బెడద తగ్గించాలంటూ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించట్లేదంటూ యంత్రాంగం మీద విమర్శలు గుప్పించారు. మున్సిపల్ మంత్రి, నగర మేయర్ మీద, జీహెచ్ఎంసీ కమిషనర్, అధికారుల మీద తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎవరి మీద కేసు పెట్టాలన్న అయోమయంలో పోలీసులు పడ్డారు. కుక్కలు రెచ్చిపోతున్నా జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం తోనే వాటి బారిన పడుతున్నామని జనం ఆరోపిస్తున్నారు. కుక్కల సంచారంపై జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేస్తే సిబ్బంది చుట్టపుచూపుగా వచ్చి దొరకట్లేదంటూ వెళ్లిపోతున్నారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు తప్ప ఇతర సమయాల్లో ఈ సమస్యపై అధికారులు సమీక్ష కూడా చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు.

ఈ పరిణామాలలో కొన్ని విస్తుపోయే అంశాలు కూడా ఉన్నాయి. హైదరాబాద్‌లో కుక్కల సంచారం పెరగడానికి కారణం ఏమిటి? ఇక్కడ ఉన్నవి చాలవన్నట్లు గజ్వేల్ కుక్కలను తెచ్చి ఇక్కడ వదిలేశారా? అంటే అవుననే అంటున్నారు. గజ్వేల్‌లోని ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్ ఏరియాలో వీధి కుక్కల సంచారం పెంచింది. గతేడాది జీహెచ్ఎంసీ సిబ్బందిని గజ్వేల్ రప్పించారు. వారు సీఎం ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాలతోపాటు చుట్టు పక్కనున్న గ్రామాల్లో మూడు రోజుల స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 200 కుక్కలను పట్టుకున్నట్లు సమాచారం. నిబంధనల ప్రకారం వాటికి వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసి పట్టుకున్న ప్రాంతంలోనే వదిలేయాలి. కానీ వాటిని జీహెచ్ఎంసీ సిబ్బంది స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ చేయకుండా వాటిని నాలుగు దఫాలుగా హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో వదిలేశారనే ఆరోపణలున్నాయి. నగరంలో ఒకే ప్రాంతంలో వదిలేస్తే స్థానికంగా వ్యతిరేకత వస్తుందని భావించిన సిబ్బంది వాటిని హాఫీజ్ పేట, శేరిలింగంపల్లి, కొండాపూర్, పటాన్ చెరుతో పాటు సికింద్రాబాద్ జోన్‌లోని అంబర్‌పేట, మరికొన్ని సర్కిళ్లలో వదిలిపెట్టారని సమాచారం. సికింద్రాబాద్ జోన్‌లో సుమారు 86 కుక్కలను వదిలిపెట్టగా, వాటిలో ఎక్కువగా అంబర్‌పేట సర్కిల్‌లోనే విడిచి పెట్టినట్లు తెలిసింది. గ్రామీణ వాతారణంలో పెరిగిన కుక్కలు నగరంలోని రణ గొణ ధ్వనులు, గందరగోళ వాతావరణంతో ఆందోళనకు గురై రెచ్చిపోతున్నాయని భావిస్తున్నారు. అంబర్‌పేటలో బాలుడిని చంపింది గజ్వేల్ కుక్కలే అయి ఉంటాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



అంబర్‌పేట్ ఘటన

అంబర్‌పేట ఘటన జరిగిన తర్వాత జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి తన కార్యాలయంలో పశువైద్య విభాగం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. దాడికి పాల్పడ్డ శునకాలకు ఓ స్థానిక మహిళ నిత్యం మాంసాహారం వేసేది. రెండు రోజులుగా అమె లేకపోవడంతో కుక్కలు ఆకలితో ఉండిపోయాయి. అందువల్లే పసి బాలునిపై క్రూరంగా దాడి చేసుండొచ్చు."అన్నారు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వీధి కుక్కల దత్తతకు నగరవాసులు ముందుకు రావాలని, దీన్ని ప్రోత్సహించేందుకు ప్రతి ఆదివారం శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. వీధి కుక్కలకు ఎలాంటి ఆహారమివ్వాలి, దాడి చేసేందుకు యత్నిస్తే ఎదుర్కోవడం ఎలా.. వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తామని వివరించారు.



**ప్రాణాలకు విలువలేదా?**

మేయర్ వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. కుక్కల దాడిలో బాలుడు చనిపోతే

ఇంతవరకు సీఎం స్పందించలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో ఫామ్‌హౌజ్‌లో కుక్కకు ఉన్న విలువ మనుషులకు లేదని విమర్శించారు. వీధి కుక్కలను అరికట్టే బాధ్యత జీహెచ్ఎంసీపై ఉన్నా ఆ దిశగా అధికారులు కృషి చేయడం లేదని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ విమర్శించారు. విశ్వనగరంలో బీఆర్ఎస్ పాలన కుక్కలు బాలునిపై దాడి చేసి చంపే వరకు వచ్చిందని వ్యాఖ్యానించారు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ 'నో వర్డ్స్ 2 కన్సోల్' అంటూ ట్వీట్ చేశారు. వీధి కుక్కల బెడదను ఎదుర్కోవడానికి ప్రస్తుతం ఉన్న ఏర్పాట్లు సరిపోవని ఈ సంఘటన రుజువు చేస్తున్నందున అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. మేయర్ చేసిన వ్యాఖ్యలపై సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ తనదైన శైలిలో సెటైరికల్ కామెంట్స్ చేశారు. పిల్లల ప్రాణం కంటే కుక్కల ఆకలి గురించి ఆలోచించడమేంటని మండిపడ్డారు. అంతగా ఉంటే మేయర్ గారు కుక్కలన్నింటినీ ఇంటికి తీసుకువెళ్లి ఆహారం పెట్టొచ్చు కదా అని కామెంట్ చేశారు. కుక్కలన్నీ మేయర్ ఇంట్లో ఉంటేనే పిల్లలకు రక్షణ ఉంటుందని సెటైర్ వేశారు. కుక్కలను ఒక్క దగ్గరకు చేర్చి మేయర్‌కు పంపండి అంటూ కామెంట్స్ చేశారు. ఇదంతా కుక్కల దాడి, బాలుని మృతి ఎంత తీవ్రంగా కదిలించిందో చెబుతోంది.

**ఆగ్రహం వ్యక్తం చేసిన హైకోర్టు**

వీధి కుక్కలు మనుషులపై దాడులు చేయకుండా ఏం చర్యలు తీసుకున్నారంటూ ప్రభుత్వాన్ని, జీహెచ్ఎంసీని హైకోర్టు ప్రశ్నించింది. బాలుడి మృతి ఘటన మీ మనసులను కదిలించలేదా అని ప్రశ్నించింది. ప్రదీప్ మృతి చెందిన ఘటనపై పత్రికల్లో వచ్చిన వార్తలను హైకోర్టు సుమోటోగా పరిగణనలోకి తీసుకుంది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్.తుకారాంజీలతో కూడిన ధర్మాసనం ఫిబ్రవరి 23న విచారణ చేపట్టింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి, జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ కలెక్టర్, జీహెచ్ఎంసీ అంబర్‌పేట డిప్యూటీ కమిషనర్, లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శులను ప్రతివాదులుగా చేరుస్తూ నోటీసులు జారీ చేసింది. కుక్కలకు ప్రత్యేక ఆశ్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తే రోడ్లపై సంచరించే అవకాశం ఉండదని పేర్కొంది. ఈ అంశంపై పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. జీహెచ్ఎంసీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ బాలుడిపై దాడి చేసిన మూడు కుక్కలకు స్టెరిలైజ్ చేసి వదిలిపెట్టారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. కుక్కల దాడిలో మృతి చెందిన ఘటన పరిహారానికి అర్హమైన కేసు అని, బాలుడి తల్లిదండ్రులకు పరిహారం అంశాన్ని వచ్చే విచారణలో పరిశీలిస్తామంటూ విచారణను ధర్మాసనం మార్చి 16వ తేదీకి వాయిదా వేసింది.

**స్టెరిలైజేషన్ పేరుతో అవినీతి**

అసలేం జరుగుతోందని ఆరా తీస్తే కనిపించిన లెక్కలు విస్తుగొలిపాయి.. ఒకప్పుడు కుక్కలను బంధించి వధించేవారు. అయితే బ్లూక్రాస్, పెటా వంటి జీవకారుణ్య సంఘాల విజ్ఞప్తితో గత మూడు దశాబ్దాలుగా నగర పాలక సంస్థ కుక్కలను చంపకుండా వాటికి సంతానోత్పత్తి కలగకుండా (స్టెరిలైజేషన్) జంతు జనన నియంత్రణ (ఏబీసీ) శస్త్రచికిత్స చేస్తున్నారు. ఇందు కోసం జీహెచ్ఎంసీ వెటర్నరీ విభాగం అయిదు స్వచ్ఛంద సంస్థల సహాయం తీసుకుంటోంది.




మహానగరంలోని 75 శాతం కుక్కలకు స్టెరిలైజేషన్ పూర్తయిందని, ఇందు కోసం రూ.15 కోట్ల ఖర్చు చేశామని అధికారులు చెబుతున్నారు. ఇదే నిజమైతే వీధి కుక్కలు ఎప్పుడో అంతరించి ఉండాలి. కానీ కుక్కల సంఖ్య రోజు రోజుకీ పెరుగు తోంది. ప్రదీప్‌పై మూకుమ్మడిగా దాడి చేసి మృతికి కారణమైన శునకాలను జీహెచ్ఎంసీ వెటర్నరీ విభాగం వారు పట్టుకున్నారు. దాడి చేసింది ఓ తల్లికుక్క, సంతానమని తేలింది. అయితే తల్లికుక్కకు గతంలోనే స్టెరిలైజేషన్ జరిగినట్లు రికార్డులు చెబుతున్నాయి. మరి దానికి పిల్లలు ఎలా పుట్టాయన్నదే ప్రశ్న. జీహెచ్ఎంసీలో జంతు జనన నియంత్రణ(ఏబీసీ) శస్త్రచికిత్స పేరిట జరుగుతున్న అవినీతికి ఇదే ఉదాహరణ.

ఒకటి, రెండు దురదృష్టకర ఘటనలు దృష్టిలో పెట్టుకుని ఎంతో విశ్వాసంగా ఉండే కుక్కలను శత్రువులుగా చూడొద్దని ప్రముఖ నటి, బ్లూక్రాస్ వ్యవస్థాపకురాలు అక్కినేని అమల అన్నారు. మాసాబ్‌ట్యాంక్‌లోని శాంతినగర్ సంక్షేమ సంఘంలో జీహెచ్ఎంసీ నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అమల పాల్గొన్నారు. ఇటీవల చోటు చేసుకున్న అవాంఛనీయ ఘటనలు జనంలో కోపాన్ని, ఆవేశాన్ని కలిగించాయని ఆమె అంగీకరించారు. అయితే, వాటిని కొట్టటం లేదా చంపడం వల్ల సమస్య పరిష్కారం కాదన్నారు. కుక్కలను ఓపికగా ప్రేమగా చూస్తే అవి పదింతలు మనల్ని ప్రేమిస్తాయన్నారు. వాటి ప్రాణాల్ని సైతం ఇచ్చి ఇతరులను కాపాడిన ఉదంతాలు కూడా ఉన్నాయని అమల వ్యాఖ్యానించారు. కుక్కలకు రాబిస్, కు.ని. ఆపరేషన్లు చేసుకుంటూ ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. నిజంగా ఇలాంటి వ్యాఖ్యలు జనంలో గందరగోళం సృష్టిస్తాయి. మనుషుల ప్రాణాల కన్నా కుక్కల హక్కులకే ఎక్కువ ప్రాధాన్యం ఉందన్న భావన వ్యక్తమవుతున్నది. పెటా వంటి సంస్థలు చేసే సూచనలు ఆచరణ సాధ్యమైన వేనా? ఇంకా వీధి కుక్కలకు ఉన్న హక్కులు ఆవులకు, అడవిలో లేళ్లకు, నెమళ్లకు లేకపోవడం విచిత్రమనే వారు కూడా ఉన్నారు. రాబిస్ వంటి కారణమయ్యే కుక్కకాటు విషయంలో కారుణ్యం కంటే వాస్తవికంగా వ్యవహరించడం అవసరం కాదా!

రాబిస్ మిషన్, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో గోవా రాష్ట్ర ప్రభుత్వం వీధి శునకాలను మూడేళ్లలో నియంత్రించగలిగింది. గత మూడేళ్లలో కుక్కకాటు కారణంగా అక్కడ ఎవరూ చనిపోలేదు. అన్నింటికీ ఏటా టీకాలు వేయడం, ప్రతి కుక్కకు వయసు రాగానే పిల్లలు పుట్టకుండా శస్త్రచికిత్స చేయడం, దాడి నుంచి తమను తాము ఎలా రక్షించుకోవాలో తెలుపుతూ పాఠశాల విద్యార్థులకు, మహిళలకు అవగాహన కల్పించడం, ఇతరత్రా చర్యలతో స్థానిక ప్రభుత్వం మంచి ఫలితాలు సాధించింది. దేశంలోని పలు ఇతర రాష్ట్రాల్లోనూ ఏబీసీ కార్యక్రమం మంచి ఫలితాలిస్తుండగా.. జీహెచ్ఎంసీ పరిధిలో మాత్రం పది హేనేళ్లుగా సాధ్యపడట్లేదు. అది గుర్తిస్తే కుక్కల బెడద నివారణకు మొదటి మెట్టు కాగలదు. ★

# ఇంకెవ్వరు? నువ్వేరా



మా వూరు భోన్గరి. మా ఊల్లె మూడు బదులున్నయి. ఒకటి బాగాయత్. గాదాంట్ల ఒకటో తరగతి కాడికెల్లి మూడో తరగతి దాంక ఉండేది. రొండోది బీచ్ మహల్లా. గీదాంట్ల నాల్గో తరగతి కెల్లి ఎన్మిదో తరగతి దాన్క ఉండేది. మూడోది పెద్దబడి. పెద్దబడిల తొమ్మిదో తరగతికెల్లి పన్నెండో తరగతి దాంక ఉండేది. గీ మూడు బడులల్ల సత్నారి నేను సద్వుకున్నం. ఇద్దరం ఒకే తరగతిల పక్కపక్కనే గూసుండెటోల్లం.

సత్నారి, నేను ఒకే వాడకట్టుల ఉండెటోల్లం. ఒక్క తీరు ఆటలనే ఆడెటోల్లం. యాడికి బోయినా ఇద్దరం గల్సి బోయెటోల్లం. ఒక్క మంచంల పండుకున్నా, ఒక్క తల్లెలనేల దినకున్నా మేమిద్దరం జిగ్రిదోస్తులం, మొగులు మీద మస్తు సుక్కలున్నా చందమామ ఒక్కడే. గదే తీర్గ నాకు శానమంది దోస్తులున్నా సత్నారి గాడొక్కడే జాన్ జిగ్రి.

బడి ఇడ్సిపెట్టినంక ఒక దినం గోటీలాడితె ఇంకొక దినం గిల్లిదండ ఆడెటోల్లం. గిల్లిని దండతోని లాసిగ కొట్టుట్ల నేను నంబర్ వన్. బొద్దికాడ ఉంచిన దండను సూటి జూసి గిల్లితోని కొట్టుట్ల సత్నారి అసువంటి దార్‌కార్ మా దోస్తులల్ల ఎవ్వడు లేదు. పెద్ద గైనంక మేము కిరికిట్ ఆడెటోల్లం. నేను ఓపెనింగ్ బాట్స్‌మెన్ అయితే సత్నారి నంబర్‌వన్ ఫాస్ట్ బోలర్.

డిగ్రి అయినంక భోన్గిరి తాసిల్ కచేరిల సత్నారికి కొల్వు దొర్కింది. నేను బడిపంతులునైన. నాకు పట్నంల కొల్వు దొర్కింది. కొల్వులు దొర్కెదాంక ఇద్దరం గల్సి దిర్గెటోల్లం. గని కొల్వుకొచ్చినంక అల్లగైనం. ఎవరి బతుకు ఆల్లదైంది. ఎవరి సంసారం ఆల్లదైంది. ఎవరి బాధలు ఆల్లవైనయి. మా పెండ్లిండ్లు అయినయి. పిల్లలు బుట్టిండ్రు. నాకు ఒక కొడ్కు. బిడ్డ. సత్నారికి ఇద్దరు కొడ్కులు.

భోన్గిరి బోక శానొద్దులైంది. ఒకసారి బోయొస్తె బాగుంటదనిపిచ్చింది. పెండ్లాం పిల్లలను దీస్కోని వూరికి బోయిన. పొద్దు వూకినంక నేనొక్కనే సత్నారి ఇంటికిబోయిన. గాడు నన్ను బిర్రుగ కాగలిచ్చు కుండు. గాని పెండ్లాం మిర్చిబజ్జి జేసింది. ఉడుకు డుకు ఛాయ్ ఇచ్చింది. సత్నారిగాని చిన్నపోరనికి ఏడేండ్లు. గాని చేత్ల బోర్నవిట సీస ఉన్నది.

“ఏంరా! బోర్నవిట తింటావా? తాగుతవా?” అని గాన్ని అడ్గిన.

“బారబోస్త. నీకేమన్న బాదనా” అని గాడు అడిగిండు. గాడు గట్ల అనంగనే ఏమనాలెనో ఎర్కలేక ఎడ్డిమొకం ఏస్కున్న.

సైమం ఎప్పుడు ఒక్క తీర్గనే ఉండదు. గదే తీర్గ మనం గుడ్క ఎప్పుడు ఒక్క తీర్గనే ఉండం. ఒకప్పుడు సత్నారి, నేను పోరలం. అటెంకల పెద్దోల్లం. గిప్పుడు ముసలోల్లం.

పిల్లల సద్వులు జెయ్యబట్కే వజీప దీస్కునంక గూడ నేను పట్నంలనే ఉన్న. పొలాలుండె బట్కె సత్నారి భోన్గిరిలనే ఉన్నాడు. పని మీద పట్నం గినొస్తె తప్పకుంట గాడు మా ఇంటికి వొచ్చెటోడు. పని లేకున్నా నెలకొకసారి నేను భోన్గిరి బోయెటోన్ని. సత్నారితోని గల్సి ఊరంత దిర్గెటోన్ని. ఇద్దరం గల్సి భారత్ టాకిస్ల సిన్మ జూసెటోల్లం. పాత సంగతులు యాదికి రాంగ పాతముచ్చట్లు జెప్పుకునేటోల్లం.

ఏదో ఒక పని ఉండెబట్కె ఊరికి బోక మూడునెలలైతున్నది. సత్నారి గూడ పట్నం రాలేదు. గాని పెయ్యి బాగ లేదని ఎర్కైంది. చేతులు, కాల్లు పడిపోయినయని ఇగ దాంతోని గాడు మంచంలనే ఉంటున్నడని తెలిసింది. గీ సంగతి ఎర్కగాంగనే గాన్ని సూసెతందుకు ఊరికి బోయిన.

సత్నారి ఎప్పుడు ఒకతాన గూసుండెటోడుగాదు. పని ఉన్నా లేకున్నా అటిటు దిరిగెటోడు. ఆనిది తిట్టే నోరుగాదు. గని తిరిగే కాలు. గసువంటోడు గిప్పుడు ఇర్వై నాలుగ్గంటలు మంచంలనే ఉంటున్నడు.

గాన్ని సూడంగనే నాకు ఏడ్పు వొచ్చింది.

“అరే నా దినాలు దగ్గరబడ్డయిరా. ఎక్వల ఎక్వ వారం దినాలు బత్కుతరా” అని సత్నారి అన్నాడు.

“గట్లనకురా”

‘‘అరే యాడికిబోయినా మనిద్దరం గల్సిబోయెటోల్లం. గిప్పుడు నేనొక్కన్నే సొర్గంకెట్లా బోవాలెరా. నువ్వు గూడ నాతోని రారా” అని సత్నారి అన్నాడు.

“నువ్వుగిన సొర్గం బోతె గాడ ఏయే ఆటలు ఆడుతున్నరో అర్సుకుని నాకు జెప్పురా”.

“నీకెట్ల జెప్పాలె” అని గాడు అడిగిండు.

“నా కలల గండ్లబడి జెప్పురా.”

నెల దినాలైనంక సత్నారి కాలం జేసిండు. సచ్చినవారం దినాలకు గాడు నా కలల గండ్లబడ్డడు.

“సొర్గంల గూడ ఆటలాడ్తున్నారురా” అని గాడు అన్నాడు.

“కిరికిట్ గిన ఆడ్తున్నారా?” అని అడిగిన.

“ఆడ్తున్నరు” వారం దినాలైనంక సొర్గం, నర్కం టీంల నడ్మ టెస్ట్ మ్యాచ్ ఉన్నది.”

“నువ్వు గిన ఆడ్తున్నవా?”

“ఆడ్తున్న. నేనే మెయిన్ బోలర్‌ను” అని సత్నారి అన్నాడు.

“ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ ఎవరు?”

“ఓపెనర్ నువ్వేరా”

“నేను ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్గ మంచిగ ఆడ్తనని గాల్లకెవలు జెప్పిండ్రు.”

‘నేనే జెప్పినరా” అని గాడు అన్నాడు.

“ఎంత జిగ్రిదోస్తువైనా గట్లెందుకు జెప్పినవురా”

‘‘ఈడ నువ్వు లేకుండబట్కె నాకు ఎటూ సుద్రాయిస్తలేదు. పిచ్చిలేసినట్లున్నది” అని గాడు అన్నాడు.

కలల సత్నారి గట్ల జెప్పగనే నాకు మేల్కొచ్చింది. నల్లచెమ్టలు బడ్డయి. నా దినాలు దగ్గరబడ్డయని ఎర్కైంది. ★




తెలిదేవర భానుమూర్తి

సీనియర్ జర్నలిస్ట్, 9959150491

# లంకా ద్వారాధికారిణి లంకిణి



లంకిణి లంకానగరానికి కావలి కాసే దేవత. అంటే గ్రామదేవతలాంటిదన్న మాట. లంకానగరంలో ప్రవేశిస్తున్న హనుమను ఆమె చూసింది. ఆయనా ఆమెను చూశాడు. తక్షణమే కోపంతో వూగిపోతూ అసహ్యమైన ముఖాన్ని, భయంకరమైన రూపాన్ని దాల్చిన లంకిణి హనుమంతుడికి అడ్డంగా నిల్చి గర్జిస్తూ, "ఏయ్, కోతీ! నువ్వెవరివి? ఎందుకొచ్చావు? నీవు చావక ముందే చెప్పు" అని ప్రశ్నించింది. కట్టుదిట్టమైన కాపలాతో రావణుడి సేనల రక్షణలో ఉన్న లంకా నగరంలోకి దేవతలే ప్రవేశించలేరే! అలాంటిది నువ్వెలా వచ్చావు?" అని గద్దించింది.

"నా సంగతి తర్వాత చెప్తాను!.. వికారపు కన్నులతో, లంకానగర వాకిట్లో ఉన్న నీవెవ్వరవు? ఇక్కడెందుకున్నావు? నాకెందుకు అడ్డుపడ్తున్నావు? ఊరంటూ వుంటే ఎవరో ఒకరు రాకుండా వుండరు కదా!" అని ఎదురు ప్రశ్న వేశాడు హనుమంతుడు.

"రావణాసురుడి ఆజ్ఞను శిరసావహించి, ఈ పట్టణాన్ని ఎల్లవేళలా రక్షిస్తున్నాను. నా కళ్లు కప్పి నువ్విందులోకి రాలేవు. అది సాధ్యపడే విషయం కాదు. ఓ కోతీ! నువ్విప్పుడే చస్తావు. నేనే లంకనురా! ఇది నా సంగతి. మరి నువ్వెవరివో చెప్పు."

ఆ మాటలకు ఏ మాత్రం అధైర్యపడని హనుమ ఏమాత్రం సందేహించకుండా, 'లంకను చూడాలన్న కోరికతో వచ్చాన'ని చెప్పాడు. తనను గెలవకుండా లంకాప్రవేశం ఎలానో చూస్తానని కఠినంగా అంది లంకిణి.

హనుమంతుడు సూక్ష్మరూపంతో లంకా ద్వారాన్ని దాటబోగా లంకిణి ఆతనిని ఈగను మాదిరిగా గుప్పెట్లో పట్టింది.

---

❄ 'మొక్క'బడి ❄

# వేసవి తాప నివారిణి సుగంధిపాల

వేసవి వస్తే చాలు... ప్రతి వారికి తప్పకుండా గుర్తుకొచ్చే మొక్క సుగంధి పాల. ఈ మొక్క పంట పొలాలలోనూ, బీడు భూములలోనూ, పెద్ద పెద్ద చెట్ల కింద ఎక్కువగా పెరుగుతుంది. ఈ మొక్క వేరు మంచి వాసన కలిగి వుంటుంది. ఈ తీగజాతి మొక్క నేలపైగానీ, చెట్ల ఆధారాన్ని పట్టుకొని గానీ సుమారు 5 మీటర్ల వరకు పెరుగుతుంది. ఈ మొక్క గల శాఖలు, ఆకులను గిల్లితే పాలు వస్తాయి. ఆకులు కణుపునకు రెండు చొప్పున వుండి, ఆకు మధ్యలో తెలుపు రంగు కలిగి మెరుస్తుంటాయి. పుష్పాలు లేత ఆకుపచ్చగా ఉండి గుత్తులుగా వస్తాయి. ఫలాలు సన్నగా, పొడవుగా వుంటాయి. విత్తనాలకు దూది ఉంటుంది.



పుష్పాలు ఆగస్టు నుండి నవంబర్ వరకు లభిస్తాయి. ఈ మొక్క వేర్లు దుంపల రూపంలో ఉబ్బి వుంటాయి. దీని వేర్లను, పూర్తి మొక్కను వైద్యపరంగా ఉపయోగిస్తారు. దుంపనుండి తయారు చేసిన పానీయాన్ని వేసవి కాలంలో శరీరానికి చలువ చేసేందుకు ఎక్కువ ఉపయోగిస్తారు. దీనినే 'నన్నారి' అని కొన్ని ప్రాంతాలలో

**దోర్బల పూర్ణిమాస్వాతి**

హనుమంతుడు లంకిణి అరచేతిని కరవడంతో వదిలేసింది. దాని అరచేయి రక్తం కారుతూన్నది. ఆంజనేయుడు ఒక్క ఉదుటున లంఘించి పిడికిలితో లంకిణి గుండె మీద గుద్దాడు. ఆ ముష్టిఘాతంతో లంకిణి దిమ్మరపోయి పడిపోయింది.

ఆ పిడికిటి పోటుకే, లంకిణి నోరు తెరుచుకుని, నేల మీద పడిపోయింది. హనుమంతుడు దాన్ని జాలిగా, దయతో చూశాడు. లంకిణి గర్వమణిగి "వానరేంద్రా! నువ్వు చాలా పరాక్రమవంతుడవు. యుద్ధంలో సాహసంతో, బలపరాక్రమాలతో నన్నే గెలిచావు. నీకు రాక్షసులు ఇక అడ్డమా? నేనొక గంధర్వ కాంతను. ఒకానొక శాపకారణంగా నేనిలా క్షుద్రదేవతలా మారి లంకా నగరాన్ని ఇన్నాళ్లూ కాపలా కాస్తూ వచ్చాను. లంకానగర ప్రతిష్ఠ సమయంలో నాకు బ్రహ్మదేవుడు వరమిస్తూ, సీతాదేవిని వెతికేందుకు వచ్చే కోతి నిన్నెప్పుడు గెలుస్తాడో, అప్పుడే లంక నాశనమౌతుందని చెప్పాడు. బ్రహ్మదేవుడు యదార్థం చెప్పాడని, ఆయన మాటలు తప్పు కావనీ, సీతాదేవి కారణాన రాక్షసులకు, రావణుడికి చావు మూడిందనీ, నీవు లంకలో ప్రవేశించి, నగరమంతా కలియ తిరిగి, కోరిక తీరేంత వరకు ఇష్టానుసారం లంకా విహారం చేయవచ్చని , సీతమ్మను దర్శించవచ్చని సలహా కూడా ఇచ్చింది లంకిణి. పతివ్రతల శాపానికి గురైన లంకలోకి ప్రవేశించి సీతను చూడవచ్చని, కోరిక తీరేవరకు సుఖంగా లంకలో తిరగమని కూడా సలహా ఇచ్చి, హనుమను ఆశీర్వదించింది. గంధర్వ కాంతలా మారి దివ్యరూపంతో ఆకాశానికి ఎగిరింది.

ఈ విధంగా లంకిణి హనుమకు మొదటగా లంకానగరంలో కనిపిస్తుంది. అతడి బలపరాక్రమాలను పరీక్షించి, వాటిలో పైచేయి సాధించిన హనుమను ఆశీర్వదిస్తుంది. ఇప్పటికీ కూడా ఎవరైనా పెద్దగా అరుస్తున్నా, భయంకరమైన ఆకారం కలిగి ఉన్నా, లంకిణితో పోలుస్తుంటారు. ★

అంటారు.

**ఔషధ గుణాలు**

సుగంధి పాల మొక్కకు ఔషధ గుణాలెన్నో ఉన్నాయి. ఆకలి పుట్టించడానికి, జ్వరం, చర్మవ్యాధులు, కీళ్ల నొప్పులు, మూత్ర సంబంధ వ్యాధుల నివారణలో ఎక్కువగా వాడతారు. వేరు రసాన్ని టాన్సిల్స్, ఉదరంలో ఏర్పడే వ్రణాల నివారణలోను, శరీరంలోని అమిత వేడిని తగ్గించడానికి వాడతారు. ఈ మొక్క వేరుతో చాలా రకాల ఆయుర్వేద మందులు తయారు చేస్తున్నారు. వేర్లలోని రసాయనాలు చాలా శక్తిమంతమైనవి. ఈ రసాయనాలకు పురుగులను నియంత్రించే గుణం వుంటుంది. ఈ వేరు కషాయంతో పెరటితోటల్లో పెరిగే కూరగాయ మొక్కల నాశించే రసం పీల్చే పురుగులను సమర్థవంతంగా నివారించవచ్చు.దీని ఆకుల కషాయానికి పురుగుల లార్వాలను నివారించే లక్షణం వుందని ఆధునిక పరిశోధనలలో తేలింది. వీటి వేర్లకు నీటిని శుభ్రపరిచే గుణం వుందని మరికొన్ని పరిశోధనలు నిరూపిస్తున్నాయి.

సుగంధిపాల వేర్లు అన్ని ఆయుర్వేద దుకాణాలలోనూ దొరుకుతాయి. మనం పెంచుకోదలచుకుంటే ఈ మొక్కలు నర్సరీలలో కూడా దొరుకుతాయి. చెట్టు, కాండం, వేరు అన్నీ ఔషధగుణాలు కల సుగంధపాల మొక్కను తెచ్చుకుని ఇంటిలో పెంచుకోవడం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయి. ★

❄ తాత్వి'కత' ❄



# వెలుగు దేవుడు అయితే?

'వెలుగు అంటే దేవుడు అని అంటున్నారు, మరి చీకటి అంటే ఏంటి గురువు గారూ! దయ్యమా?' అని ప్రశ్నించాడు ఒక శిష్యుడు. దానికి గురువు 'లేదు నాయనా! దయ్యం అనేది ఎలాంటి ఉనికీ లేని ఒక భ్రాంతి. ఇక నీ ప్రశ్న చీకటి అంటే ఏమిటి? అని. చీకటి అంటే సాధారణంగా వెలుతురు లేని ప్రాంతంగా గుర్తిస్తాం. వెలుతురు పడగానే చీకటి మాయమైపోతుంది. మన గృహాన్నే తీసుకుందాం. వెలుతురు రాగానే ఇంట్లో ఉన్న వస్తువులు, గోడలు, ద్వారాలు అన్నీ కనబడతాయి. కేవలం వెలుగు వాటిని సూచిస్తుంది. నిజానికి వాటి ఉనికి మనకు కనబడకుండా అంతకు పూర్వమే ఉన్నదే. ఇదంతా మన పర్యావరణంలో జరిగే దృగ్విషయం' అని బదులిచ్చాడు.

ఇదే విషయాన్ని అంతరిక్షంలో చూద్దాం. సౌరమండలంలో సూర్యుడి కాంతి సోకిన ప్రదేశం కాంతిమంతంగా ఉంటుంది. సోకని ప్రదేశంలో చీకటి నిండి ఉంటుంది. గ్రహాల భ్రమణ, పరిభ్రమణాల వల్ల చీకటి వెలుగులు ఏర్పడుతున్నాయి. చీకటి కాలాన్ని రాత్రి అంటున్నాం. ఆ రాత్రి మన ఉదయపు జీవితానికి దోహదపడుతున్నది. అంతరిక్షం దాటి ఆకాశంలోకి మన దృష్టిని సారిస్తే నక్షత్రమండలాలు ఉంటాయి. వాటిని దాటివెళ్తే అంతా చీకటి. ఆ చీకటి మన ఇంద్రియాలకు సోకని, తాకనిది. చివరికి కాంతి కూడా సోకలేని చీకటి. దాని ఆనుపానులు కూడా కనుక్కోలేనంత చిత్రమైన చీకటి. దాన్నే ఆధునిక శాస్త్రవేత్తలు కృష్ణశక్తి అనీ, కృష్ణ పదార్థమనీ విశ్లేషిస్తున్నారు. అది చీకటా, నలుపా లేక ఇంకొకటా అనేది గుర్తించలేని మేధస్సు మనది.

సాలీడు నుంచి దారం పుట్టినట్టుగా ఆ సూక్ష్మరూపం నుంచే సృష్టి పుడుతుందని చెప్పున్నది మాండుకోపనిషత్తు. అంతేకాకుండా దాని గురించి పలువిధాలుగా వర్ణిస్తూ మనలను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తుంది. ఆ వస్తువును అర్థం చేసుకున్నవాడు ఆశ్చర్యపోతాడని భగవద్గీత కూడా పేర్కొన్నది.

'అక్కడ సూర్యుడు ప్రకాశించడు, చంద్రుడూ, నక్షత్రాలూ ప్రకాశించవు. మెరుపులు మెరవవు. ఈ అగ్ని ఎలా ప్రకాశిస్తుంది? సమస్తం దాని ప్రకాశం చేతనే ప్రకాశిస్తున్నాయి' అని శ్లోకానికి అర్థం. ఆధునిక శాస్త్రవేత్తలు ఈ కృష్ణ పదార్థం, కృష్ణశక్తుల గురించి చెప్తూ, నక్షత్ర మండలాల నడుమ కాంతి కూడా వంగి ప్రయాణిస్తుందని, అందుకు కారణం ఆయా శక్తులు భౌతికశాస్త్ర ప్రమాణాలకు అతీతమైనవి కావడమే అని చెప్తున్నారు. అందుకే గీతాచార్యుడు సాంఖ్యయోగంలో ఆ ఆత్మను గురించి విశేషంగా వర్ణించాడు. ఉపనిషత్తులు ఆ ఆత్మ లక్షణాలను ఎలుగెత్తి చాటుతున్నాయి" వివరించాడు గురువు. అర్థం అయ్యింది అన్నట్టుగా తల పంకించి గురువుకు పాద నమస్కారం చేశాడు శిష్యుడు. ★




11

మరునాటి ఉదయంబు ఆదిత్యదాసు ఆలయానికి వెళ్లి మహాకాళుని దర్శించుకుని, జాముసేపు జపం చేసినాడు. తన కుమారునికీ ఖనాకీ వివాహం జరిపించేందుకు స్వామి అంగీకరించి నట్లుగా ఆయన మనస్సుకు అనిపించింది.

ఇంటికి వచ్చి మిహిరునికి తన అంగీకారాన్ని తెలిపిన తర్వాత ఆదిత్యదాసు డేరియస్ పంపిన దూతలతో మాట్లాడాడు. ఖనాను తన ఇంటి కోడలిగా స్వీకరించడానికి తాను సమ్మతిస్తున్నాననీ, రాబోవు చైత్రపూర్ణిమ నాడు అవంతీ నగరంలోనే వివాహం జరిపించాలనీ, ఆ సమయానికి డేరియస్, అతని పుత్రులు, బంధుమిత్రులు వధువుతో సహా తమ ఇంటికి రావాలనీ తెలియచెప్పాడు.

దూతలు ఆనందంగా పారశీక నగరానికి పయనమయ్యారు.

* * *

పరదేశంలోనూ, ప్రయాణాలలోనూ విహిత విధులను సరిగా నిర్వర్తించలేకపోయినందుకు మిహిరునకు ప్రాయశ్చిత్త కర్మ నిర్వహించారు. జప, హోమ, దాన క్రియలన్నీ పూర్తయినాక ఆదిత్యదాసు కుమారునితో “నీవు ఒకసారి విక్రమాదిత్య మహా రాజును సందర్శించి విషయమంతటినీ విన్న వించడం ముఖ్యం. ఖనా భరతఖండంలో జన్మించినా పారసీకుల ఇంట పెరిగింది. మీ వివాహంలో వర్ణ సంకరం లేదు. ఆమె కొన్ని హోమాలు చేయవలసి ఉంటుంది. కానీ రాజానుమతో ధర్మః అన్నారు. ప్రభువు అంగీకరించిన తర్వాత ఎవరూ కాదనలేరు. ఖనా విషయమాయనకు సంపూర్ణంగా తెలియ చేసిరా!” అన్నాడు.

మరునాడు మిహిరుడు కోటలోనికి వెళ్లి తన పేరు చెప్పి, మహారాజ సందర్శన కాంక్షతో వచ్చానని చెప్పాడు. సాయం సమయంలో తమ ఏకాంత మందిరంలో తమను కలవవచ్చునని విక్రమాదిత్యుడు భటుని ద్వారా సందేశమిచ్చాడు. మిహిరుడు ఇంటికి తిరిగివచ్చి, తండ్రికి విషయాన్ని నివేదించి, సూర్యాస్త మయానికి ముందే రాజప్రాసాదానికి చేరుకున్నాడు. మహారాజు ఆజ్ఞ వలన కాబోలును భటుడు మిహిరుని వెంటనే లోనికి తీసికొనివెళ్లాడు.

విక్రమాదిత్యుని చూసిన వెంటనే మిహిరుడు “పరమేశ్వరుడు విక్రమాదిత్య మహారాజును అనుగ్రహించుగాక” అనే భావంతో ఆశువుగా ఒక శ్లోకం రచించి, చదివాడు. ప్రభువు కనుసన్నపై భటుడు వెలుపలకు వెళ్లిపోయాడు. విక్రముడు లేచి మిహిరుని గాఢాలింగనం చేసికొని “మిత్రమా, ఎన్నాళ్ల కెన్నాళ్లకు!” అన్నాడు.

“ఉజ్జయిని చేరుకున్ననాడే నీ వద్దకు రావలెనని పించినది. కానీ జననీజనకుల దర్శనమూ, ప్రాయశ్చిత్త హోమ నిర్వహణ పూర్తయ్యేవరకూ రాలేకపోయాను.”

“నీ విద్యాయాత్ర విశేషములేమి? తక్షశిలలో వైద్యశాస్త్ర విషయాలు నేర్చుకొంటానని చెప్పినావు. ఆపైన పారశీక దేశానికి వెళ్లినట్లు తెలిసింది.”

మిహిరుడు తక్షశిలలో, పారశీకంలో తాను చదువుకున్న విశేషాలను తెలిపినాడు. “యవన గురువులు ధనం స్వీకరించి కానీ చదువు నేర్పరు. ధనహీనుడైన నేను ఆయనకు మన జ్యోతిషం నేర్పినాను. అందుకు ప్రతిగా వారి శాస్త్రం నాకు నేర్పినారు. మన రాజ్యంలో వలె భోజన సత్రములు లేవు. ఒక పారశీక ధనికుడు నాపై దయతో వసతినీ, భోజనమూ వారింటిలో ఏర్పాటు చేసినారు”.

“రథం మీద తిరిగి వచ్చితివని వింటిని”.

“నీకెట్లు తెలిసినది” అని అడుగబోయిన మిహిరుడు ‘రాజుల చార చక్షువులు’ అన్న సంగతిని గుర్తుకు తెచ్చుకుని గృహ యజమానియే నాయందు వాత్సల్యంతో శకటమిచ్చి పంపినారు. అందుకే రెండు మాసములలోనే రాగలిగాను”.

మిహిరుడు మరి కొంతసేపు తన విద్యార్థి జీవితం గురించి వివరించాడు. ఒక పరిచారిక వచ్చి “మహారాణి వీరలక్ష్మీదేవి తమ దర్శనాన్ని కోరుతున్నారు” అని విన్నవించింది.

“మిత్రమా’ సెలవు” అన్న మిహిరునితో “నీ పరిచయం, దర్శనం రాణికి కలుగవద్దా?” అని విక్రముడన్నాడు.

మహారాణి విక్రముని మందిరానికి వచ్చి, పరిచారిక ద్వారా తన రాకను తెలియచేసి, విక్రముని అనుమతిపై లోనికి వచ్చింది.

“ప్రేయసీ, అనేక పర్యాయములు నా మిత్రుడు మిహిరుని గురించి నీ వద్ద ప్రస్తావించాను. ఇతడే ఆ మిహిరుడు. నా బహిఃప్రాణం.”

వీరలక్ష్మీదేవి మిహిరునకు అభివాదం చేసినది. కొంతసేపు సంభాషణ సాగాక, ఆమె, “ఆర్యపుత్రుల ప్రాణస్నేహితులు మిహిరాచార్యులను మా నగరంలో ఈనాడు ఉండవలసినదిగా కోరుతున్నాను” అంది.

ప్రియకాంతను అనుసరిస్తూ విక్రముడు “అవును మిత్రమా! నేటి రాత్రి ఇక్కడనే ఉండు.” అన్నాను.

“ఇంట చెప్పి రాలేదు”

“గురువర్యులకు నేను వార్తను పంపగలను” అన్న విక్రముడు భటుని పిలిచి, ఆదిత్యదాసుకు వార్త పంపించాడు. మహారాణి ఆజ్ఞపై పరిచారిక మిహిరునికై ఏర్పాట్లు చేసినది.

ఆనాటి రాత్రి విక్రముడు భార్యను “ప్రియా, మిహిరుని నగరంలోనే ఉండమన్నదెందుకు?” అన్నాడు.

“ప్రభువులు తమ హృదయమును గోప్యంగా ఉంచగలరు. ఇతర హృదయాలలోని ఆలోచనలను గ్రహించగలరు. ఇంత చిన్న విషయం స్ఫురించ లేదా?”

**ఎండివై రామమూర్తి స్మారక నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన రచన**



విక్రముడు ప్రశ్నార్థకంగా చూశాడు.

“మీ ప్రియమిత్రులు తమ వివాహ విషయం మీతో ప్రస్తావించుటకో, మీకు తెలియజేసేందుకో వచ్చారు. వారి ముఖకవళికలు, వారి మాట తీరు కొంత బెరుకుతనాన్ని సూచించాయి. సాధారణ విషయాలైతే బెరుకెందుకు?”

“మిహిరునికి నావద్ద భయమేల?”

“భయం కాదు, సిగ్గు”

“అంతగా హృదయాంతరములోని విషయాలను గ్రహించగలదానివైతే నా మనసులో ఏమున్నదో చెప్పగలవా?

“నేనే కదా!” అంటూ విక్రముని చెక్కిలిపై తన చెక్కిలి ఉంచింది.

* * *

మరునాడు మంత్రి, సామంతులతో సమావేశం, మధ్యాహ్నం సంధ్యావందనమూ, భోజనమూ పూర్తయిన తర్వాత విక్రముడు మిహిరునితో కలిసి, ఉద్యానవనంలోకి ప్రవేశించాడు. సూర్యుడు ఆకాశ మధ్యంలో ఉన్నప్పటికీ చలిగానే ఉన్నది. తరుచ్ఛాయలో శిలా వేదికపై ఆసీనులైనాక మిహిరుడు తాను తక్షశిలలో, పారశీక దేశంలో నేర్చుకున్న విశేషాంశాలను మరింత వివరంగా చెప్పాడు. విక్రముడు తన ఆనందాన్ని వ్యక్త పరుస్తూ “నీవు నేర్చిన విద్యనంతటినీ గ్రంథస్థం చేస్తే అనేకులకు ఉపయోగకరం కాగలదు” అన్నాడు.

''ఇదివరలోనే అనేక గ్రంథములన్నవి కదా!”

''కావచ్చు... కానీ నీవు వివరించే పద్ధతి బాగున్నది. త్వరలోనే రచనా వ్యాసంగం ప్రారంభించమని నా కోరిక. మా ఆస్థానంలో జ్యోతిష శాస్త్రవేత్తగా నీవుండి పుస్తక రచన చేయవలసింది. భాషాశాస్త్రంలోనూ, వైద్యశాస్త్రంలోనూ తగిన వారిని కొలువులో నియమించి, చదువుల తల్లి సేవ చేయడమే నా కర్తవ్యమని భావిస్తున్నాను”.

“మిత్రమా! చక్కటి ఆలోచన. కానీ నన్ను మించిన వారెందరో ఉన్నారు”.

“ఆ సంగతి నిర్ణయించవలసినది నీవు కాదు”.

వర్షం కురిసే సూచనలు కనిపిస్తున్నవి” అని మిహిరుడు సంభాషణను మరో దారికి మరల్చాడు.

“ఆకాశంలో మబ్బులు లేవే”?

“నా యవన జ్యోతిష గురువులకు ఈ విషయం గురించి తెలియచేస్తే వారు ఎంతో సంతోషించారు. అదిగో, ఎదురుగా ఉన్న వృక్షాన్ని చూడు... పాము చెట్టెక్కుతున్నది. వానకు సంకేతమిది. చీమలు గుడ్లు మోసుకుపోవడం వర్ష సూచన అని చెప్పగానే ఖనా ఆశ్చర్యపడింది.

విక్రముడు చిరునవ్వుతో “ఖనా ఎవరు?” అన్నాడు.

మిహిరుడు తబ్బిబ్బయి “నేనేమన్నాను? మా యవన గురువులు..” అంటూ ఉండగా విక్రమాదిత్యుడు “ఆశ్చర్యపడిన ఆ ఖనా ఎవరు?” అన్నాడు.

మిహిరుడు నెమ్మదిగా "మిత్రమా!" అని ఒక్క క్షణమాగి 'ఈ విషయం తెలియజేయమనే నన్ను తండ్రిగారు నీ వద్దకు పంపించారు" అన్నాడు.

"మిహిరా, నా వద్ద భయమేల? వివరంగా చెప్పు"

మిహిరుడు తాను పారశీక రాజ్యం చేరు కొనడమూ, అక్కడ ఒకరింట ఒక రాత్రికి ఆశ్రయం కోరడమూ, వారింటనే వసతి, భోజనం తానున్న కాలమంతటికీ లభించడమూ చెప్పాడు. గృహ యజమాని కుమార్తె ఖనాకు తాను భారతీయ జ్యోతిశ్శాస్త్రము బోధించిన సంగతి తెలియచేశాడు. ఖనా జన్మ వృత్తాంతమంతా వివరించాడు. ఆమె తండ్రి డేరియస్ తన కుమార్తెను వివాహం చేసుకోనడమూ, తన సూచనపై దూతలను తన జనకుల వద్దకు పంపడమూ, ఆయన అంగీకారమూ తెలియజేశాడు.

"తండ్రిగారు ఖనాను నేను వివాహమాడడంలో ధర్మ విరుద్ధమేమీ లేదనీ, కొన్ని హోమాలు నిర్వహించవలసి ఉంటుందనీ చెప్పారు. కానీ నీ సమ్మతి ముఖ్యమని అన్నారు. రాజానుమతో ధర్మః అన్నది నీకు తెలియనిది కాదు. నీ అంగీకారంతో, వీలయితే నీ సమక్షంలో వివాహం జరుగవలెనని వారి కోరిక".

"గురువర్యుల ఆజ్ఞను శిరసా వహిస్తాను. ఆమె జన్మచే భారతీయ కన్య. ఈ వివాహం ధర్మ విరుద్ధం కాదు. నేనే దగ్గర ఉండి మీ వివాహం జరిపించ గలను".

"మిత్రమా, ధన్యుణ్ణి"

ప్రకృతి అక్షతలతో ఆశీర్వదిస్తున్నదా అన్నట్లు వాన ప్రారంభమైంది. దూరాన నిలబడ్డ భటులు ఛత్రములతో వారి వద్దకు వచ్చారు.

* * *

మరునాడు విక్రమాదిత్యుడు మిహిరునితో పాటు ఆదిత్యదాసు కుటీరానికి వెళ్లి, గురువుకూ, గురుపత్నికీ నమస్కరించి, వారి అనుమతిపై ఆసీనుడైనాడు.

"గురువర్యా, మిహిరుడు అనేక శాస్త్రాలను అభ్యసించి వచ్చిన సంగతి ఎంతో ఆనందాన్నిచ్చింది. అతనిని అవంతీ రాజ్య గణిత, జ్యోతిషశాస్త్రవేత్తగా నియమించాలని ఉన్నది. మీకు తెలియపరచి సభలో నిర్ణయం ప్రకటించవలెనని మీ వద్దకు వచ్చాను".

ఆదిత్యదాసు మనసులో ఆనందము ఉప్పొంగింది. ఆయన "అవశ్యమట్లే" అన్నాడు.

"మిహిరుని వివాహానికి నేను సన్నిహితుడనై ఉండగలను. ఆస్థానంలో శాస్త్రవేత్త అయిన కారణంగా కోటలోని ప్రాసాదమొక్కటి అతని కుటుంబం నివసించేందుకు నిర్దేశితమైనది. తామిద్దరూ మిహిరునితో కలసి అచ్చట నివసించ వలసిందిగా అభ్యర్థిస్తున్నాను.

ఆదిత్యదాసు "ఆ విషయమై తర్వాత ఆలోచింప



వచ్చును. మహారాజ సమక్షంలో మిహిరుని వివాహం జరగడం మా అందరి అదృష్టం" అన్నాడు.

"అనుగృహీతుణ్ణి" అని విక్రముడు ఒక్కసారి నమస్కరించి, కోటకు దారి తీశాడు.

* * *

మహారాజు ఆజ్ఞపై ఒక మంత్రి సభలో ఒక పత్రం చదివాడు.

"జగన్మాతాపితరులైన పార్వతీపరమేశ్వరులకు నమస్కరించి, పరయార వంశీయుడు, గంధర్వ సేనల పుత్రుడు, విక్రమాదిత్య నామధేయుడు, అవంతీ రాజ్యాధిపతి అయిన మేము నేటి నుంచి ఆదిత్యదాస పుత్రుడైన మిహిరాచార్యుని ఆస్థాన గణిత, జ్యోతిషశాస్త్రవేత్తగా నియమిస్తున్నాము. వారి నివాసమునకై కోటలోని ప్రాసాదమొక్కటి నిర్దేశించడం కూడా అయింది. ప్రాసాదములోని దాస దాసీ జనానికీ, ఇంటి నిర్వహణకూ ధనం రాజ్య కోశాగారం నుండే చెల్లిస్తారు." అని మంత్రి చదివిన వెంటనే సభలో జయజయధ్వానాలు, కరతాళధ్వనులు వినబడినాయి.

సద్దుమణిగిన తర్వాత మంత్రి "పరమార వంశీయులు వరహ లాంఛనులు. ఆది వారహమూర్తి భూదేవిని రక్షించినట్లే మాకు భూ భారం వహించ వలసిన ఆవశ్యకతను తెలియచేయుటకై వరాహ లాంఛనమిచ్చారు. నేటి నుంచి మిహిరాచార్యులు కూడా వరాహ లాంఛనులు కాగలరని మేము ప్రకటిస్తున్నాము. వారికపై వరాహమిహిరులని పిలవబడుదురు గాక" అని పత్రాన్ని చదివాడు.

రాజసభలో వరాహ మిహిరుని మహారాజు స్వయంగా సత్కరించాడు. ఛాయాదేవి పుత్రోత్సా హంతో పొంగిపోయినది. ఆదిత్యదాసు పుత్రుడు తనను మించినవాడయినందుకు సంతోషించాడు.

* * *

విక్రమాదిత్యుని అభ్యర్థనపై, మిహిరుని కోరికపై ఛాయాదేవీ, ఆదిత్యదాసులు ప్రాసాదములోనే నివసించసాగారు. గురుకుల నిర్వహణ మేడ వెనుకగా ఉన్న చిన్న ఇంటిలో జరుగుతున్నది. మిహిరుడు గ్రంథ రచనలో నిమగ్నుడైనాడు. శాస్త్ర విజ్ఞానమే కాక, కవితా రచన కూడా అతని సొత్తు. సుందరమైన భాషలో, సరళమైన శైలిలో అతడు గ్రంథ రచన ఆరంభించినాడు. మహారాజు అయిదుగురు లేఖకులను మిహిరుని వద్దకు పంపాడు. వరాహ మిహిరుడు చెబుతుండగా వారు రాయసాగారు.

సృష్టికర్త బ్రహ్మదేవుడు. ఆయన పేర ప్రసిద్ధమైన పైతామహ సిద్ధాంతంతో తాను రచన ఆరంభించ గలనని తండ్రికి చెప్పి, ఆయన ఆశీర్వాదములను పొందాడు. ఆపై విక్రమాదిత్యునికి విషయాన్ని తెలిపి, అనుమతి స్వీకరించి గ్రంథరచన ప్రారంభించాడు.

ఆదిత్యదాసు గురుకుల నిర్వహణ, వరాహ మిహిరుడు గ్రంథరచన చేస్తుండగా ఛాయాదేవి వివాహ ఏర్పాట్లు ప్రారంభించింది. ధనవంతుల ఇంట పెరిగిన యువతి సాధారణ కుటీరంలో ఎట్లు నివసించగలదో అని తాను భయపడినది. కోడలు ఇంట అడుగు పెట్టే వేళా విశేషము కాబోలును ప్రాసాద జీవనమూ, దాస దాసీ జనమూ, పంచ భక్ష్య పరమాన్నములతో భోజనమూ నేడే ఏర్పడినవి. భగవంతుని కృపా విశేషమని ఆమె అనుకున్నది.

* * *

చైత్ర మాసారంభానికి డేరియస్ తన పుత్రులతో, ఖనాతో, బంధుమిత్రులతో పరిచారకగణంతో ఉజ్జయిని చేరుకున్నాడు. మహారాజు అనుమతితో విశాలమైన మైదానంలో గుడారాలు వేసుకుని, వాటిలో నివసించసాగాడు. వ్యాపారరీత్యా అనేక రాజ్యాలలో పర్యటించిన డేరియస్‌కూ, అతని కుమారులకూ గుడారాలలో నివసించడం అసౌకర్యం కాదు. ఉభయ భాషా పరిజ్ఞానమున్న వారితో కలసి డేరియస్ కుటుంబ సమేతంగా ఆదిత్యదాసు వద్దకు వెళ్లాడు. మిహిరుడు తాము నివసించేది చిన్న కుటీరమన్నాడే! ఈ భవంతి ఏమి?

డేరియస్ ఆలోచనను గ్రహించినట్లుగా ఆదిత్యదాసు అతనితో విక్రమాదిత్య మహారాజు మిహిరుని ఆస్థాన జ్యోతిశ్శాస్త్రవేత్తగా నియమించిన సంగతీ, ప్రభువే నివాసానికి ప్రాసాదాన్ని అనుగ్ర హించిన సంగతీ చెప్పాడు. కాబోయే వియ్యంకుల మధ్య భరతఖండ, పారశీక సంస్కృతుల గురించిన సంభాషణ జరిగినది.

ఖనాను ఛాయాదేవి గృహాంతర్భాగానికి తీసుకొని వెళ్లింది. కాబోయే అత్తగారికి ఖనా భారతీయ పద్ధతిలో నమస్కరించింది. ఆమె సంస్కృత భాషా పరిజ్ఞానం ఛాయాదేవిని ఆనందపరచినది. "నీతో ఏ విధంగా సంభాషించాలో అని భయపడ్డాను" అన్న ఆమెతో ఖనా తాను తక్షశిలలో సంస్కృతమభ్యసించా లని చెప్పింది. **(సశేషం)**



గోపాలరెడ్డి నాగం
వి(శాంత తెలుగు ఉపన్యాసకులు

# పొడుపు కవితలు

పొడుపు కవితల ఒడుపు
క్రొత్త కైతల పొద్దు పొడుపు
కవి రవీంద్రుల పాలిట
పొద్దు తిరుగుడు పూలట

*రోడ్డు నిండా వ(జ్రాలు;*
*బడి పిల్లల బంతులు* *(వడగళ్లు)*

*ఒడ్డున వ్రాలింది మేఘశకలం;*
*చెరువు నీళ్లలో కలకలం* *(కొంగల గుంపు)*

*చెరువులో చేపల చిందులు;*
*జలపక్షుల విందులు* *(కొత్త నీరు)*

*సింగడేసింది తూర్పుదిక్కున;*
*రైతుల ఆనంద తాండవం,*
*కోడెల గుండెలు గుభిల్లు* *(వర్షసూచన)*

*నీలాకాశం విరిగి ఒరిగింది;*
*నేలతల్లి తాగి తలపోసుకున్నది* *(తొలకరి వాన)*

*పల్లె ప్రజకు పన్నీటి జల్లు*
*నేల తల్లికి షవర్‌బాత్* *(వర్షపు జల్లు)*

*గజానికొక సొరంగం,*
*జగమంతా జల్లెడ తూట్లు,*
*నేలతల్లికి నిర్జలీకరణ* *(బోరుబావులు)*

*పరవళ్లతో నదీ సుందరి;*
*సముద్రుని చేరలేకబంది* *(ఆనకట్టలు)*

# ఓటమి భీతితో ఏకగ్రీవ

శాసనమండలి ఎన్నికల్లో తమ అభ్యర్థులను ఏకగ్రీవం చేసుకునేందుకు వైసీపీ విపక్షాల అభ్యర్థులపై సామదానభేదదండోపాయాలు ప్రయోగిస్తోంది. విపక్షాలకు పడే ఓట్లతో ప్రజాగ్రహం బయటకు కనిపిస్తుందనే యోచనతో పోలింగ్ జరగకుండా ఏకగ్రీవాలకు వత్తిడి తెస్తోంది. ఈ దాష్టీకం కొత్తకాదు. నాలుగేళ్లుగా రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు, శాసనసభ, పార్లమెంటు ఉపఎన్నికల సందర్భంగా ఆ పార్టీ కొనసాగిస్తున్నదే. విపక్షాలను ఎన్నికల్లో పోటీ చేయనీయడం లేదు. ఏకగ్రీవం పేరుతో విపక్షాల అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా వైసీపీ గుండాయిజం, రౌడీయిజం చేస్తోంది. నామినేషన్ పత్రాలను చింపేయడం, బెదిరింపులకు దిగడం, భౌతికదాడులు చేయడం, పోలీసులతో అక్రమ కేసులు పెట్టించడం అందరూ చూశారు. దొంగ ఓటరు ఐడీలను సృష్టించి ఎన్నికల్లో ఓట్లు వేయిస్తుండగా విపక్షాలు పట్టుకున్నా అధికార పక్ష (ప్రభుత్వ) దౌర్జన్యానికి భయపడి రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు శాసనమండలిలో సభ్యుల భర్తీకై ఎన్నికలు జరుగనున్నాయి.

తమ మాట నెగ్గలేదన్న కోపంతో మండలినే రద్దు చేసేంతవరకు వెళ్లిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదే. ప్రాథమిక విద్యను అందించడంలో మాతృభాషను కాదని ఆంగ్లాన్ని ప్రవేశపెట్టడం నుంచి అమరావతిని రాజధానిగా కాదని 3 రాజధానుల వరకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులు శాసనమండలిలో తిరస్కారానికి గురికావడంతో వ్యవహారం మండలిని రద్దుచేసే దాకా వెళ్లింది. తమ నిర్ణయాలను వ్యతిరేకించేవారు మండలిలో ఉండరాదన్నది ఆ పార్టీ అభిప్రాయం. అయితే అదే మండలిలో తమ సభ్యుల సంఖ్య పెరగడంతో దాని పునరుద్ధరణకు శాసనసభలో తీర్మానం చేసింది. ప్రస్తుతం ఖాళీ అయిన 13 ఎమ్మెల్సీ స్థానాలన్నిటిని చేజిక్కించుకోవాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. స్థానిక సంస్థలు, ఉప ఎన్నికల్లో మాదిరిగానే ఇక్కడ కూడా రౌడీయిజం, గుండాయిజం, అధికారదుర్వినియోగానికి పాల్పడుతోంది.

రాష్ట్రంలో ఖాళీ అయిన 13 ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఫిబ్రవరి 9న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. 8 స్థానిక సంస్థల నియోజకవర్గాలు, మూడు గ్రాడ్యుయేట్, రెండు టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలకు సంబంధించి ఫిబ్రవరి 16వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసింది. నామినేషన్ల దాఖలుకు 23వ తేదీ తుదిగడువు కాగా, 24న వాటిని పరిశీలించారు. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ ఫిబ్రవరి 27. మార్చి 13న పోలింగ్ జరుగుతుంది. 16న ఓట్లు లెక్కిస్తారు. చిత్తూరు, కర్నూలు, అనంతపురం, కడప, నెల్లూరు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, శ్రీకాకుళం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు; ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు, పట్టభద్రుల నియోజకవర్గాలకు విషయానికి వస్తే.. 1. ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు, 2. కడప–అనంతపురం–కర్నూలు, 3. శ్రీకాకుళం–విజయనగరం– విశాఖపట్నం స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి.

**రద్దు...పునరుద్ధరణల 'మండలి'..?**

శాసనమండలిలో అధికారపక్షానికి బలం లేక బిల్లులు వీగిపోతుండడంతో మండలి రద్దుకు వైసీపీ ప్రభుత్వం 2020 జనవరిలో శాసనసభలో చేసిన తీర్మానాన్ని కేంద్రం ఆమోదానికి పంపగా, అది అక్కడ పరిశీలనలో ఉంది. ప్రజాసంక్షేమం కోసం తీసుకునే నిర్ణయాలకు 'మండలి' అడ్డుపడుతోందని, శాసన మండలి వల్ల ఎవరికీ ఉపయోగం లేదని ముఖ్యమంత్రి నుంచి మంత్రులు, శాసనసభ్యుల వరకు ఆ రోజు వ్యాఖ్యానించారు. చట్టాలకు సంబంధించి 'మండలి' సలహాలు, సూచనలు మాత్రమే ఇవ్వాలని పేర్కొన్నారు. అయితే అధికారపార్టీకి మండలిలో మెజార్టీ రావడంతో శాసనమండలి రద్దు తీర్మానాన్ని 2021 నవంబరులో వెనక్కి తీసుకుంది.

**ఏకగ్రీవం పేరుతో దౌర్జన్యం...**

స్థానిక సంస్థల, ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ నియోజకవర్గాల ఎన్నికలను సాధ్యమైనంత మేర తన అనుచరులతో ఏకగ్రీవం చేసి విపక్షాల అభ్యర్థులను మండలిలో అడుగుపెట్టనివ్వరాదనే ఆలోచనతో అధికార పార్టీ వ్యవహరిస్తోంది. ఇందుకోసం వైసీపీయేతర అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుపడుతోంది. ఈ పరిస్థితుల దృష్ట్యా పలు జిల్లాల్లో విపక్షాల అభ్యర్థులు ముసుగులు వేసుకుని నామినేషన్లు వేసేందుకు ప్రయత్నించారు. వారితో నామినేషన్లను ఉపసంహరింప చేసేందుకు వైసీపీ నేతలు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. ఆ అభ్యర్థుల బలం, బలహీనతల ఆధారంగా అధికారం ఉపయోగించి వివిధ కోణాల్లో బల ప్రయోగం చేస్తున్నారు. ప్రస్తుతం స్థానిక సంస్థల కోటాలో 9 స్థానాలకు ఎన్నికలు జరగవలసి ఉండగా, ఈ రకమైన వత్తిళ్లతో అధికారపక్ష అభ్యర్థులు ఐదు స్థానాల్లో ఏకగ్రీవానికి మార్గం సుగమం



చేసుకుంటున్నారు.

**నామినేషన్లు తిరస్కరించి ఏకగ్రీవాలు**

వైసీపీ రౌడీయిజం ఎలా ఉందంటే...! ఎన్నికల అధికారులు అధికార పార్టీ ఒత్తిడికి తలొగ్గి ప్రత్యర్థుల నామినేషన్ పత్రాలను ఏదో ఒక సాకు చూపి తిరస్కరిస్తున్నారని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ పత్రాల్లో బలపరిచిన వారి సంతకాలు ఫోర్జరీవంటూ ఆయన నామినేషన్‌ను తిరస్కరించారు. దీంతో ఇక్కడ వైసీపీ అభ్యర్థి పి.రామ సుబ్బారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు మార్గం సుగమమైంది. అనంతపురం జిల్లాలో స్వతంత్ర అభ్యర్థి వేలూరు రంగయ్య నామినేషన్‌ను అధికారులు పరిశీలనలో తిరస్కరించడం అక్కడ అధికారపక్ష అభ్యర్థి

# యత్నాలు

ఎస్.మంగమ్మ, చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోసం స్వతంత్ర అభ్యర్థి దాఖలు చేసిన నామినేషన్ తిరస్కరణ పాలు కావడంతో వైసీపీ అభ్యర్థి సిపాయి సుబ్రహ్మణ్యం ఏకగ్రీవం కానున్నారు. నెల్లూరు జిల్లాలో కూడా అభ్యర్థిని బలపర్చిన వారి సంతకం ఫోర్జరీ అనే అభియోగంతో నామినేషన్‌ను తిరస్కరించడంతో వైసీపీ అభ్యర్థి మేరుగ మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు వీలుచిక్కింది. ఇక తూర్పు గోదావరి జిల్లాలో టీడీపీకి చెందిన కదలి శ్రీదుర్గ, ఇద్దరు స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లను సాంకేతిక కారణాలతో అధికారులు తిరస్కరించ




డంతో కుడుపూడి సూర్యనారాయణరావు మాత్రమే పోటీలో మిగిలారు. ఇలా ఇప్పటివరకు కడప, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, తూర్పు గోదావరి జిల్లాల స్థానిక సంస్థల నియోజకవర్గాల్లో కేవలం వైసీపీ అభ్యర్థులు మాత్రమే మిగలడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యే పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి కర్నూలు జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గంలో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలవడంతో పోటీ అనివార్యంగా కనపడుతోంది. వీరు ప్రస్తుతం ఎవరికీ అందుబాటులో లేకపోవడంతో అధికార పార్టీ నేతలు గాలిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో స్వతంత్ర అభ్యర్థి ఒకరు బరిలో ఉండగా, పశ్చిమ గోదావరి జిల్లాలోని రెండు స్థానిక సంస్థల నియోజకవర్గాల్లో ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు రంగంలో ఉన్నారు. ఇక మూడు పట్టభద్రుల, రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాలకు జరిగే ఎన్నికల్లో మాత్రం భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ ఐదు నియోజకవర్గాలు ఏకగ్రీవం చేయడం అసాధ్యం.

**ప్రజావ్యతిరేకత బహిర్గతం కానీయకుండా...**

వాస్తవానికి స్థానిక సంస్థల్లో అధికార పార్టీ అభ్యర్థులే ఎక్కువ శాతం ఉన్నారు. గెలుపు నల్లేరుపై నడకే. కానీ ఇటీవల అధికార పార్టీపై ప్రజల్లో పెద్దఎత్తున వ్యతిరేకత నెలకొన్న నేపథ్యంలో పోలింగ్ జరిగితే ఆ ప్రభావం పడుతుందేమోనని వైసీపీ నేతలు భయపడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన నాలుగేళ్లలో అన్ని విధాల వైఫల్యం చెందింది. ఒక్క అభివృద్ధిపని కూడా చేయలేదు. ఒక్క సాగునీటి ప్రాజెక్టును చేపట్టలేదు. పాతవాటిని పూర్తిచేయలేదు. సంక్షేమం పేరు చెప్పి అప్పులు తెచ్చి నగదు పంచి ఓట్లు కొనుగోలుచేస్తున్నారు. వనరులు దోచేస్తున్నారు. పన్నుల భారం, విద్యుత్ ఛార్జీలు, పెట్రోలు ధరల పెంపుతో జనం ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. ఇసుక పాలసీ పేరుతో తమ కడుపులు కొట్టారని నిర్మాణరంగ కార్మికులు మండి పడుతున్నారు. నాసిరకం మద్యాన్ని రెండు రెట్లు ధరలు పెంచి ప్రభుత్వమే అమ్ముతూ మద్యం నిషేధ హామీని గాలికి వదిలేసింది. ఉద్యోగ ఖాళీల భర్తీపై నిరుద్యోగులకు, పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని ఉద్యోగులకు, సర్వీసును క్రమబద్ధీకరిస్తామని కాంట్రాక్టు ఉద్యోగులు ఇచ్చిన హామీలుకు నోచలేదు. స్థానిక సంస్థల నిధులను దారి మళ్లించారు. ప్రభుత్వ అవినీతిని ప్రశ్నించిన వారిపై భౌతిక దాడులకు దిగుతూ, పోలీసులతో అక్రమ కేసులు పెట్టిస్తున్నారు.

**నిబంధనలఉల్లంఘనలు**

ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా వైసీపీ అడుగడుగునా నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడుతోందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఎన్నికల కోడ్‌ను ఏ మాత్రం పట్టించుకోకుండా, వివిధ పథకాల పేరుతో ఓటర్లను ప్రభుత్వం ప్రలోభ పెడుతోంది. అధికార యంత్రాంగాన్ని ఉపయోగించు కోవడంతో పాటు ఓటర్లను ఆకర్షించడానికి కానుకలు పంచిపెడుతోందని విపక్షాలు అంటున్నాయి. సీఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 2011 మంది జూనియర్ న్యాయవాదులకు 'లా నేస్తం' పథకం కింద రూ. కోటి 55 వేలు వారి ఖాతాల్లో జమ చేశారు. ఈ పథకం ప్రచార ఆర్భాటం కోసం మరో కోటి రూపాయలకుపైగా ఖర్చు చేయడంపై ప్రతిపక్షాలు విమర్శలు సంధించాయి. గతంలో ఎమ్మెల్సీ ఓట్ల చేర్పింపులో వాలంటీర్ల పాత్రపై విమర్శలు వచ్చాయి. అధికార పార్టీకి అనుకూలంగా దొంగ ఓటర్లను పెద్దఎత్తున చేర్పించినట్లు ప్రచారముంది. అనుకూలమైన అధికారులను ఆయా ప్రాంతాలకు బదిలీ చేయడాన్ని



**వల్లూరు జయప్రకాష్ నారాయణ**

విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఏపీఎస్ఈఆర్టీ సంచాలకులుగా ఉన్న ప్రతాప్ రెడ్డిని ఎమ్మెల్సీ ఎన్నికల ముందు హడావిడిగా కడప ఆర్జేడీ (పాఠశాల విద్య)గా ప్రభుత్వం బదిలీ చేసింది.

వైసీపీ అనుకూల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డి గెలుపు కోసం ఆయన బహిరంగంగా సభలు, సమావేశాలు, సదస్సులు నిర్వహిస్తున్నారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం ఉపకులపతి (వీసీ) పీవీజీడీ ప్రసాదరెడ్డి సైతం అక్కడి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి విజయం కోసం ప్రచారం చేస్తున్నారు. విశాఖ దసపల్లా హోటల్లో వైసీపీ ముఖ్యనేతలు ఏర్పాటు చేసిన సమావేశానికి వీసీ ప్రసాదరెడ్డి తన హోదాకు భిన్నంగా హాజరు కావడంపై విద్యార్థి, యువజన సంఘాలు తీవ్ర నిరసన తెలిపాయి. ప్రతాపరెడ్డి, ప్రసాదరెడ్డిపై చర్యలు తీసుకోవాలని గవర్నర్, ఎన్నికల కమిషన్‌కు ఉపాధ్యాయ సంఘాలు, ప్రతిపక్షాల ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం.

**బీజేపీ తరపు అభ్యర్థులు....**

భారతీయ జనతా పార్టీ మూడు పట్టభద్రుల ఎన్నికల్లో తమ అభ్యర్థులను నిలబెట్టింది. శ్రీకాకుళం, విజయనగరం విశాఖపట్నం పట్టభద్రుల నియోజకవర్గం నుండి సిట్టింగ్ ఎమ్మెల్సీ వీవీఎన్ మాధవ్‌ని తిరిగి ఎంపిక చేసింది. ప్రకాశం నెల్లూరు చిత్తూరు నియోజకవర్గానికి సన్నపురెడ్డి దయాకర్ రెడ్డి, కడప అనంతపూర్ కర్నూలు నియోజకవర్గానికి నాగరూరు రాఘవేంద్రను ఎంపిక చేసింది.


**ఓటు లేని సీఎం...**

పశ్చిమరాయలసీమ నియోజకవర్గానికి చెందిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అక్కడ పట్టభద్రుల ఓటరుగా పేరు నమోదు చేసుకోలేదు. వైసీపీ రాష్ట్ర అధినేతగా, సొంత పార్టీకి సంబంధించిన అభ్యర్థులకు మేలు కలిగేలా ఓటు నమోదు చేసుకోనప్పుడు, నియోజకవర్గ పరిధిలోని ఓటర్లను ఎలా ఓటు అడుగుతారో చెప్పాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. దీన్ని బట్టి మండలి ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు వైసీపీ కోల్పోయిందని కూడా అంటున్నాయి.

**వ్యాసకర్త:**
**ఛైర్మన్,సెంట్రల్ లేబర్ వెల్ఫేర్ బోర్డు, కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ.**

# 'అహో' మంగళాద్రీశా!

శ్రీమహావిష్ణువు దశవతారాలలో నాలగవది నృసింహుడు అవతారరీత్యా ఉగ్రమూర్తే అయినా కరుణాంతరంగుడు. దుష్టశిక్షణ కోసం స్తంభంలో ఉద్భవించి, శిష్టులకు ప్రసన్నాకృతితో సాక్షాత్కరించారు. మంగళాద్రి (మంగళగిరి), అహోబిలం నృసింహ క్షేత్రాలలో ఫాల్గుణ శుక్ల పక్షంలో బ్రహ్మోత్సవ/ కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.




గుంటూరు జిల్లాలో కృష్ణానదీ తీరంలో గజాకార కొండకు మంగళాచలం, మంగళశైలం, మంగళాద్రి, తోతాద్రి, ధర్మాద్రి, ముక్త్యాద్రి అనీ నామాంతరాలు ఉన్నాయి. ఐశ్వరప్రదాయిని శ్రీలక్ష్మీ దేవి అధిష్ఠించిన క్షేత్రం కనుక మంగళ ప్రదమైనదని, 'మంగళ'గిరి అని పేరు వచ్చిందని పురాణ కథనం. ఈ క్షేత్రంలో నరసింహస్వామి మూడు రూపాలలో కొలువై ఉన్నారు. పర్వత శిఖరాగ్రాన గండాల నరసింహ స్వామి, కొండ మధ్యభాగాన పానకాల నరసింహ స్వామి, కొండ కింద శ్రీలక్ష్మీ నరసింహ స్వామిగా భక్తులను అనుగ్రహిస్తున్నారు. ఎగువ సన్నిధిలో (పానకాల స్వామి) ఉదయ, మధ్యాహ్నకాల అర్చనలు, దిగువ (శ్రీరాజ్యలక్ష్మీ నరసింహస్వామి) సన్నిధిలో త్రికాలార్చనలు జరుగుతాయి.

స్థల పురాణం ప్రకారం, ఈ పర్వత గుహలోకి ప్రవేశించిన బ్రహ్మ వరప్రసాది, లోకకంటకుడు నముచి అనే దానవుడిని విష్ణువు నృసింహరూపంలో సంహరించారు. త్రినేత్రాలతో భీకరంగా ఉన్న ఆ మూర్తిని చూసి దేవతలే భీతిల్లారట. ఉగ్రరూపం ఉపశమనం కోరుతూ బ్రహ్మరుద్రాదులు స్తుతించగా, తన ఆజ్ఞతో దేవతలు తీసుకువచ్చిన అమృతాన్ని స్వీకరించి శాంతించారట. నాటి నుంచి యుగధర్మం ప్రకారం (కృతయుగంలో అమృతం, త్రేతాయుగంలో ఆవునేయి, ద్వాపరంలో గోక్షీరం, కలియుగంలో బెల్లం పానకం) నైవేద్యంగా స్వీకరిస్తున్నారు. నాడు దేవతలు అందించిన అమృతంలో సగం మాత్రమే స్వామి స్వీకరించి మిగిలినది బయటకు వదిలారట. కలియుగంలో సమర్పిస్తున్న పానకం ప్రసాదం కూడా ఆ కోవ కిందికే వస్తుందని చెబుతారు. తరతరాలుగా ఇలా పానకం తయారు చేసి సమర్పిస్తున్నా, ఆలయ ప్రాంగణంలో చీమలు, ఈగలు వంటివి కనిపించక పోవడాన్ని ప్రత్యేకతగా చెబుతారు. శంకర భగవత్పాదులు, చైతన్యప్రభువు ఈ క్షేత్రాన్ని సందర్శించారన్న నిదర్శనంగా వారి పాదచిహ్నాలను మెట్లపై మలచారు. శ్రీరామచంద్రుడి ఆదేశం మేరకు భక్తాంజ నేయుడు ఇక్కడ క్షేత్రపాలకుడిగా స్థిరనివాసం ఏర్పరచు కున్నారని మరో పురాణగాథ.

**వార్షిక కల్యాణోత్సవాలు**

ఏటా ఫాల్గుణ శుద్ధ షష్ఠినాడు మొదలైన వార్షిక కల్యాణోత్సవాలు పదకొండు (తొమ్మిది) రోజుల పాటు సాగుతాయి. శుద్ధ చతుర్దశి నాటి రాత్రి కల్యాణం, మరుసటి రోజు రథోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాన్ని దక్షిణాది 'పూరి' రథోత్సవం'గా భక్తులు విశ్వసిస్తారు. 'మంగళగిరి తిరునాళ్ల'కు తెలుగునాట ప్రత్యేకత ఉంది. ఫాల్గుణ బహుళ తదియ నుంచి పది రోజుల పాటు రోజుకు

---


# నవచైతన్యానికి




వసంత రుతువు ఆగమనానికి సంకేతం హోలీ పున్నమి. రాలే ఆకులు రాలుతూ, వచ్చే ఆకులు వచ్చే వేళ, ప్రకృతిలో వ్యక్తమయ్యే నవచైతన్యానికి సంకేతంగా ఈ పండుగను భావిస్తారు. ఫాల్గుణ, చైత్ర మాసాల సంధికాలంలో జరుపుకునే ఈ పండుగ గురించి భవిష్య, నారద పురాణాలతో పాటు గాథాసప్తశతి, మాళవికాగ్నిమిత్రం, నాగావళి లాంటి గ్రంథాలు పేర్కొన్నాయి. ఆధునిక కాలంలో సామాజిక సమైక్యత, సమష్టి భావనకు ప్రతీకగా నిలిచినట్లే, ఈ పండుగకు పురాణ నేపథ్యమూ ఉంది. ముఖ్యంగా కాముని దహనం, ప్రహ్లాద చరిత్ర ఈ పండుగతో ముడిపడి ఉన్నాయి.

లోకకంటకుడు త్రిపురాసుర సంహారానికి లోకనాయకుడు (కుమారస్వామి) అవతరించాలి. అందుకు తపోదీక్షలో ఉన్న శివుడు ప్రణయాను రక్తుడు కావాలి. తపస్సునుంచి దృష్టిని మళ్లించేం దుకు బ్రహ్మ సూచన మేరకు మన్మథుడు అకాల వసంత రుతువును సృష్టించి సుమబాణ ప్రయో గంతో పరమేశ్వరుడి మనసు చలింపచేస్తాడు. ఆగ్రహించిన హరుడు ఫాలనేత్రం (మూడవ కన్ను)తో రతీపతిని ఫాల్గుణ పున్నమినాడు భస్మంచేసినట్లు శివమహా పురాణం పేర్కొంది. మరో గాథ ప్రకారం, పరమశివుడిని వివాహమాడాలనుకున్న హిమ వంతుని కుమార్తె గిరిజ, తపోదీక్షలో ఉన్న ఆయనను ప్రసన్నుడిని చేసుకోవాలనుకుంటుంది. అందుకు మన్మథుని సహాయాన్ని కోరగా, ఆతని పుష్పబాణ ప్రయోగంతో తపోభంగమై మహేశ్వరుడు తన ఫాలనేత్రంతో మన్మథుడిని దహించివేశాడు. రతీదేవి, దేవతల విన్నపాన్ని మన్నించిన శివుడు ఆతనిని పునర్జీవుని చేశాడు. ఆ రోజు ఫాల్గుణ పౌర్ణమి కావడంతో అది 'కాముని పున్నమి, 'కామదహ నోత్సం'గా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇక్కడ కామం అంటే శృంగారపరమైన 'వాంఛ' అనే అర్థంలోనే కాకుండా 'కోరిక' అనే లౌకిక అర్థంలో గ్రహించాలని పెద్దలు సూచిస్తారు. మానవుడు ఐహికమైన కోరికలను పరిత్యజించి నిష్కామకర్మతో వ్యవహ రించాలని హోలీ పండుగ సందేశాన్ని ఇస్తోంది. మీనాక్షీదేవి ఘోరతపస్సు చేసి సుందరేశ్వరుడిని పరిణయమాడిందీ ఫాల్గుణ పౌర్ణమి నాడే. ఆ రోజున ఆదిదంపతులకు పూజాదికాలు నిర్వహించి 'హోలికా మిశ్రమం' (మామిడిపూత, వేపచిగుళ్లు, తేనె మిశ్రమం)ను భక్తులు ప్రసాదంగా స్వీకరిస్తారు. ప్రహ్లాద గాథను అనుసరించి, ప్రహ్లాదుడితో హరి నామస్మరణ మానిపించే ప్రయత్నంలో భాగంగా తండ్రి హిరణ్యకశిపుడు అనేక విధాల శిక్షలు విధిస్తుంటాడు. పసిపిల్లలను అపహరించే ఆయన సోదరి హోలిక మహాశక్తి సంపన్నురాలు. అగ్నికూడా దహించలేని ఆమె ద్వారా ప్రహ్లాదుని అగ్ని

# నమోస్తుతే...




ఒక అవతారంలో స్వామిని అలంకరించి అర్చిస్తారు.

**అహోబిలేశ్వరా! నమో నమః...**

తిరుమల నుంచి శ్రీశైలం వరకు ఆదిశేషుని ఆకృతిలో గల పర్వతపంక్తిలోని మధ్య ప్రదేశం అహోబిలం. దీనికి అహోబలం, అహోబిలం, అహోబిలగిరి, ఓబులం, దిగువ తిరుపతి, గరుడాద్రి, వీరక్షేత్రం, నగరి, నిధి, తక్ష్యాద్రి, నరసింహతీర్థం, గరుడాచలం తదితర పేర్లు ఉన్నా 'అహోబిలం' పేరే ప్రాచుర్యంలోకి వచ్చింది. హిరణ్యకశిపుని సంహరణకు శ్రీహరి స్తంభం నుంచి ఉద్భవించగా పేరెన్నిక గన్నదే శ్రీ ఉగ్ర నరసింహక్షేత్రం అహోబిలం. స్తంభోద్భవుడు (నృసింహుడు) ఒక పాదం అహోబిలంలో, మరో పాదం పెన్నాహోబిలంలో (అనంతపురానికి సుమారు 22 కి.మీ. దూరంలోని కొండపై) మోపి హిరణ్యకశిపుడిని సంహరించాడని జనశ్రుతి. అసుర సంహారం తరువాత స్వామి అహోబిలంలోని 'రక్తకుండం'లో చేతులు కడుక్కున్నారని చెబుతారు. మహోగ్ర నరసింహమూర్తిని వీక్షించి భీతాశ్చర్యాలకు లోనైన బ్రహ్మరుద్ర ఇంద్రాది దేవతలు, గంధర్వ, యక్షకిన్నెర, కింపురుషులు, ప్రజాపతులు, రుషులు తదితరులు **'అహో వీర్యం అహో శౌర్యం అహో బాహు పరాక్రమం:/నారసింహం పరందైవం అహోబలం అహోబలం'** అని శ్లాఘించారట. కాలక్రమంలో అది 'అహోబిలం'గా మారిందంటారు. గరుత్మంతుడి ఘోర తపస్సుకు ప్రసన్నుడైన నరసింహుడు గుహ(బిలం)లో దర్శనమివ్వడంతో 'అహోబిలం'అనే పేరు వచ్చిందని మరో కథనం ప్రచారంలో ఉంది. స్వామివారి సాక్షాత్కారంతో సంతోషాతిశయంతో పక్షిరాజు 'అహోబిలం మహాబలం' (అహోబలక్షేత్రం మనలను మహాబలవంతులను చేస్తుంది)అన్నాడనీ కథనం. ఈ నవనారసింహ క్షేత్రంలో ఎగువ అహోబిలంలో చెంచులక్ష్మీ సమేత ఉగ్రనరసింహ, దిగువన ప్రహ్లాద వరద శ్రీ అమృతవల్లి నరసింహుడిగా స్వామి దర్శన మిస్తున్నారు. 'అహోబలేశుడు'గా పూజలందుకునే స్వామి జన సామాన్యంలో 'ఓబులేశు'గా మారాడు. మహా బలపరాక్రమాలతో స్వామి బిలం(గుహ)లో దర్శనం ఇవ్వడంవలన ఈ క్షేత్రానికి 'అహోబలం, 'అహోబిలం' అనే పేర్లు వచ్చాయని ప్రతీతి. పన్నెండు మంది ఆళ్వారులలో ఒకరు (ఎనిమిదవ శతాబ్దానికి చెందిన) తిరుమంగై ఆళ్వార్ ఈ క్షేత్రాన్ని 'సింగవేల్ కుండ్రమ్' అన్నారు. తమిళులు నేటికీ ఇలాగే వ్యవహరిస్తారు.

కానుగ వృక్షం కింద కొలువై ఉన్నందున కారంజ నరసింహుడు అని పేరు వ్యవహరిస్తారు. తమ ఆడపడుచు చెంచులక్ష్మిని మనువాడడం ద్వారా నరసింహుడు తమ అల్లుడయ్యాడన్నది ఈ ప్రాంతం (నల్లమల) చెంచుల ప్రగాఢ విశ్వాసం. గిరిజనులు స్వామి వారికి జుంటు తేనె, అడవి మాంసం నైవేద్యంగా పెట్టేవారట. దివిజ గంగ 'భవనాశిని'గా భువికిదిగి వచ్చి నృసింహుని పాదాలు కడుగుతూ ప్రవహిస్తోంది. ఇది భవరోగాలకు దివ్యౌషధమని విశ్వాసం. దీనిద్వారా సకల పుణ్యాలు సమకూరుతాయని సాక్షాత్తు స్వామివారే అనుగ్రహించారని పురాణవాక్కు. ఫాల్గుణ శుద్ధ పంచమి నుంచి పౌర్ణమి వరకు స్వామి వారి కల్యాణోత్సవాలు జరుగుతాయి. ఈ క్షేత్రాన్ని పురాణపురుషులు పరశురామ, రామలక్ష్మణులు,బలరామ శ్రీకృష్ణార్జునులు, త్రిమతాచార్యులు శంకర, రామానుజ. మధ్వాచార్యులు సందర్శించి స్వామిని అర్చించారని ఐతిహ్యం. విశిష్టాద్వైత స్థాపకులు రామానుజాచార్యులు, అనంతర కాలంలో వేదాంత దేవికులు, పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు ఈ స్వామి ఘనతను తమ సంకీర్తనలలో కీర్తించారు. ★





డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్

ప్రవేశం చేయించాలనుకుంటాడు హిరణ్యకశిపుడు. అన్న ఆజ్ఞ మేరకు హోలిక మేనల్లుడిని ఒడిలో కూర్చుండపెట్టుకుని అగ్నిప్రవేశం చేస్తుంది. అయితే ఆతని స్పర్శ కారణంగా హోలిక అగ్ని కీలలకు ఆహుతి కాగా, ప్రహ్లాదుడు భద్రంగా బయటికి వస్తాడు. హోలిక దహనమైన ఫాల్గుణ పౌర్ణమినే 'ప్రహ్లాద పౌర్ణమి' అంటారు. రాక్షసి పీడ వదలినందుకు సంతోషంతో ప్రజలు రంగునీళ్లు (వసంతాలు) చిమ్ముకుంటూ వేడుక జరుపుకున్నారట. హోలీ నాడు జనావాస కూడళ్లలో పెద్ద మంటలు (భోగి మంటల మాదిరి) వేసి అగ్నికి ప్రదక్షిణ చేసి ఆ భస్మాన్ని నుదుటిన ధరిస్తారు. కొన్ని ప్రాంతాలలో దీనిని 'ధూళి వందన్'గా వ్యవహరిస్తూ, దీనివల్ల ప్రతికూలశక్తులు దూరమై, సానుకూల శక్తులు సమకూరుతాయిని విశ్వాసం. కాముని పున్నమి నాడు తెలంగాణ గ్రామీణ ప్రాంతంలో పశువుల కాపరులు వారిలో ఒకరికి ఎలుగుబంటి వేషం వేసి ఇళ్ల ముందు ఆడిస్తూ పాటలతో భిక్షాటన చేసేవారని తెలుస్తోంది.

పాలిచ్చే సాకుతో తనను చంపవచ్చిన రక్కసి పూతన ప్రాణాలను బాలకృష్ణుడు హరించిన రోజు పౌర్ణమే. గండం నుంచి బయటపడిన ఆయనను వ్రేపల్లె మహిళలు ఊయలలో వేసి పండుగ జరుపుకోవడంతో 'డోలోత్సవం' అనే పేరు వచ్చిందని చెబుతారు. శ్రీకృష్ణుడికి ఈ ఉత్సవం నిర్వహించి, బొబ్బట్లు నివేదిస్తారు. ఫాల్గుణ శుక్ల అష్టమి నుంచి పున్నమి వరకు 'హోలాష్టకం' అంటారు. ఈ ఎనిమిది రోజులూ అష్టదిక్పాలకులను, నవగ్రహాలను, దశ మహాశక్తులను నవధాన్యాలతో అర్చించే ఆచారం కొన్ని ప్రాంతాలలో ఉంది. అలా పూజించిన తరువాత ఆయా దేవతలకు ఉద్వాసన పలికి వారి మూర్తులపై గల చందన పన్నీటి మిశ్రమాన్ని చిలకరించడమే హోలీ వేడుకగా ప్రసిద్ధి చెందిందని చెబుతారు.

**ఆనందంతో పాటే ఆరోగ్యం**

హోలీనాడు ఆనందాన్ని పంచుకునే క్రమంలో వాడే రంగులను వేపగింజలు, కుంకుమ, పసుపు తదితర ప్రకృతి సిద్ధ, ఆయుర్వేద పదార్థాలతో తయారు చేసేవారు.

కాలక్రమంలో రసాయనాలతో నిండిన రంగులు వచ్చాయి. వీటి కారణంగా ఆనందం, వినోదాలను అటుంచి ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయని, వాతావరణం కలుషితమవుతోందని వైద్య నిపుణులంటున్నారు. సంప్రదాయకంగా వస్తున్న పండుగలను జరుపుకుంటూనే, నియమాలను పాటిస్తే ఆరోగ్యాలను, పర్యావరణాన్ని కాపాడినవారమవుతాం. ★



నందీశ్వరావతారం



గజావతారం




# వేదంలో శివుడు, హర

**ఆర్యులు ఎక్కడి నుంచో భారతదేశానికి వచ్చి ద్రావిడులను అంతం చేశారు. ఆపై వారి ఆచార వ్యవహారాలు ఇక్కడ ఆచరణ లోకి తెచ్చారు. హరప్పా, సింధు నాగరికత లలో హిందూమతం ఆనవాళ్లు కానరావు. ఇదీ కొందరు చరిత్రకారుల వాదన. ఇవన్నీ ఒకదానితో ఒకదానికి సంబంధం ఉన్న చారిత్రక అంశాలు. వాటిని వివాదాస్పదం చేయడం అందుకే. ఇవి ఎడతెగకుండా ప్రతితరం బుర్రలలోకి కొన్ని దశాబ్దాలుగా చేరుతున్న అభిప్రాయాలు కూడా.**

చరిత్ర రచన అంటే వాదం ఉంటుంది. ప్రతివాదం ఉంటుంది. అంతిమంగా సమన్వయ వాదం ఉంటుంది. కానీ పైన చెప్పుకున్న ఆ కీలక చారిత్రకాంశాల మీద వాదనలే గానీ ప్రతివాదాలు బతికి బట్టకట్టడం లేదు. సమన్వయవాదం ప్రశ్నే లేదు. చరిత్ర రచనకు సంబంధించి ఇది. ఈ దేశ దౌర్భాగ్యమే. చరిత్ర రచనకు అంతిమ వాక్యం మాదేనని చెప్పే నియంతృత్వ పోకడ ఇది. కమ్యూనిస్టు నాస్తికులు దీనికి బాధ్యులు. మతాన్నే కాదు, దాని ఉనికినీ, చరిత్రనీ, సంస్కృతి, జీవనం మీద దాని ప్రభావాలనూ కూడా గుడ్డిగా ద్వేషించేవాళ్లు, నిరాకరించేవాళ్లు మత విషయాల మీద వారి వారి రాజకీయ సిద్ధాంతాల ప్రాతిపదికగా ఇచ్చిన తీర్పుల ఫలితమిది. ఇక, ఆస్తికులైనవారి మౌనం నాస్తికుల స్వైర విహారానికి ఇతోధికంగా దోహదపడింది. ఆస్తికులుగా చెప్పుకుంటున్నవారికి, సత్యనిష్ఠతో చరిత్ర రచన చేయాలన్న సంకల్పం ఉన్నవారికి జరుగుతున్న ఈ అన్యాయం గురించి ఇప్పటికీ పట్టడం లేదు. ఇంత పెద్ద అంశం మీద చైతన్యం లేకపోవడం ఎంత నేరమో వారు గ్రహించకపోవడమూ పెద్ద విషాదమే. ఆ మేధో దగాను నిలువరించే ప్రయత్నం చాలా తక్కువ. ఆ పురాతన నాగరికతలకు చెందినవిగా చెబుతున్న ముద్రికలను, అవశేషాలను సరిగా పరిశీలించకుండానే నాస్తికులైన చరిత్రకారులు తీర్పులు ఇచ్చారు. క్రీస్తుశకం ఒకటో శతాబ్దంలో మాత్రమే హిందూమతం రూపురేఖలను సంతరించు కుందనీ, శివాలయాలు, దేవాలయాల నిర్మాణం ఇవన్నీ అప్పటి నుంచే మొదలైందనీ వీరు సిద్ధాంతాలు చేశారు. అంటే అప్పటివరకు ఉన్నవన్నీ బౌద్ధా రామాలూ, జైనుల ప్రార్థనా మందిరాలే అన్నమాట. వాటి స్థానంలో హిందూ దేవాలయాలు వచ్చాయని చెప్పడం వీరి ఉద్దేశం. తమ పరిశోధన సారాంశాలే అంతిమ తీర్పులని తేల్చేశారు. అక్కడ దొరికిన అవశేషాలను ఇష్టరీతిన పరిశీలించడం, తలకిందులుగా చూడడం, అర్థం చేసుకోలేకపోవడం, తమకు అర్థమైన మేరకే వ్యాఖ్యానాలు చేయడం వారు చేసిన, చేస్తున్న తప్పిదాలే. ఆర్యుల రాక అంశమే కాదు, హరప్పా సంస్కృతిలో హిందూమతం గురించి వారు ప్రకటించిన అంశాలు పూర్తిగా అవాస్తవాలు. హరప్పా మొదలయిన గ్రామాలలో జరిపిన త్రవ్వకాలలో లభించిన అవశేషాలలో శివుని అవతార చిత్రాలు కొన్ని లభిస్తున్నాయి. ఇవి భారతదేశంలో ఐదువేల సంవత్సరాల వెనుక శివారాధన ఉందనడానికి ఆధారాలు. మరి శివారాధననూ, హిందూమతాన్నీ వేర్వేరుగా చూడడం వాస్తవిక, శాస్త్రీయ దృక్పథమని చెప్పడం ఎలా? హరప్పా అవశేషాలలో శివుని ప్రతిమ కనిపించడం నిజం. దీని మీద ఏకాభి ప్రాయం ఉంది. కానీ అప్పటికి హిందూమతం ఆనవాళ్లే లేవని వాదిస్తే ఆ హరప్పా శివుడు ఎవరు?

హరప్పా అనే పదబంధంలో హర పదం శివునికి పర్యాయనామం. హృఞ్ హరణే అనే ధాతువు నుండి హర పదం ఏర్పడింది. హరతి ప్రళమే సర్వమితి హరః-ప్రళయకాలంలో సర్వము హరించువాడు అని ఒక అర్థం. భక్తుల పీడను హరించువాడని మరొక అర్థం.

మొహెంజోదారో త్రవ్వకాలలో పశుపతి దేవుని ముద్రిక దొరికింది. ప్రక్కన పశువులుండడం వలన దీనికి పశుపతి అని పేరు పెట్టి ఉంటారు. పశుపతి శివుని పర్యాయపదం (అమరకోశం 1-30). ఈ ముద్రికలో రుద్రుని తలపై పాము, దానికి అయిదు




**డాక్టర్ చిర్రావూరి శివరామకృష్ణ శర్మ**
భాషా ప్రవీణ, విశ్రాంత అధ్యాపకులు, ఆంధ్ర జాతీయ కళాశాల, మచిలీపట్టణం



పశుపతి దేవుని ముద్రిక



కిరతావతారం



వృషభావతారం

# ప్పా హరుడు ఒకరే

తలలు, దానికి తలపై మణి, మధ్యలో పైకి ఉబుకుతున్న గంగా ప్రవాహం, రుద్రునితలపై మరొక ప్రక్క అర్ధచంద్రుడు వంటి చిత్రాలు కనిపిస్తాయి.

చిత్రంలో కుడివైపున దేవనాగరి ప్రణవం ఉంది. ముద్రికలో ఏనుగు బొమ్మ, మనిషి బొమ్మ, దాని క్రింద ఆయుధం ఉన్నాయి. రుద్రునికి అలంకారాలు, కవచం కనబడుతున్నాయి. దీనికి మూడు తలలు గల పశుపతి దేవుని ముద్రిక అని పేరు పెట్టారు చరిత్రకారులు. కాని మూడు తలలు లేవు. జుట్టు లేని ఒకే శిరస్సు ఉంది. (తరతరాల భారతచరిత్ర, రొమిల్లా థాపర్, 21 పుట). కొందరు రెండు కొమ్ముల దేవుడు అన్నారు (చరిత్రలో మతాలు 2పుట). అవి కొమ్ములు కావు. ఒకటి సర్పం, రెండవది అర్ధచంద్రుడు.

ఇది వేదం మొదలయిన గ్రంథాలలో వర్ణించిన రుద్రరూపమని నేను రాసిన 'శ్రుతి సౌరభం' గ్రంథంలోను, 'సింధు సంస్కృతి- నమకంలోని రుద్రుడు' అనే వ్యాసంలోను ఉటంకించాను (వేదపరిషత్ వార్షిక సంచిక 2002-2003, 64, 65వ పుట). ప్రణవానికి పరమున గలవాడు పరమేశ్వరుడని తైత్తిరీయారణ్యకం అనే వేదభాగం చెప్పింది (10పు. 12 అ. 3ప.).

శివధ్యానాల్లో తలపై చంద్రుడు, గంగ, ఉండడం ప్రసిద్ధమే. రుద్రునికి గంగాధరుడని పేరు. గంగను తలపై ధరించినవాడని అర్థం. శివాష్టోత్తర శతనామ స్తోత్రంలో కూడా ఈ నామముంది (6 శ్లో. అమర 1-54). భీమః అవి మరొక పేరు (అమరః 1-35). వీరి వలన భయపడతారు అని అర్థం. హరప్పా రుద్రుని చూస్తే భయం కలుగుతుంది.

శివ సహస్రనామ స్తోత్రంలో గజేశ్వర, నరర్షభ అనే నామాలున్నాయి (148 శ్లో.). పశుపతి దేవుని ప్రక్కన ఎడమవైపు



ద్విజావతారం

ఏనుగును, మనుష్యుని చిత్రించారు. శివ సహస్ర నామస్తోత్రంలో ముండః తలపై జుట్టు లేనివాడు అనే నామముంది. పశుపతి దేవునికి జుట్టులేదు. నమకంలో వ్యుప్త కేశనామముంది. దీనికి కూడా అదే అర్థం.

నమకంలో తారాయ అనే నామముంది. ప్రణవస్వరూపుడని అర్థం. పశుపతి దేవుని ప్రక్కన ప్రపంచముంది.

నమకంలో తారాయ అనే నామముంది ప్రణవస్వరూపడని అర్థం. పశుపతి దేవుని ప్రక్కన ప్రణవముంది.

నమకంలో 'కవచినే' అనే నామం ఉంది. కవచం కలవాడు శివుడు. పశుపతి దేవునికి కవచం ఉంది.

నమకంలో పశుపతయే అనే నామం ఉంది. పశుపతి దేవుని ముద్రిక అని పేరులోనే ఉంది కదా!

'ఆయుధినే' అని నమకంలో ఉంది. ఆయుధం కలవాడు అని అర్థం. పశుపతి ప్రక్క బాణాయుధం ఉంది కదా! నమకంలో కూడా ఇషువు కలవాడని తెలిసే నామం ఉంది (కృష్ణ యజుర్వేదం 4 అ.5ప.).

రుద్రునికి నందీశ్వరావతారముంది. (శివ పురాణం శతరుద్ర సం.6అ.). శివునికి వృషభావ తారముంది (శివపు. శతరుద్ర సం.23అ.) హరప్పా అవశేషాలులో వృషభచిత్రముంది.


రుద్రునికి ద్విజేశ్వరావతారం, ద్విజావతారం ఉన్నాయి (శివపు.శతరుద్ర – 27, 35 అ). హరప్పా అవశేషాలలో యజ్ఞోపవీతంవలె వస్త్రాన్ని ధరించిన ద్విజచిత్రం ఉంది. యజ్ఞోపవీతంవలె ఉత్తరీయం ధరించమని వేదంలో ఉంది (తైత్తిరీయారణ్య 2ప.). నందీశ్వరునికి కొమ్ములుంటాయి. తలపై సర్పముండదు. హరప్పా అవశేషాలలో నందీశ్వర రూపముంది. రుద్రునికి కిరాతేశ్వరావతారముంది (శివపు.శతరుద్ర.37 అ.). హరప్పా అవశేషాలలో కిరాతచిత్రం ఉంది.

ఇలా పేరు, వేదం, శివపురాణాల్లో, శివాష్టోత్తర శతనామ స్తోత్రం, శివ సహస్రనామ స్తోత్రం అనే గ్రంథాల ద్వారా పరిశీలిస్తే హరప్పా సంస్కృతిలో శివారాధన ఉందని తెలుస్తోంది. ఆసక్తి కలవారు కోరితే ఈ అవతార కథలను కూడా తెల్పవచ్చు.

హరప్పా, సింధు నాగరికతల అవశేషాలు బయటపడిన తరువాత ఆర్యుల రాక, హిందూ జీవన ప్రాచీనతల గురించి అప్పటిదాకా వినిపించిన కొన్ని వాదనల స్వరం మారింది. లేదా దారి మళ్లింది. రుగ్వేదం సంస్కృతిలో కీలకంగా కనిపించే సరస్వతి నది కల్పితమన్న వాదనను హరప్పా, సింధు తవ్వకాలు పెద్ద అబద్ధమని తేల్చాయి. సరస్వతి నది ఒకనాడు ఉనికిలో ఉందని చెప్పే నాసా ల్యాండ్‌సాట్ ఉపగ్రహ ఛాయాచిత్రాలు చాలాకాలం క్రితమే అందుబాటులోకి వచ్చాయి. హరప్పా నాగరికతల కాలం నాటికి హిందూ మతం ఆచరణలో లేదని చెప్పడానికి చాలామంది తమ వంతు ప్రయత్నం చేశారు. అలా హిందూ మత చరిత్రను కుదించే కుట్ర చేశారు. రుగ్వేదం విరివిగా ప్రస్తావించిన సరస్వతి నది ఉనికిని ప్రశ్నార్థకం చేయడమంటే, రుగ్వేదం విలువను తగ్గించే యత్నమే. శివ పశుపతి ముద్రిక హరప్పా తవ్వకాలలో బయటపడింది. కానీ అది శివుని రూపమని ఒకవైపు అంగీకరిస్తున్నా, హిందువులు పూజించే శివుడని అంగీకరించడానికి ఈ చరిత్రకారులకు మనసొప్పదు. ప్రముఖ చరిత్ర పరిశోధకురాలు రొమిల్లా థాపర్ తన పుస్తకం 'తరతరాల భారత చరిత్ర'లో హరప్పా కాలంలో కనిపించేది హిందూధర్మమని చెప్పరు. పైగా గుప్తుల కాలంలోనే హిందూమతం రూపుదాల్చిందని వాదించారు. ఈ వాదనకే ఎక్కువ ప్రచారం వచ్చింది. లేదా ఇచ్చారు. ఆర్యుల దండయాత్ర గురించి మాక్స్ ముల్లర్ ఇచ్చిన చారిత్రక క్రమానికి ఆధారాలే లేవని కొయిన్రాడ్ ఎల్స్ వంటి వారు ఇటీవలే చెప్పారు కూడా. కానీ వాటిని పరిగణనలోనికి తీసుకోవడం లేదు. అలాంటి వాదాలు వస్తున్నాయన్న విషయం కూడా నేటి పత్రికలకు, మేధావులకు కూడా పట్టడం లేదు. ఇదొక జ్ఞానద్వేషం కాదా? హరప్పా కాలంలో ఆచరించినది హిందూ మతమేనని 88 ఆధారాలు ఉన్నాయి. ఈ కాలానికి చెందినవి 5000 ఆధారాలు ఉన్నాయని చెబుతున్నారు. అవి చెల్లాచెదురుగా ఉన్నాయి. కొన్నయినా దొరుకుతాయని కలకత్తా పురావస్తు ప్రదర్శనశాలకు వెళ్లాను. ఢిల్లీ పంపామని వారి సమాధానం. బుర్రలను బూజు పట్టిస్తున్న అంశాల మీద పరిశోధన చేద్దామని నా వంటివారు సంకల్పించినా సాధ్యం కావడం లేదు. ఇక, చరిత్రను యథాతథంగా ఆవిష్కరించే యత్నం చేస్తున్నవారికి ఎదురవుతున్న అనుభవాలు ఎలా ఉన్నాయి? 'మీ పుస్తకం చదివాను, కానీ మీరు ప్రతిపాదించిన ఏ అంశంతోను ఏకీభవించను' అన్నారొక పెద్ద ప్రొఫెసర్. ఎందుకు ఏకీభవించడం లేదో వాదించడానికి ఆయనకు త్రాణ లేదట. ఇది నా స్వీయానుభవం. చాలామంది అనుభవం కూడా ఇదే అయి ఉండవచ్చు.

ఎన్ని చెప్పినా హరప్పాలో విలసిల్లినది వేరే ఏదో మతం కాదు, హిందూ ధర్మమే అన్న ముగింపును ఇక్కడి ఒక వర్గం చరిత్రకారులు ఇవ్వడం లేదు. ఈ ధోరణిని ఇప్పుడు గట్టిగా ప్రశ్నించే అవకాశం వచ్చింది. నా వరకు 'హరప్పా అవశేషాలలో శివావతారాలు' పేరుతో వ్యాసాలు చాలాకాలం క్రితమే రాశాను. సంస్కృత వాఙ్మయం ఆధారంగానే నా వాదన నిరూపించే ప్రయత్నం చేశాను కూడా. తరువాత 'శ్రుతి సౌరభం' పేరుతో మూడు సంపుటాలు వెలువరించాను. హిందూ దేశ చరిత్రను కుదించడానికి చరిత్రరచన పేరుతో జరుగుతున్న మోసాన్ని భరించలేకే ఇదంతా. హిందూ దేశ చరిత్రను కుదించడమంటే, సంశయాస్పదం చేయడమంటే భారతీయ సంస్కృతిని సంశయాస్పదం చేయడమే. హిందువులను డోలాయమాన స్థితిలోకి నెట్టివేయడమే. హరప్పా నాగరికతలో కనిపించేది నిశ్చయంగా హిందూ మతమే. భారత రామాయణాలు కల్పితమంటూ, వేదం బయటి నుంచి వచ్చిన వారు అల్లినది అంటూ చేస్తున్న వాదనలు బుద్ధిజీవుల పరిశోధన ఫలితంలా కాకుండా, సత్యనిష్ఠ కలిగిన పరిశోధన సారంగా కాకుండా ఒక ఊకదంపుడుగానే మన ముందుకు వస్తున్నాయి. దీనిని నిలువరించే ప్రయత్నం ఇంకాస్త వేగవంతం కావాలి. ఆర్యుల వాదం బలహీనపడు తున్న మాట నిజం ఇది మన గతం. రేపటి తరానికి చరిత్రను నిష్పాక్షికంగా, నిర్దుష్టంగా అందించే బాధ్యతను పవిత్ర కర్తవ్యంగా స్వీకరించాలి. ★




**హరప్పా అవశేషాలలో దొరికిన పశుపతిదేవుని ముద్రిక, దాని స్పష్టత కోసం గీసిన చిత్రములివి. దీనికి రెండు కొమ్ములు, మూడు తలలు ఉన్నాయని కొందరు చరిత్రకారులు రాశారు. కాని దీనిలో అవి లేవు. తైత్తిరీయ యజుర్వేదంలోని నమకంలో, శివాష్టోత్తర శతనామస్తోత్రంలో వర్ణించిన రుద్రరూపం దీనిలో కనబడుతుంది.**




# ఆయన పేరు వింటే నిజాంకు చెమటలు పట్టేవి!

**అరాచక నిజాం పాలనను ఆర్యసమాజ్ అడుగడుగునా ప్రశ్నించింది. దీన్ని సహించని నిజాం ప్రభుత్వం ఆర్యసమాజ్ కార్యకర్తలను నిర్బంధించింది. అంతేకాదు, వేదప్రకాశ్ వంటి కార్యకర్తలను హతమార్చింది కూడా. బహదూర్ యార్‌జంగ్ ఇస్లాం మతంలోనికి మార్చిన అనేక మంది హిందువులను ఆర్యసమాజ్ నాయకులు శుద్ధి ఉద్యమం ద్వారా తిరిగి హిందుత్వంలోనికి తీసుకొచ్చారు. ఈ ఉద్యమంలో కీలక పాత్ర పోషించినది ఆ సంస్థ ముఖ్యనేత పండిట్ నరేంద్ర.**

నరేంద్ర గురించి ఒక సందర్భంలో 'హమారే పూరే కోషిషో పర్ పానీ పేర్నా రహాహై' అని బహదూర్ యార్‌జంగ్ స్వయంగా నవాబుకు మొర పెట్టుకున్నాడట. మన ప్రయత్నాలన్నింటిని 'పొట్టి వాడు' నీటముంచుతున్నాడని దాని అర్థం. పొట్టివాడు అంటే యార్‌జంగ్ దృష్టిలో పండిట్ నరేంద్ర. ఆయన ముస్లింలుగా మారిన హిందువుల మీద నీరు చల్లుతూ వారిని తిరిగి హిందువులుగా మారుస్తున్నారని బహదూర్ ఫిర్యాదు. నిజాం రాజ్యంలో ఆనాటి అన్ని రాజకీయ పోరాటాల నాయకులు ఆర్యసమాజ్, పండిట్ నరేంద్ర చేత ప్రభావితులైనవారే అని చెప్పడం అతిశయోక్తి కాదు.

హైదరాబాద్ సంస్థానంలోని ప్రజల కడగండ్లు చూసి, వారికి అండగా నిలిచింది ఆర్యసమాజ్.. ప్రజల్లో ఎంతో స్ఫూర్తిని నింపి, సమరోన్ముఖులను చేసింది. అద్భుతమైన రీతిలో ఉద్యమాన్ని ఉధృతంగా నడిపించింది. తమ సంస్థ కార్యకలాపాలకు మాత్రమే కార్యకర్తల్ని పరిమితం చేయకుండా, కాంగ్రెస్ వంటి సంస్థలు చేపట్టిన కార్యక్రమాలకు కూడా తమ కార్యకర్తలను ఆర్యసమాజ్ నాయకులు పంపేవారు. ఆ సంస్థ విద్య, ఆరోగ్యం, స్వభాష, దురాచారాల నిర్మూలన, గోరక్షణకై బహుముఖంగా కృషి చేసింది. ఆర్యసమాజ్ ఉద్యమాలన్నిటిలో నరేంద్ర కీలకంగా వ్యవహరించారు.





**కాశింశెట్టి సత్యనారాయణ**
విశ్రాంత ఆచార్యుడు

నరేంద్ర పేరు వినగానే నిజాంకు సైతం చెమటలు పట్టేవి. గుండెల్లో రైళ్లు పరిగెత్తేవి. సామాన్యుల్లో చైతన్యం కలిగేది. కొండంత ధైర్యం వచ్చేది. హైదరాబాద్ సంస్థానం ప్రస్తావన ఎక్కడ వచ్చినా పండిట్ నరేంద్ర పేరు కచ్చితంగా చెప్పాల్సిందే. ఆయన చూపిన తెగువ, సాహసం, అనుభవించిన కాలాపానీ శిక్షలు, నిర్బంధాలు, బహిష్కరణలు, లాఠీ దెబ్బలు, తూటా దెబ్బలు.. అన్నీ ఇన్నీ కావు.

పండిట్ నరేంద్ర అసలు పేరు నరేంద్ర ప్రసాద్ సక్సేనా. మధ్యతరగతి కుటుంబంలో 1907 ఏప్రిల్ 10, శ్రీరామ నవమి రోజున జన్మించారు. తండ్రి రాంకేశవ ప్రసాద్ మున్సబ్‌దార్. నిజాం నవాబుకు అత్యంత విధేయత గల కుటుంబం. రాంకేశవ ప్రసాద్ మరణానంతరం నరేంద్ర అక్క మున్సబ్‌దార్‌గా కొనసాగారు. నరేంద్ర ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనడంతో మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఆమెను తొలగించాడు.

నరేంద్ర లాహోర్ ఉపదేశిక విద్యాలయంలో సిద్ధాంత అధ్యయనం చేశారు. ఆర్యసమాజ్ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై స్వదేశీ ఉద్యమంలో పాల్గొన్నారు. హరిజన, గిరిజన అభ్యున్నతికి కృషి చేశారు. హైదరాబాద్ ఆర్యసమాజ్ కార్యకలాపాల్లో చురుకైన పాత్ర పోషించారు. 'వైదిక ధర్మ' పత్రికను నడిపారు. సుల్తాన్‌బజార్ ఆర్యసమాజ్ శాఖా మంత్రిగా ఎన్నికయ్యారు. 1940లో మధ్య దక్షిణ ఆర్య ప్రతినిధి సభామంత్రిగా, 1944లో అంతర్జాతీయ ఆర్యన్ లీగ్ ఉపాధ్యక్షునిగా, 1949లో ఆంధ్ర కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. 1952లో శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు. 1967లో ఆంధ్రప్రదేశ్ హిందీ సమ్మేళన ఆహ్వాన సంఘం అధ్యక్షులు గానూ ఎంపికయ్యారు.. ఇంకా ఎన్నో బాధ్యతలు నిర్వహించారు.

నరేంద్ర హిందీలో గొప్పవక్త. ఆయన ఉపన్యాసాలు ఎంతో ఉద్వేగభరితంగా ఉండేవి. 'మనం పాపానికి భయపడాలి కానీ పాపాత్ములకు కాదు' అంటూ హాలీబీడ్‌లో ఆయన ప్రసంగిస్తోంటే ప్రజలు దిక్కులు పిక్కటిల్లేలా హర్షధ్వానాలు చేశారు. తిరుగుబాటును ప్రేరేపిస్తున్నాడని ఆయన ఉపన్యాసాలు, రచనలు ఏడాది పాటు నిషేధిస్తూ నిజాం ఉత్తర్వులు జారీ చేయాల్సి వచ్చింది.

నిజాం హత్యకు యత్నించిన నారాయణరావు పవార్, గంగారాం జైల్లో ఉన్నప్పుడు నరేంద్ర వారికి రహస్యంగా ఓ లేఖను పంపారు. దాని సారాంశం ఏమిటంటే 'కారాగారవాసం ఆత్మచింతనకు, స్వాధ్యాయాలకు ఉపయుక్తమైన స్థలం. మీరు చేసిన ఈ సాహసోపేతమైన త్యాగం హైదరాబాద్ సంస్థానంలో ఒక నూతన అధ్యాయాన్ని సృష్టిస్తుంది. మీరు బంధ విముక్తులయ్యే రోజు త్వరలోనే వస్తుంది. నియంత నిజాం పాలన నుండి హైదరాబాద్ సంస్థానానికి విముక్తి లభిస్తుంది. మీ ఇద్దరూ పర్వత సమానంగా నిశ్చలమైన, సుదృఢమైన మనస్తత్వంతో ఉండండి' అని చెప్పారు. ఆయన మాటలు అక్షరాలా నిజమయ్యాయి కూడా.

హైదరాబాద్ సంస్థానం విముక్తి తర్వాత శాసన సభ్యునిగా ఎన్నికైన నరేంద్రను ఒకసారి వరంగల్‌కు ఆర్యసమాజ్ వారు ఆహ్వానించారు. అప్పుడు ఆయన మాట్లాడుతూ 'రాజకీయ పదవులు నా స్వభావానికి సరిపడవు. ఇక ముందెన్నడూ ఇలాంటి పని చేయను' అన్నారు. అన్నట్లే తిరిగి ఎన్నికల్లో ఎప్పుడూ పాల్గొనలేదు. 24 సెప్టెంబర్, 1976న ఆయన తుదిశ్వాస విడిచారు. ★

ఇటీవల పయనీర్ పత్రిక 'సాంస్కృతిక యుద్ధాలు' అనే పేరుతో సంపాదకీయాన్ని వెలువరించింది. ఆ సాంస్కృతిక యుద్ధాలలో భాగంగానే 'కశ్మీర్ ఫైల్స్' చలనచిత్రాన్ని నిర్మించారని, ఆ చిత్రపు అసలు లక్ష్యం భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఎజెండాను ముందుకు తీసుకొని వెళ్లటం తప్ప మరేది కాదని, హిందూ రాష్ట్ర స్థాపన బీజేపీ ఎజెండా అని విమర్శించింది.

'పయనీర్' మనదేశపు పత్రిక. కానీ, విదేశాలకు చెందిన పత్రికలు సైతం అవే విమర్శలు చేస్తున్నాయి. ఉదాహరణకు 'టైమ్ మాగజైన్' ఆ చిత్రాన్ని విమర్శిస్తూ, ఆ చిత్రం భారతదేశాన్ని ఏ విధంగా మరింత మత విద్వేషంలోకి దిగజార్చుతున్నదో రాసింది (టైమ్ మాగజైన్ అమెరికా నుండి వెలువడుతుంది. దాని ప్రస్తుత యజమాని మార్క్‌బెనిఫ్ 'సేల్సు ఫోర్సు' అనే టెక్ దిగ్గజ కంపెనీ యజమాని కూడా. ప్రపంచ కుబేరులలో ఆయన ఒకరు. తన సామాజిక ఎజెండాను ప్రపంచంమీద రుద్దుతున్న దావోస్ కుబేరులలో ప్రముఖుడు).




# హిందువులపై దాడులు 'సాంస్కృతిక యుద్ధం'లో

వారు చెబుతున్న 'సాంస్కృతిక యుద్ధాలను ప్రారంభించింది' ఎవరు? అందులో పాల్గొంటున్నది ఎవరు? అని నేను ఆశ్చర్యపోతుంటాను. 'లిబరల్ మీడియా'గా పిలుస్తున్న కొన్ని పాత్రికేయ సంస్థలు హిందూ సంస్కృతిని అధ్వాన్నంగా చిత్రీకరిస్తున్నాయి. అవే మీడియా సంస్థలు పాశ్చాత్య, క్రైస్తవ సంస్కృతులను ఎందుకు ఒక్కమాట కూడా అనటం లేదు? పైపెచ్చు వాటిని ఆమోదిస్తూ వ్యాసాలు ప్రకటిస్తున్నాయి. 'లిబరల్' మీడియా సంస్థలు ఇస్లాం పట్ల, ఇస్లామిక్ దేశాల పట్ల సానుకూలంగా వ్యవహరిస్తున్నాయి. ఇస్లామిక్ దేశాలతో ఆ సంస్థలు స్నేహ సంబంధాలు నెరపుతున్నాయి. అలాంటి కొన్ని దేశాలలో క్రూరమైన దైవద్రోహ చట్టాల కింద కిరాతకంగా, బహిరంగ ఉరి తీతలు అమలు చేస్తున్నారు. అయినప్పటికి ఆ సంస్థలు వాటిని పట్టించుకోవటం లేదు. ఇక కమ్యూనిష్టు చైనాతో అవి అంటకాగుతున్నాయి. పత్రికా, వాక్ స్వాతంత్ర్యాలు లేని చైనాలో ఏకపక్ష, ఏకవ్యక్తి నియంతృత్వ పాలన కొనసాగుతున్న విషయం అందరికీ తెలిసిందే. అయినప్పటికి వామపక్షాలు, లిబరల్ మీడియా ఆదేశాలను విమర్శించటం లేదు. హిందూ సంస్కృతిపై మాత్రమే విరుచుకుపడుతున్నారు. కువిమర్శలు చేస్తున్నారు. అవి హిందూ సంస్కృతిని ఎందుకు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి? హిందూ రాష్ట్రం ఏర్పడితే, అల్పసంఖ్యాక వర్గాలు (ముస్లింలు, క్రైస్తవులు) వేధింపులకు గురవుతారని వారు అంటారు.

భారతదేశంలో అల్పసంఖ్యాకవర్గాలకు భద్రత లేదని ఆరోపిస్తూ, హిందూ రాష్ట్రం ఏర్పడితే వారి మనుగడ మరింత కష్టతరం అవుతుందని అనవసర భయాలు వ్యక్తం చేస్తున్నారు. ఇది ఒక పసలేని, వాస్తవాలకు విరుద్ధమైన వాదన. అల్పసంఖ్యాక వర్గాలకు భారతదేశంలో హక్కులు ఉన్నాయి. ఇతర ఇస్లామిక్, క్రైస్తవ దేశాలతో పోల్చితే, అల్పసంఖ్యాక వర్గాలను మన దేశంలో చూసినట్లుగా, ఆ దేశాల అల్పసంఖ్యాక వర్గాలను అవి చూడటం లేదు. అల్పసంఖ్యాక వర్గాల విషయంలో భారతదేశానిది అద్భుతమైన చరిత్ర. అనేక క్రైస్తవ, ముస్లిం దేశాలది పేలవమైన చరిత్ర. ఉదాహరణకు ముస్లిం మెజారిటీ దేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలో హిందువుల పట్ల వివక్ష చూపుతున్నారు. భారతదేశంలో చట్టాలు హిందువులతో పోల్చితే, ముస్లింలకు, క్రైస్తవులకు అనుకూలంగా ఉన్నాయి.

**కశ్మీర్‌లో హిందువుల నరమేధం**

పొరుగున ఉన్న ముస్లిం దేశాలలోనే కాదు, దేశంలో భాగమైన ముస్లిం మెజారిటీ కశ్మీర్‌లో సైతం అల్పసంఖ్యాక హిందువులను వేధించారు. 1989–90లో హిందువులపై దారుణ హింసకు ఒడిగట్టారు. హిందువులు మతం మారాలని బలవంతం చేశారు. అందుకు ఇష్టపడకపోతే కశ్మీర్ వదలి వెళ్లాలన్నారు. అందుకూ ఒప్పుకోకపోతే చంపివేస్తామని బెదిరించారు. 'మతం మార్చుకోండి, లేదా కశ్మీర్ విడిచి వెళ్లండి... లేదా చావండి' అన్న నినాదాలు కశ్మీర్ లోయ అంతా మార్మోగిపోయాయి. తాము ఎంత క్రూరులో నిరూపించుకోవటానికి, హిందువులను అత్యంత దారుణంగా చంపారు. ఆ మూకుమ్మడి హత్యలకు పాల్పడినవారు నేటికీ పశ్చాత్తాపపడి ఉండరు. ఎందుకంటే తమ భూభాగంపై కఫీర్లు లేకుండా విముక్తి చేయటం వారి మతగ్రంథం వారికి యిచ్చిన దైవ విధి (ఖురాన్. 8:39).

కశ్మీర్‌లో జరిగిన ఈ హిందూ నరమేధాన్ని మీడియా ఏనాడూ పట్టించుకోలేదు. మిగిలిన భారతదేశం, ప్రపంచం ఈ దారుణ హత్యాకాండను త్వరలోనే మర్చిపోయింది. కశ్మీర్‌లో భారత సైనిక అత్యాచారాలు గురించి ప్రపంచం వింటున్నది, నమ్ముతున్నది. 1990లో కశ్మీర్‌లో ఏం జరిగిందో 'కశ్మీర్ ఫైలు' సినిమా ప్రపంచానికి మరొకసారి జ్ఞాపకం చేసింది. 4 లక్షల మంది స్వదేశంలోనే కాందిశీకులు అయ్యారు. ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని కట్టుబట్టలతో కశ్మీర్ వదలి పారిపోయారు. మార్చి 2022, 'కశ్మీర్ ఫైల్స్' ఆనాటి దారుణాలను,

1989– 90లో హిందువులపై దారుణ హింసకు ఒడిగట్టారు. హిందువులు మతం మారాలని బలవంతం చేశారు. అందుకు ఇష్టపడకపోతే కశ్మీర్ వదలి వెళ్లాలన్నారు. అందుకూ ఒప్పుకోకపోతే చంపివేస్తామని బెదిరించారు. 'మతం మార్చుకోండి, లేదా కశ్మీర్ విడిచి వెళ్లండి... లేదా చావండి' అన్న నినాదాలు కశ్మీర్ లోయ అంతా మార్మోగిపోయాయి. తాము ఎంత క్రూరులో నిరూపించు కోవటానికి, హిందువులను అత్యంత దారుణంగా చంపారు.



# భాగమేనా?

అకృత్యాలను, నరమేధాన్ని కళ్లకు కట్టినట్లు చూపించింది. ప్రతి సన్నివేశాన్ని చారిత్రక ఆధారాల మేరకే తీశారు. ఒక్క సంభాషణ, సన్నివేశం కూడా కల్పితం కాదు. అంతటి నరమేధాన్ని చూపించే క్రమంలో హింసాత్మక సన్నివేశాలు చూపించక తప్పదు. అయితే పనిగట్టుకొని, ఆనాటి రక్తపాత దారుణాలను మాత్రమే చూపలేదు. కశ్మీర్ చరిత్రను కూడా చూపించింది. 800 సంవత్సరాల క్రితం కశ్మీర్ భారతదేశ మేధో రాజధాని అన్న విషయం మిగిలిన దేశం మర్చిపోయింది. ఆ విషయాన్ని జ్ఞప్తికి తెచ్చింది. 700 సంవత్సరాల క్రితం ముస్లిం పాలన మొదలయింది. అంతవరకు కశ్మీర్ శైవం అక్కడ వర్ధిల్లిన తీరుతెన్నులను ఆ చిత్రం చూపించింది.

ఆ చిత్రం అఖండ విజయం సాధించింది. ముస్లింల చేతులలో కశ్మీర్ హిందువులకు జరిగిన దురన్యాయాల గురించి మొట్టమొదటిసారిగా, భారత దేశానికి, ప్రపంచానికి తెలియవచ్చింది. ముస్లింలు ఒడిగట్టిన హిందువుల ఊచకోత గురించి ప్రపంచానికి తెలియచెప్పటం కొందరికి నచ్చలేదు. దానితో వారు ఎప్పుడూ చెప్పే కథనాన్ని మరింత దృఢంగా చెప్పటం మొదలెట్టారు. భారత రాజ్యం కశ్మీర్ ముస్లింలను తీవ్రంగా అణచివేస్తూందని, ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకొని, వారికి మద్దతుగా నిలబడాలని అభ్యర్థనలు చేస్తూ కథనాలు రాస్తున్నారు. వ్యాపింపచేస్తున్నారు. హిందువుల ఊచకోత వెనుక పాకిస్తాన్ హస్తం ఉందన్న విషయం అందరికీ తెలిసిందే. అందుకు 'కశ్మీర్ ఫైల్స్' చిత్రం ద్వారా వెలుగులోకి వచ్చిన దారుణ వాస్తవాలు ప్రపంచం నమ్ముతుందేమోనని అది భయపడింది.

ఇలాఉండగా అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ వచ్చింది. న్యాయ నిర్ణేతల సంఘ అధ్యక్షుడు నదవ్ లపీడ్ వామపక్ష మీడియాకు సంరక్షకుడైనాడు. హేతుబద్ధం కాని వ్యాఖ్యలు చేయటానికి తనకు గల హక్కును ఉపయోగించుకున్నాడు. 'కశ్మీర్‌ఫైల్స్' చిత్రాన్ని ఒక అసభ్యకరమైన ప్రచార చిత్రంగా (Uulgar Biopa ganda) విమర్శించాడు. చిత్రాన్ని విమర్శించటం తప్పుకాదు కానీ, దానిని ఒక అసభ్యకరమైన ప్రచార చిత్రం అనడం మాత్రం ఏ విధంగా చూసినా సహేతుకం కాదు.

వాస్తవాన్ని వక్రీకరించి, అభిప్రాయాలను ప్రభావితం చేయడానికి పూనుకొంటే దానిని ప్రచారం అంటారు. ఆ చిత్రంలో వాస్తవాలను వక్రీకరించ లేదు. పైపెచ్చు వాస్తవాలనే కళ్లకు కట్టినట్లుగా చూపించారు. ఆనాడు కశ్మీర్‌లో జరిగిన యదార్థ సంఘటనలను ఏ మాత్రమూ వక్రీకరించకుండా చూపించారు. మరి జ్యూరీ అధ్యక్షుడు ఎందుకు దానిని ప్రచారంగా పేర్కొన్నారు? అప్పటికప్పుడు వ్యాఖ్యానించలేదు. తయారు చేసుకొని వచ్చిన ప్రకటనను చదివారు.

'వాస్తవ విరుద్ధమైన సన్నివేశం లేదా కల్పితమైన సన్నివేశం సినిమా మొత్తంలో ఒకదాన్ని చూపినా, సినిమా రంగం నుండి నిష్క్రమిస్తాన'ని వివేక్ అగ్నిహోత్రి సవాలు చేసినా కూడా జ్యూరీ అధ్యక్షుడు తన ప్రకటనకే కట్టుబడ్డాడు. ఆ చిత్రం ముస్లింలను రాక్షసులుగా చిత్రీకరించిందని ఆయన అనుకుని ఉండవచ్చు.

**వాస్తవాలకంటే రాజకీయాలకే పెద్దపీట**

అంటే వాస్తవాలు ఇంక ఏ మాత్రమూ చూపించ కూడదా? అయితే ఇలాంటి సౌలభ్యం హిందువులకు మాత్రం లేదు. 'నిర్భయ' సామూహిక మానభంగానికి గురి అయినప్పుడు, 'పితృస్వామ్య హిందూ సంస్కృతి కారణంగానే మానభంగాలు జరుగుతున్నాయి' అని ప్రపంచం అంతా ముక్తకంఠంతో ఖండించింది. కోల్‌కతాలో ఒక 'క్రైస్తవ సన్యాసి'ని మానభంగానికి గురి కాగా, దాని వెనుక హిందూ మత ఛాందస వాదులు ఉన్నారని చర్చి అనుమానం వ్యక్తం చేసింది. అయితే దోషులు ఎవరో తర్వాత తేలింది. కానీ చర్చి క్షమాపణ చెప్పలేదు.



నదవ్ లపీడ్

హిందువులను, హైందవేతరులను ఎందుకు సమానంగా చూడడం లేదు. హిందువులపై ఒంటి కాలితో ఎందుకు లేస్తున్నారు? బహుశా సాంస్కృతిక యుద్ధాలలో భాగంగానే ఇలా జరుగుతున్నదేమో! హిందువుల పట్ల వివక్ష అందులో భాగమేమో! కశ్మీర్ ముస్లింలు అణచివేతకు గురవుతున్నారన్న కథనం 'కశ్మీర్ ఫైల్స్' చిత్రం కారణంగా కొంచెం వెనుక బడింది. ఆ సందర్భంలోనే నదవ్‌లపీడ్ వ్యాఖ్యలు చేశాడు. ప్రతిష్ఠాకరమైన అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీయే ఆ చిత్రాన్ని ఒక చౌకబారు, అసహ్య కరమైన ప్రచార చిత్రంగా వ్యాఖ్యానం చేస్తే ఆ చిత్రం విలువ అకస్మాత్తుగా తగ్గిపోతుంది. 'ఓ! అది నిజంగా ప్రచారం కోసం, ముస్లింలను అప్రతిష్ఠపాలు చేసే దురుద్దేశ్యంతో చేసిన చిత్రమా! ఈ హిందువులు ఎంతటి దుర్మార్గులో కదా! ఎంతటి సంకుచిత మనస్కులో కదా!' అని వాస్తవాలు తెలియని వారు సహజంగానే స్పందిస్తారు. దురదృష్టవశాత్తూ అధిక సంఖ్యాకులకు ఎప్పుడూ వాస్తవాలు పూర్తిగా తెలియవు.

ఈ కారణంగానే బహుశా నదవ్‌లపీడ్ తన కువ్యాఖ్యలకు కట్టుబడ్డాడు. ఇజ్రాయిల్ రాయబారి చెప్పినా, తన ప్రకటనను ఉపసంహరించుకోలేదు. అటువంటి ప్రకటన చేసినందుకు నదవ్‌లపీడ్ సిగ్గుపడాలని కూడా ఇజ్రాయిల్ రాయబారి అన్నారు. అయినా లపీడ్ పట్టించుకోలేదు. పిడివాద మతాలకు (Dogmatic Religions), వామపక్షాలకు మద్దతుగా నిలిచాడు. సాంస్కృతిక యుద్ధాలలో హిందూ సంప్రదాయానికి వ్యతిరేకంగా ఏకమై నిలిచిన ఆ రెండు వర్గాలవారి వాదనను బలపరిచేలా మాట్లాడాడు.

**ప్రపంచంలో మిగిలిన ఏకైక పురాతన సంస్కృతి**

ప్రపంచంలోని మిగిలిన ఏకైక పురాతన సంస్కృతి ఇంకా భారతదేశంలోనే సజీవంగా ఉంది. అనేక ప్రాచీన నాగరికతలను ధ్వంసం చేశారు. ఉదాహరణకు ప్రపంచ ప్రఖ్యాత ఇంకాస్, మాయన్, అజాటెక్, గ్రీకు, ఈజిప్టు, మెసపటోమియా, చైనా సంస్కృతులు క్రైస్తవం, ఇస్లాం, లేదా కమ్యూనిజం పద ఘట్టనల కింద నామరూపాలు లేకుండా ధ్వంసమయ్యాయి. ఇంకా భారతదేశ సంస్కృతి సజీవంగా ఉంది. ఎన్నో శతాబ్దాల నుండి దానిపై దాడి జరుగుతూనే ఉన్నది. అఖండ భారతదేశంలో కొన్ని ప్రాంతాలు ఆ దాడులకు తట్టుకోలేక

కుప్పకూలాయి. ఆ ప్రాంతాలలో హిందువుల నిత్య జీవితాలు నరకప్రాయాలు అయ్యాయి.

హిందూ సంస్కృతిని ధ్వంసం చేసి తీరాలన్న గట్టి ప్రయత్నాలు ఎందుకు చేస్తున్నారు? ఎందుకంత పట్టుదలగా, ఉమ్మడిగా హిందూ వ్యతిరేక శక్తులు పని చేస్తున్నాయి? వాస్తవానికి ప్రపంచ నాగరికతకు అది ఎంతో యిచ్చింది. ప్రపంచానికి జ్ఞానభిక్ష పెట్టింది. ప్రపంచ నాగరికతకు అది చేసిన మేలు గురించి, ఎవరూ చెప్పటం లేదు. అనేక రంగాలలో అభివృద్ధికి అది పునాదులు వేసింది. ఇంత దోపిడీ, ధ్వంసం తర్వాత కూడా ఇంకా 4 కోట్ల తాళపత్ర గ్రంథాలు ఉన్నాయని బిబెక్ దేబ్రాయ్ చెప్తున్నారు. అంతేకాదు, మన పురాతన దేవాలయాలు అనేక ఆశ్చర్యకరమైన అద్భుతాల రహస్యాలకు నెలవులు.



వివేక్ అగ్నిహోత్రి

**నిజమైన స్వాతంత్ర్యం ఎలా?**

నిజమైన స్వాతంత్ర్యం ఎలా పొందాలో భారతీయ విజ్ఞానం చూపిస్తుంది. వేదాలు మానవుడి నిజతత్త్వాన్ని ఆవిష్కరించాయి. తమలోని దివ్యత్వాన్ని గురించి మానవులకు అవి తెలియచెప్తాయి. వేద ధర్మాన్ని అనుసరిస్తే, మానవుడు పరిపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పొందుతాడు. విముక్తుడు అవుతాడు. పరమ శాంతిని పొందుతాడు. తమ నిజతత్వం, తమలోని దైవత్వాన్ని గురించి ఎరుక పెరుగుతున్నకొద్దీ ధ్రువీకరణకు నిలబడని, అనుభూతి ప్రధానం కాని సిద్ధాంతాలను గుడ్డిగా అనుసరించే వారిగా మలిచే శక్తిని పిడివాదులు కోల్పోతారు. హిందూ వ్యతిరేకశక్తులందరూ పిడివాదులే. అదే వారి అసలు భయం కావచ్చు. అందుకే హిందూ ధర్మాన్ని సమూలంగా నాశనం చెయ్యాలని, వారు కలిసికట్టుగా పనిచేస్తున్నారు. కుట్రలు పన్నుతున్నారు.

మరి ఏ ఇతర సంప్రదాయంలో లేని విధంగా హిందూ సంప్రదాయం సత్యాన్వేషణను ప్రోత్స హిస్తుంది. కొన్ని సత్యాలను సూచనప్రాయంగా ప్రతి పాదిస్తుంది. వాటిని సాధకులు అనుభవంలోకి తెచ్చుకోవాలి. ఉపనిషత్ మహావాక్యాలు ప్రతిపాదించే సత్యాలను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. 'అయమ్ ఆత్మబ్రహ్మ' అనేది ఒక ఉపనిషత్తు మహావాక్యం. మనలోనూ, విశ్వాత్మలోనూ ఉన్న శుద్ధ చైతన్యం ఒకటేనని ఆ వాక్యం అర్థం. ఒక సముద్రంలోని నీరు, ఆ సముద్రపు అలలు నీరు ఒకటే. కాని అల ఎన్నటికీ సముద్రం కాబోదు. అన్ని అలలు ఉంటాయి. సముద్రం ఆవల అలలు ఉండవు. అలా తన రూపాన్ని కోల్పోయినా, అందులోని పదార్థం (నీరు) ఎక్కడికీ పోదు. సముద్రంలోనే కలుస్తుంది.

ఈ రెంటిలో ఏది హేతుబద్ధంగా ఉంది? సాధనలో అంతటా వ్యాపించి ఉన్న శుద్ధ చైతన్యంతో (బ్రహ్మన్) మమేకం చెందవచ్చు అనే భారతీయ సంప్రదాయపు ప్రతిపాదన లేక ఒకే ఒక జన్మపై ఆధారపడి, మనం శాశ్వత స్వర్గానికి లేదా శాశ్వత నరకానికి అర్హులం అవుతామా? కాదా? అనే దాన్ని నిర్ణయించే స్వర్గంలో ఉన్న దేవుడి గురించి ఒక వ్యక్తి చెప్పినదాన్ని గుడ్డిగా నమ్మటమా?

**మింగుడు పడని హిందూ ధర్మం**


18వ శతాబ్దిలో జర్మన్ తత్త్వవేత్తలు ఉపనిషత్తుల అనువాదాలు చదివి, వారి మత సంప్రదాయాలతో, తాత్త్వికతతో పోల్చిచూసి, వేద విజ్ఞానాన్ని ఆకాశానికి ఎత్తి ప్రశంసించారు. అప్పటి నుండి చర్చి అధికారానికి, ప్రాబల్యానికి గండి పడటం మొదలయింది. అది హిందూయిజంపై కువిమర్శలకు పాల్పడుతున్నప్పటికి తన అధికారాన్ని క్రమేపి పోగొట్టుకున్నది. నేను ప్రాథమిక పాఠశాలలో చదివే రోజులలోనే హిందూయిజంలోని 'అంటరానితనం' గురించి విన్నాను. కాగా మా జర్మనీ ప్రజలు యూదులపై చేసిన మూకుమ్మడి నరమేధం గురించి యుక్త వయస్సు వచ్చేవరకు నాకు తెలియనే తెలియదు.

హిందువుల పట్ల తీవ్ర వ్యతిరేకత నెలకొంది. హిందూ ధర్మం గురించి అవగాహన లేనివారు హిందువులను 'తీవ్రవాదులు(టెర్రరిస్టులు), ఫాసిస్టులు, రేపిస్టులు, గోమూత్ర సేవకులు' రకరకాల పేర్లతో వ్యవహరిస్తూ కించపరుస్తున్నారు. అబ్రహమిక్ మతాలకంటే హీనంగా చిత్రీకరిస్తున్న ప్పటికీ, తమ ధర్మం మానవాళికి, ప్రపంచానికి దారి చూపగలిగే వెలుగు అన్న విషయం హిందువులు తెలుసుకొని, జాగృతం అవుతున్నారు. హిందువుల ఈ మేలుకొలుపు హిందూ వ్యతిరేక శక్తులకు యిష్టం లేదు. హిందువులు తమ వారసత్వాన్ని అస్తిత్వాన్ని నిలబెట్టుకొనే ప్రయత్నాలు చేయటం వారికి యిష్టం లేదు. అనేకమంది హిందువులు తమ ధర్మం విశిష్ట తకు గర్వపడుతున్నారు. దానిని కాపాడుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ప్రపంచంలో మిగిలిన చిట్టచివరి ప్రాచీన నాగరికతను సైతం ధ్వంసం చేద్దామనుకొంటున్న దుష్టశక్తులకు ఇది మింగుడు పడటంలేదు.

అనేక పురాతన సంస్కృతులను ధ్వంసంచేసే ప్రక్రియలోనూ, ఒకరినొకరు మట్టుపెట్టుకొనే ప్రక్రియలోనూ గడచిన కొన్ని శతాబ్దాలలో ఆ పిడివాదులు కోట్లాదిమందిని నిర్దాక్షిణ్యంగా బలి తీసుకున్నారు. మానవాళిని తమ గుప్పెట్లో పెట్టుకోవటానికి జరుగుతున్న ఈ పెద్ద క్రీడలో తమను పావులుగా వాడుకొంటున్నారని, ఆ పిడివాదాలను మోస్తున్న సిపాయిలకు తెలియదు. హిందూ ధర్మం మనగలగడం మాత్రమే కాదు, వర్ధిల్లగలిగితే దాని వలన వారికి కూడా ఎంతో ప్రయోజనకరమన్న వాస్తవం ఆ సిపాయిలు గ్రహించలేకపోతున్నారు. హిందూ ధర్మం సమ్మిళితమైంది. ప్రపంచమంతా ఒకటే కుటుంబం అని అది భావిస్తుంది. ఎందుకంటే మనందరం ఒకే ఒక దివ్య చైతన్య వారసులం కనుక. "వసుధైవ కుటుంబకమ్"


(Maria Wirth జర్మన్ దేశస్థురాలు. భారత దేశంలో స్థిరపడిన సాధకురాలు, రచయిత. 19.1.2023న తన బ్లాగ్‌లో ఈ వ్యాసం వ్రాశారు. దాని భావానువాదం ఆర్గనైజర్ వారపత్రికలో ప్రచురించారు.)

**అను: డాక్టర్ బి.సారంగపాణి**




# ఎటూ తేలదు, ఏమీ మిగల్చదు

## రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి ఏడాది



**అసలు యుద్ధాన్ని ఎందుకు సమర్థించాలి? అన్న ప్రశ్న నేడు బలంగానే ఉంది. ఏదో ఒకరోజున యుద్ధం ముగిసిపోక తప్పదు. కాబట్టి మనమే వీలైనంత తొందరగా యుద్ధాన్ని ఎందుకు ముగించకూడదు అని కూడా కొందరు విశ్లేషకులు ప్రశ్నించడం ఇందుకే. రష్యా మీద దాడి చేయవద్దు. అలాగే రష్యా దాడి చేస్తోందని దిగులు పడవద్దు అన్నాడొక హక్కుల ఉద్యమకారుడు. వ్యక్తీకరణ, మాటలు కొంచెం భిన్నంగా ఉండవచ్చు. ఇప్పుడు ప్రపంచమంతా ఇలాంటి అభిప్రాయాలే ఉన్నాయి. అయినా రష్యా–ఉక్రెయిన్ యుద్ధం మొదలై ఏడాది గడచిపోయింది. ప్రపంచం ఒక మహమ్మారి ప్రభావంతో కుదేలైన నేపథ్యంలో ప్రారంభమైన ఈ యుద్ధం ఇప్పటికీ ప్రపంచాన్ని భయపెడుతోంది. ఈ యుద్ధం విస్తరించకూడదన్నదే ఎక్కువ దేశాల అభిమతం కూడా. ఏడాదిగా సాగుతున్న ఈ యుద్ధంలో ఇటీవలి వరకు 8,006 మంది ప్రాణాలు కోల్పోయారని ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. 13,287 మంది క్షతగాత్రులయ్యారు.**

ఎంతో విశాలమైన రష్యా దేశ జనాభా 14.6 కోట్లు. చమురు, గ్యాస్, ఫెర్టిలైజర్స్, ముడిసరుకుల ఎగుమతులకు ప్రధానకేంద్రం. ప్రస్తుతం ప్రపంచాన్ని కుదిపేస్తున్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి మూలాలు 2014లో ఉన్నాయి. నాటి రష్యా అనుకూల ఉక్రెయిన్ అధ్యక్షుడు విక్టర్ యనుకోవిచ్ 'యూరోపియన్ యూనియన్–ఉక్రెయిన్ అసోసియేషన్ అగ్రిమెంట్' పై సంతకం చేయడానికి తిరస్కరించారు. ఇదే నాటోలో చేరాలని 2008 నుంచి ఉక్రెయిన్ చేస్తున్న ప్రయత్నాలను దెబ్బతీసి దేశంలో "రివల్యూషన్ ఆఫ్ డిగ్నిటీ" పేరుతో విప్లవానికి తెర తీసింది. ఈ పరిణామాల నేపథ్యంలో అధ్యక్షుడు పదవి నుంచి తప్పుకోవడం, రష్యా రంగంలోకి దిగి క్రిమియాను ఆక్రమించుకోవడం వంటి పరిణామాలు చకచకా జరిగిపోయాయి. ఉక్రెయిన్ నాటోలో చేరడం రష్యాకు సుతరామూ ఇష్టం లేదు. తర్వాతికాలంలో తూర్పు ప్రాంతంలోని అత్యధిక ప్రాంతాల్లో పోరాడుతున్న వేర్పాటువాదులకు రష్యా మద్దతు ఇస్తూ వచ్చింది. అంతేకాదు. పశ్చిమ దేశాలు తన డిమాండ్లను అంగీకరించకపోతే సైనిక చర్య తప్పదని హెచ్చరిస్తూ వచ్చింది. నాటో ఇక తూర్పువైపునకు ఎట్టి పరిస్థితుల్లో విస్తరించరాదు. తూర్పు యూరప్ దేశాల్లో నాటో సైనిక కార్యకలాపాలు జరగడానికి వీల్లేదు. పోలండ్, బాల్టిక్ రిపబ్లిక్‌లైన ఇస్తోనియా, లాట్వియా, లిథుయేనియాల నుంచి నాటో తన పోరాట దళాలను ఉపసంహరించాలి. పోలెండ్, రొమేనియాల్లో క్షిపణులను మోహరించరాదు. ఒక్కమాటలో చెప్పాలంటే 1997కు ముందు నాటి సరిహద్దు ప్రాంతాలకు నాటో దేశాలు తమ సైనిక దళాలను ఉపసంహరించుకోవాలి. రష్యా చేస్తున్న ఈ డిమాండ్లను పశ్చిమ దేశాలు బేఖాతరు చేయడం ప్రస్తుత సైనిక చర్యకు ప్రధాన కారణం.



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

యుద్ధం మొదలు పెట్టడం సులభమే. ముగించడం పెద్ద సమస్య. ఇప్పుడు అదే జరుగుతోంది. ఈ యుద్ధం ఎందుకు మొదలయింది? కరోనా దెబ్బతో కకావికలైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మీద ఏడాదిగా సాగుతున్న ఈ యుద్ధం ఎలాంటి ముద్రను మిగిల్చింది? వీటి గురించి ఇప్పుడు చర్చ అనివార్యమైంది.

### నాటో అలయెన్స్‌కు రష్యా ఎందుకు వ్యతిరేకం?

యు.కె. యుఎస్‌లు సహా 30 దేశాలు నాటోలో సభ్యత్వం కలిగివున్నా యి. గతంలో యు.ఎస్.ఎస్.ఆర్.లో భాగస్వాములుగా ఉన్న లాత్వియా, ఎస్తోనియా, లిథుయేనియాలు నాటోలో చేరిపోయాయి. దీంతో ఐదు నాటో దేశాల సరిహద్దులు రష్యాతో పంచుకున్నాయి. ఈ విధంగా నాటో విస్తరణ తన భద్రతకు ప్రమాదమని రష్యా భావిస్తోంది. ఉక్రెయిన్ రష్యాకు దక్షిణ భాగంలో ఉండటమే కాదు, రష్యాకు సముద్రమార్గం ఉక్రెయిన్ నుంచి ప్రారంభమవుతోంది. మరి ఉక్రెయిన్ కూడా యు.ఎన్.తో చేతులు కలిపితే అది రష్యాకు సహజంగానే భద్రతాపరమైన సమస్య తెచ్చి పెడుతుంది. అందువల్లనే ఉక్రెయిన్ నాటో సభ్యురాలిగా చేరడం రష్యాకు ఇష్టంలేదు. నిజానికి యు.ఎస్.ఎస్.ఆర్.

విచ్ఛిన్నం కావడం రష్యాకు సరికొత్త భద్రతా సమస్యలను తెచ్చిపెట్టింది. ప్రముఖ చరిత్రకారుడు స్టీఫెన్ కోట్కిన్ మాటల్లో చెప్పాలంటే పుతిన్ ఇప్పుడు అనుసరిస్తున్నది 'రక్షణాత్మక దూకుడు' వైఖరి. ఇదే సమయంలో తూర్పు ఉక్రెయిన్ విషయంలో 2015లో కుదిరిన మిన్స్క్ ఒప్పందం ఇప్పటి వరకు అమలుకాక పోవడం కూడా రష్యా అసహనానికి మరో కారణం. నాటో దేశాలు ఉక్రెయిన్‌కు ఆయుధాలను అందిస్తున్న కారణం గానే, ఈ యుద్ధం ఇప్పటివరకు కొనసాగడానికి ప్రధాన కారణమని రష్యా భావిస్తోంది. ఇక ఉక్రెయిన్ నాటో కూటమిలో చేరాలన్న దృఢనిశ్చయంతో ఉంది. తాను ఒకప్పుడు యు.ఎస్.ఎస్.ఆర్.లో అంతర్భాగమన్న విషయం మరచిపోయి, ఇప్పుడు రష్యాకున్న భద్రతా పరమైన సంశయాలను ఖాతరు చేయడం లేదు.

ఇప్పుడు రష్యా ఆక్రమించుకున్న డోనెస్క్, లూహాన్స్ ప్రాంతంలో పెట్టుబడులను అమెరికా నిషేధించింది. దీంతో పాటు పశ్చిమ దేశాలు కూడా ఆంక్షలు విధించాయి. రష్యాపై విధించిన ఆంక్షలు తిరిగి తమకే ఇబ్బందిగా మారడంతో యూరప్ దేశాల్లో పరిస్థితులు దారుణ స్థితికి చేరుకున్నాయి. రష్యా నుంచి చమురు, ఆహార పదార్థాల దిగుమతులు ఆగిపోవడం, యూరప్ ప్రజల్లో తీవ్ర ఆందోళనకు కారణమైంది. యూరప్ ఆర్థిక వ్యవస్థలు బలీయమైనవి కావడం వల్ల తమ దేశాల ప్రజలను ఆదుకోవడానికి తగిన చర్యలు తీసుకోగలవు.

కానీ దీనికీ ఒక పరిమితి ఉంటుంది కదా! మరి ఈ యుద్ధం ఇట్లాగే కొనసాగితే యూరప్ దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలడం ఖాయం. ఈ విధంగా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలు రష్యా–ఉక్రెయిన్ యుద్ధ మేఘాల్లో చిక్కుకొని కారుచీకట్లలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఇది ఇట్లాగే కొనసాగితే ప్రపంచం మరో తీవ్ర ఆర్థికమాంద్యంలో కూరుకు పోక తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. క్రూడాయిల్ ధరలు పెరగడంతో, ప్రపంచ దేశాల్లో ద్రవ్యోల్బణం ఆకాశాన్నంటుతోంది. కొన్ని దేశాలకు ధాన్యం సరఫరా నిలిచిపోయి ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. రష్యా సరఫరాలు నిలిచి పోవడం వల్ల ఏర్పడిన శూన్యతను పూడ్చడం దాదాపు దుస్సాధ్యమవుతోంది. రష్యా నుంచి సహజ వాయువు సరఫరాలు నిలిచిపోవడంతో, యూరప్ దేశాలకు ఈసారి శీతాకాలం నరకాన్ని తలపించేవిధంగా మారింది. ఈ ఆంక్షలన్నీ రష్యాను, ఆసియన్ ఆర్థిక దిగ్గజం చైనాకు మరింత దగ్గర చేసింది. ఇప్పటికే ఈరెండు దేశాలు 30 సంవత్సరాల గ్యాస్ సరఫరా ఒప్పందాన్ని కుదుర్చుకోవడం ఆంక్షలను నిర్వీర్యం చేసే ప్రక్రియలో భాగమే. ఈ విధంగా ప్రస్తుత పశ్చిమ దేశాల వైఖరి రష్యా–చైనాల బంధాన్ని మరింత పటిష్టం చేస్తున్నది.



మోదీతో పుతిన్

## యూరప్ దేశాల్లో గందరగోళం

రష్యాపై ఏవిధంగా వ్యవహరించాలన్న విషయంలో పశ్చిమ దేశాల్లో కూడా ఏకాభిప్రాయం లేదు. వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకొని, తగిన రాజనీతి జ్ఞతతో వ్యవహరించే నాయకత్వం నాటో దేశాల్లో కొరవడటం ప్రస్తుతం ఆ దేశాలను మరింత ఇబ్బందుల్లోకి నెడుతోంది. ఎందుకంటే నాటో దేశాల ఇంధన అవసరాలు తీర్చేది రష్యా మాత్రమే. ఇప్పుడు అవి విధించిన ఆంక్షలతో తాము కూర్చున్న కొమ్మను తామే నరుక్కున్న చందంగా తయారైంది. ప్రస్తుత సందిగ్ధ పరిస్థితిని తనకు అనుకూలంగా మలచుకొని, తానే నాయకుడిగా ఎదగాలన్న కాంక్ష ఫ్రాన్స్‌లో కనిపిస్తోంది. యూరోపియన్ యూనియన్ దేశాలు 39% సహజ వాయువును, 30% చమురును రష్యా నుంచే దిగుమతి చేసుకుంటున్నాయి. మధ్య, తూర్పు యూరప్ దేశాలు తమ ఇంధన అవసరాల కోసం నూటికి నూరుశాతం రష్యాపై ఆధార పడుతున్నాయి. రష్యా విషయంలో ఈయూ దేశాల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడానికి ఇదే ప్రధాన కారణం.

## పెరిగిన ఆహారకొరత

ఈజిప్ట్, టర్కీ, ఆఫ్రికా దేశాల 70% ధాన్యం అవసరాలను రష్యా తీరు స్తున్నది. ప్రస్తుతం వీటికి సరఫరాలు నిలిచిపోవడంతో అవి అల్లాడుతున్నాయి. రష్యా ఉక్రెయిన్‌లు ప్రపంచంలోనే అత్యధిక గోధుమ ఉత్పత్తిదార్లు. ప్రపంచం లో 1/4 వంతు గోధుమ అవసరాలు తీర్చేది ఈ దేశాలు మాత్రమే. అసలే ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న టర్కీ ప్రస్తుతం గోధుమ సరఫరాలు నిలిచి పోవడంతో తీవ్ర వత్తిడిని ఎదుర్కొంటున్నది. యుద్ధం, ఆంక్షల పుణ్యమాని చమురు, బంగారం ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నం టాయి. ఆటోమోటివ్‌లు, సెల్‌ఫోన్లలో ఉపయోగించే పల్లాడియం కూడా రష్యా నుంచే ఎగుమతి అవుతుంది. ఫలితంగా ఈ వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

## డాలర్‌పై ప్రభావం

రష్యా–ఉక్రెయిన్ యుద్ధం డీడాలరైజేషన్‌కు (డాలర్ పతనం) దారితీసింది. నిజంగా ఇదొక విచిత్రమైన అనివార్య పరిణామం. ప్రపంచంలో అత్యధికంగా చెలామణీ అయ్యేది డాలర్. ఒకదశలో 95% ప్రపంచ వాణిజ్య కేవలం డాలర్ మారకం ద్వారానే జరిగిందంటే ఆశ్చర్యపోవాల్సిందేమీలేదు. ఈ పరిస్థితిని అర్థం చేసుకున్న యు.ఎస్. ప్రపంచ మార్కెట్‌లో మూడు ట్రిలియన్ల డాలర్లను చెలామణి లోకి తెచ్చింది. ఇదే సమయంలో 38 ట్రిలియన్ డాలర్ల విలువైన ట్రెజరీ బాండ్లను విడుదల చేసింది. ఒక విధంగా చెప్పాలంటే ప్రపంచంలో బంగారంతో ఏ విధమైన సంబంధంలేని కరెన్సీ బహుశా ఇదేనేమో! యు.ఎస్.లో ప్రస్తుతం దాదాపు 500 బిలియన్ డాలర్ల విలువైన బంగారం నిల్వలున్నాయి. డాలర్ విలువ ప్రపంచంలో దాని చెలామణీపై ఆధారపడి ఉంటుంది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ప్రపంచ మార్కెట్‌లో డాలర్ చెలామణి తగ్గిపోవడానికి దారితీసింది. గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితి ఏర్పడకపోవడం గమనార్హం. ఇప్పటి వరకు రష్యాతో డాలర్‌తో లావాదేవీలు కొనసాగించిన దాదాపు 60 దేశాలు ఇప్పుడు రూబుల్స్‌తో జరుపుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 50 దేశాలు ప్రస్తుతం చైనా యువాన్ కరెన్సీతో, 28 దేశాలు భారత రూపాయితో తమ లావాదేవీలు జరుపుతున్నాయి. ఈవిధంగా ఇతర కరెన్సీలను ఆమోదించడం మొదలు కావడంతో ప్రపంచ మార్కెట్‌లో 20% వరకు డాలర్ల చెలామణి తగ్గిపోయింది. రానున్న కొద్ది సంవత్సరాల్లో ఈ పరిణామం అమెరికా ఆర్థిక వ్యవస్థపై తప్పక పడుతుంది. ఇది జరగడం అమెరికాకు ఎంతమాత్రం ఇష్టంకాదు. అందుకనే యుద్ధం కొనసాగితే ప్రపంచాన్ని తన మార్గంలో నడిచేలా చేయవచ్చు నన్నది అమెరికా వ్యూహం. ఈ యుద్ధ పరిణామంతో చలి కాచుకోవడానికి యత్నిస్తోంది. అమెరికా

అధ్యక్షుడు జోబైడెన్ ఇటీవల ఉక్రెయిన్‌లో పర్యటించడానికి ప్రధాన లక్ష్యం రెచ్చగొట్టడమే. యుద్ధం కొనసాగడం అమెరికా ఆర్థిక వ్యవస్థ మనుగడకు అత్యవసరం. ఇక యుద్ధంవల్ల దెబ్బతిన్న ఆర్థికవ్యవస్థలు తమ మనుగడ కోసం చేసే ప్రయత్నంలో భాగమే ఈ డీడాలరైజేషన్!.

**తప్పిన అమెరికా అంచనాలు**

ఈ యుద్ధం నేపథ్యంలో రష్యాను తన కాళ్ల బేరానికి తెచ్చుకోవచ్చునన్న అమెరికా అంచనాలు తల్లక్రిందులయ్యాయి. ఎప్పటికప్పుడు మారుతున్న పరిణామాల నేపథ్యంలో రష్యా, చైనా, ఇరాన్, టర్కీలు సరికొత్త కూటమిగా ఏర్పడుతున్నాయి. చైనా, ఇరాన్‌లు సైనికపరంగా రష్యాకు సహాయం చేస్తుండగా, టర్కీ మాత్రం కాస్పియన్, ఇరాన్, అరేబియన్ సముద్రాల గుండా చక్కటి సరఫరా గొలుసుకట్టు వ్యవస్థను ఏర్పరుస్తోంది. దీన్నే నార్త్-సౌత్ ట్రాన్స్ పోర్ట్ కారిడార్ (ఐఎన్ఎస్‌టీసీ) అని పిలుస్తున్నారు. ఆసియన్ మార్కెట్లు లక్ష్యంగా ఈ ఐఎన్ఎస్‌టీసీ ఏర్పాటవుతోంది. నిజానికి టర్కీ మనుగడకు ఇది చాలా అవసరం కూడా! ఈ కారిడార్ పశ్చిమ దేశాల ఆధిపత్యానికి ఒక సవాలే. ఎందుకంటే అమెరికా, యూరప్‌దేశాలు రష్యాపై విధించిన ఆంక్షలు ఈ సరికొత్త కారిడార్‌కు వర్తించవు! ప్రస్తుతం చైనా-అమెరికాల మధ్య ఉద్రిక్తతలు మనకు తెలిసినవే. ఈ నేపథ్యంలో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తూర్పు-పశ్చిమ ఆర్థిక ఫ్రంట్‌ల ఏర్పాటుకు దోహదం చేస్తున్నది.

**పనిచేయని ఆంక్షలు**

2014లో రష్యా క్రిమియాను ఆక్రమించినప్పుడు రష్యాపై పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించాయి. ఈ అనుభవం నేర్పిన పాఠంతో ఈసారి ఉక్రెయిన్‌పై దాడికి దిగడానికి ముందే ఆంక్షల ప్రభావం తక్కువ ఉండేలా రష్యా జాగ్రత్తపడింది. అయినప్పటికీ రష్యాపై ఇప్పటి వరకు 2700 ఆంక్షలు కొనసాగు తుండగా, ఆ దేశానికి చెందిన 300 బిలియన్ డాలర్ల విలువైన బంగారం నిల్వలను పశ్చిమ దేశాలు స్తంభింపజేశాయి. రష్యాపై విధించిన ఆంక్షల్లో ప్రధానమైంది దాని స్విఫ్ట్ చెల్లింపుల వ్యవస్థను బ్లాక్ చేయడం. సొసైటీ ఫర్ వరల్డ్ వైడ్ ఇంటర్ బ్యాంక్ టెలికమ్యూనికేషన్ సిస్టమ్స్ (స్విఫ్ట్) అనేది బెల్జియం ఫైనాన్షియల్ సర్వీసు. ప్రపంచ వ్యాప్తంగా 11వేల ఆర్థికసంస్థలను ఇది అనుసంధానించడమే కాకుండా, లావాదేవీల విషయంలో బ్యాంకులు పరస్పరం జాగ్రత్తలు తీసుకోవడానికి ఇది వీలు కల్పిస్తుంది. కానీ ఇప్పుడు రష్యా సహా పలుదేశాలు సొంత చెల్లింపుల వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవడంతో ఈ నిషేధం పెద్దగా పనిచేయడం లేదు. రష్యా ఎగుమతులు తిరిగి ప్రారంభమయ్యాయి. రష్యా నుంచి చౌక ధరలో చమురు ప్రపంచవ్యాప్తంగా రవాణా అవుతోంది. అధిక సంఖ్యలో దేశాల రూబుల్ మారకం ద్వారా ఈ చౌకధరలో చమురును కొనుగోలు చేస్తున్నాయి. వీటిల్లో ప్రధాన దేశం భారత్. ఇక దిగుమతుల విషయానికి వస్తే ఆసియన్ దిగ్గజం చైనా ఆ కొరతను తీరుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో అంతర్జాతీయ యవనికపై పుతిన్ బలహీనపడటం మాట ఎలా ఉన్నా, మరింతగా బలపడ్డాడన్నది సుస్పష్టమవుతోంది.

**బలిపశువులైన ఉక్రెయిన్ ప్రజలు**

తమ దేశ రాజకీయ నాయకుల తెలివితక్కువ పనులు, పశ్చిమ దేశాల దురహంకారం వెరసి ఉక్రెయిన్ ప్రజలను తీవ్ర సంక్షోభంలోకి నెట్టేసింది. యుద్ధం జరిగేది ఉక్రెయిన్ భూభాగంలో. ఆయుధాలు కుప్పలుతెప్పలుగా సరఫరా చేసేది పశ్చిమ దేశాలు. ఈ ఆధిపత్యపోరులో ఉక్రెయిన్ ప్రజల కడగండ్లు పట్టించుకునే నాథుడే లేడు. ఆహారం, మందులు, నిత్యావసరాలు, నీరు, పునర్నిర్మాణం, ఆశ్రయ కల్పన వంటివి లేకపోవడంతో ఉక్రెయిన్ ప్రజలు అల్లాడుతున్నారు. ఇంత జరుగుతున్నా దేశాధినేతల్లోని అహంకారం కాల్పుల విరమణ దిశగా ముందుకెళ్ల నీయడం లేదు.

**భారత్‌పై ప్రభావం**

రష్యా-ఉక్రెయిన్ యుద్ధ ప్రభావం ప్రపంచదేశాలతో పాటు భారత్‌పై కూడా పడింది. ఆశ్చర్యకరంగా ఈ ప్రభావం మిగిలిన దేశాలంతగా లేదు. భారత్ వృద్ధిరేటు అనుకున్నదానికంటే వేగం మందగించినప్పటికీ, ప్రపంచంలో వేగంగా పురోగమిస్తున్న ఆర్థికవ్యవస్థల్లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. అమెరికా నేతృత్వంలోని పశ్చిమ దేశాలు రష్యాపై విధించిన ఆంక్షలు భారత్‌కు ఒక రకంగా వరంగా మారాయనే చెప్పాలి. రష్యా మన దేశానికి తక్కువ ధరలో క్రూడాయిల్ సరఫరాకు అంగీకరించడంతో 2022 ఏప్రిల్-డిసెంబర్ మధ్యకాలంలో ఒక్కసారిగా రష్యానుంచి క్రూడాయిల్ దిగుమతులు ఐదురెట్లు పెరిగాయి. 2021-22లో మనదేశం చమురు దిగుమతుల విషయంలో రష్యాది 18 స్థానం. కేవలం పదినెలల కాలంలో రష్యా నాల్గవ స్థానానికి ఎగబాకింది. జి-7, యూరోపియన్ యూనియన్ దేశాలు రష్యా చమురుపై బ్యారల్‌కు 60 డాలర్ల పరిమితి విధించడంతో, రష్యా అంతకంటే తక్కువ ధరకే మన దేశానికి చమురు సరఫరా చేస్తోంది. దీంతో 2022 డిసెంబర్‌లో మన చమురు దిగుమతులు రోజుకు 1.2 మిలియన్ బ్యారల్స్‌కు చేరుకున్నాయి. ఇదే సమయంలో ఇరాక్‌నుంచి 7% దిగుమతులు పెరిగి రోజుకు 886,000కు చేరుకోగా, సౌదీ అరేబియా నుంచి 12% పెరిగి రోజుకు 748,000 బ్యారల్స్ కొనుగోలు చేస్తున్నాం. ఇప్పుడు మన దేశానికి రష్యా, చైనాలు అతిపెద్ద వాణిజ్య భాగస్వాములుగా ఉన్నాయి. ఇదే సమయంలో మొత్తంమీద మన ఎగుమతులు 17% పెరగడం గమనార్హం. నిజం చెప్పాలంటే రష్యా క్రూడాయిల్ మనదేశంలో ద్రవ్యోల్బణం పెరగకుండా అడ్డుకున్నదనే చెప్పాలి.




జెలన్‌స్కీ

**తటస్థవైఖరే మనబలం**

భారత్‌లకు రష్యా-ఉక్రెయిన్‌లతో ద్వైపాక్షిక సంబంధాలున్నాయి. ఈ నేపథ్యంలో సంఘర్షణ ప్రారంభమైన తొలినాటినుంచి 'చర్చల ద్వారా మాత్రమే శాంతియుత పరిష్కారం సాధ్యం' అని నొక్కి చెబుతూ రావడమే కాదు... తటస్థవైఖరిని కొనసాగించింది. ఇదే సమయంలో యుఎన్, ఇతర దేశాలు ఈ సంఘర్షణకు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చింది. ఈ యుద్ధం నేపథ్యంలో పుతిన్-జెలన్‌స్కీ మధ్య సంబంధాలను సమతుల్యంగా నిర్వహించడంలో భారత్ చాలా జాగ్రత్తగా వ్యవహరించింది. ఇదే సమయంలో ఈ యుద్ధం రష్యా - పశ్చిమ దేశాల మధ్య ఉద్రిక్తతలకు దారితీయడం భారత్‌కు మరో తలనొప్పిగా మారింది. ప్రస్తుతం ఈ రెండు పక్షాల మధ్య భారత్ ఎంతో వ్యూహాత్మకంగా తన విదేశాంగ విధానాన్ని అమలు చేయడం వల్ల అనుకోని లాభాలు కలుగుతున్నాయి. ఒక్క చైనా,

పాకిస్తాన్ తప్ప మరే దేశంతో శత్రుత్వం లేకపోవడం భారత్‌కు కలిసొచ్చిన అంశం. అందువల్ల మనదేశ విధానాన్ని ఏ దేశమూ తప్పు పట్టలేని స్థితి నెలకొనడంతో, ప్రపంచ స్థాయిలో సమస్యల పరిష్కార గురువుగా అన్నిదేశాలు మనదేశంవైపే చూసే పరిస్థితి నెలకొంది. ఫలితంగా అంతర్జాతీయ రాజకీయాల్లో భారత్ కీలకపాత్ర పోషించే స్థాయికి ఎదిగింది.

రష్యా అధ్యక్షుడు సాధారణంగా తన స్థాయి నాయకులతో తప్ప మరెవరినీ కలవరు, చర్చించరు. విచిత్రంగా ఇటీవల భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ రష్యా వెళ్లినప్పుడు, ప్రొటోకాల్ పక్కనపెట్టి పుతిన్ ఆయనతో గంటసేపు ఏకాంతంగా సమావేశం కావడం, భారత్‌కు ఆయన ఇస్తున్న ప్రాధాన్యత ఏమిటో చెబుతోంది. ఉక్రెయిన్ అధ్యక్ష కార్యాలయం చీఫ్ యాండ్రీ యెర్మార్క్, అజిత్ దోవల్‌తో మాట్లాడుతూ, ఉక్రెయిన్‌లో శాంతిస్థాపనకు వీలుగా ఐక్యరాజ్యసమితిలో ఒక ముసాయిదా తీర్మానానికి అనుకూలంగా ఓటు చేసి సహాయం చేయమని కోరడం మరో గుర్తించదగ్గ పరిణామం. ముఖ్యంగా డొనెక్స్‌కు చెందిన బఖ్‌మత్ పట్టణాన్ని రక్షించుకోవడం తమకు కష్టసాధ్యంగా మారిందని ఆయన మొరపెట్టుకున్నారు. గతంలో జెలన్‌స్కై మన దేశంపై ఆంక్షలు విధించాలని యుఎస్, ఇతర పశ్చిమ దేశాలను కోరినా వాటినుంచి సరైన స్పందన లేకపోవడంతో ఆయనకూ భారత్ విలువ తెలిసొచ్చింది. ఐక్యరాజ్య సమితిలో




ఫ్రాన్స్– రష్యాలమధ్య వాదోపవాదాలు జరిగిన నేపథ్యంలో ఫ్రాన్స్ కూడా ఈ ముసాయిదాకు అనుకూలంగా ఓటు చేయాలని భారత్‌ను కోరింది. ఇన్ని రకాల ఒత్తిళ్లున్నప్పటికీ ఫిబ్రవరి 23న జరిగిన ఓటింగ్‌లో భారత్ తటస్థ వైఖరినే అవలంబించింది. 141 దేశాలు తీర్మానానికి అనుకూలంగా, 7 దేశాలు వ్యతిరేకంగా ఓటు చేయగా, 32 దేశాలు తటస్థంగా ఉండిపోయాయి. ఇప్పటివరకు రష్యా–ఉక్రెయిన్ యుద్ధంపై యు.ఎన్.లో ప్రవేశపెట్టిన తీర్మానాలకు ఓటింగ్ విషయంలో భారత్ తటస్థవైఖరినే ఎంచుకుంది. ఇక అమెరికా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, యు.కె. తదితర దేశాలు ఈ యుద్ధాన్ని ఆపేశక్తి కేవలం భారత్‌కు మాత్రమే ఉన్నదని విశ్వసిస్తుండటం కూడా అంతర్జాతీయంగా పెరిగిన భారత ప్రతిష్టకు నిదర్శనం.

'వసుధైక కుటుంబకం' అనేది మన దేశం విధానం. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి. కానీ ప్రజలే శాశ్వతం. వారి సంక్షేమమే ప్రధాన లక్ష్యం. ఇదే ప్రస్తుతం మన విదేశాంగ విధానంలోని కీలకాంశం. టర్కీ ప్రభుత్వం మనతో ఎంతగా విభేదిస్తున్నప్పటికీ, భూకంపంతో విలవిలలాడుతున్న స్థితిలో అక్కడి ప్రజలకు తొలి సహాయం అందించిన దేశాల్లో భారత్ ముందుంది. దేశ ప్రయోజనాలు, ప్రపంచ ప్రజల సంక్షేమమే ప్రధాన అజెండాగా ముందు కెళుతున్న భారత్‌ను ఏ దేశమూ వేలెత్తి చూపలేదు. ఇంతటి విశాల భావంతో ముందుకెళుతున్న భారత్‌పై విషం చిమ్మే పాకిస్తాన్ ఇప్పుడు జోలె పట్టుకొని అడుక్కునే స్థితికి దిగజారింది. మనల్ని ఇబ్బంది పెడుతున్న చైనా అంతర్గతంగా తీవ్ర ఒడిదొడుకులను ఎదుర్కొంటోంది. విశాల హితంకోసం పనిచేసే దేశానికి ప్రకృతి కూడా సహకరిస్తుందనడానికి ఇంతకుమించిన సాక్ష్యం మరొకటి లేదు. ★

# అగ్నివీరుల సైన్యం రాజ్యాంగబద్ధమే



బీజేపీ ప్రభుత్వం ఏం ఆలోచించినా, ఏ సంస్కరణ చేసినా అతి నీచమైన భాషలో విమర్శించే దిక్కుమాలిన ప్రతిపక్షాలు దేశమంతటా ఉన్నాయి. ఆఖరికి దేశ భద్రత అంశంమైనా సరే బాధ్యతాయుతంగా మాట్లాడే సంస్కారాన్ని అవి చూపలేకపోతున్నాయి. రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన మంత్రి సురేంద్ర యాదవ్ (బిహార్ సహకార శాఖ మంత్రి) రాబోయే ఎనిమిదేళ్లలో భారతదేశం నపుంసకుల సేనగా తయారవుతుందని తుచ్ఛమైన వ్యాఖ్య చేశాడు. అగ్నిపథ్ సైనికులు పదవీ విరమణ చేస్తే ఎదురయ్యే పరిస్థితి ఇదేనని ఆయన భావం. ఆ పథకాన్ని విమర్శించడానికి ఆ సంస్కారహీనుడు ఎంచుకున్న భాష ఇది. అగ్నిపథ్ పథకం కింద సైన్యంలో చేరినవారు బయటకు వచ్చేయాలని కూడా పిలుపునిచ్చాడు. కానీ ఆ పథకం గురించి ఢిల్లీ హైకోర్టు ఫిబ్రవరి 27న ఏమంది? అగ్నిపథ్ పథకం జాతీయ ప్రయోజనాల కోసం కేంద్రం ప్రవేశపెట్టిందనే విశ్వసిస్తున్నామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మ, జస్టిస్ సుబ్రహ్మణ్యప్రసాద్‌లతో కూడిన ధర్మాసనం తేల్చి చెప్పింది. దీని చట్టబద్ధతను ప్రశ్నించే పనే లేదని కూడా అభిప్రాయపడింది. ఇది భారత ప్రభుత్వం ఆదరాబాదరా తెచ్చిన పథకం కూడా కాదు. పూర్వాపరాలు పూర్తిగా పరిశీలించిన తరువాత, మంచి ప్రణాళికతో తీసుకువచ్చిన విధానమని కూడా ధర్మాసనం ప్రశంసలు కురిపించింది. కూలంకషంగా అధ్యయనం చేసిన తరువాత అగ్నిపథ్ సైనికులు భద్రతా బలగాలకు ఎంతో ఉపయోగపడతారని అర్థమైందనీ, జాతీయ ప్రయోజనాల కోసమే ఈ పథకం తెచ్చారన్న నిర్ణయానికి వచ్చామనీ ధర్మాసనంలో న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. ఈ పథకంలో నిర్దేశించినట్టు నాలుగేళ్ల తర్ఫీదు తరువాత సైనికులలో దేశభక్తి తప్పనిసరిగా వృద్ధి చెందుతుందని మేం చెప్పగలమని కూడా అన్నారు. ఆ జాతీయవాద భావనలే దేశం కోసం పాటుపడే విధంగా వారిని తీర్చిదిద్దుతుందని చెప్పారు.

ఈ పథకంలో ఉన్నవారు నాలుగేళ్లకే పదవీ విరమణ చేస్తారు కాబట్టి, తరువాత చట్ట వ్యతిరేకత కార్యకలాపాలకు పాల్పడతారని ఇప్పుడే చెప్పడం సరికాదని కూడా ధర్మాసనం అభిప్రాయపడింది. అగ్నిపథ్ కింద సైనికులను చేర్చుకోవడం రాజ్యాంగబద్ధం కాదంటూ దాఖలైన పిటిషన్ మీద విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు ఈ తీర్పును ఇచ్చింది.

కమిషన్డ్ అధికారుల కంటే కిందిస్థాయి సైనికులను చేర్చుకోవడానికి ఉద్దేశించిన పథకమే అగ్నిపథ్. జూన్ 14, 2022న కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన పథకమిది. త్రివిధ దళాలకు ఈ పథకం వర్తిస్తుంది. అగ్నివీర్ సైనికుల పేరిట వీరిని పిలుస్తారు. వీరు నాలుగేళ్లు పనిచేస్తారు. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా ఈ పథకానికి విశేషమైన ఆదరణ లభించింది. ఇప్పుడు న్యాయస్థానం కూడా ఈ అగ్నివీరుల రాజ్యాంగ బద్ధతను నిర్ధారించింది. ఇకనైనా విపక్షాలు నోరు మూస్తాయో లేదో చూడాలి. ★

# సేవాభారతి ఆధ్వర్యంలో బాలమేళా






**విజయవాడ:** ఫిబ్రవరి 19, 2023న విజయవాడలోని మొగల్ రాజపురం సిద్ధార్థ ఆడిటోరియంలో సేవాభారతి ఆధ్వర్యంలో బాలమేళా జరిగింది. ఇందులో భాగంగా పిల్లలకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథి రామినేని ఫౌండేషన్ ఛైర్మన్ ధర్మప్రచారక్, ఎ.పి.ఎస్.డి.పి.ఎస్. డైరెక్టర్ కోట్ల శివశంకర్‌రావు, గుంటూరు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పాతూరి నాగభూషణం, విభాగ్ ప్రచారక్ నవీన్, స్వాతి హాస్పిటల్ &ఎండోకేర్ హాస్పిటల్ డాక్టర్ స్వాతి, దీపక్స్ సెల్వర్ ఎంపోరియో దీపక్‌కుమార్ జైన్, భామ ఎంపోరియో వి. చంద్రశేఖర్, సేవాభారతి గౌరవ అధ్యక్షులు డా.చదలవాడ సుధ, అధ్యక్షులు డా. యలమంచిలి సాయికిశోర్, ఉపాధ్యక్షులు పత్తి నాగలక్ష్మి, కార్యదర్శి ఎం.శుభశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'సేవా హి పరమో ధర్మః' అన్న నినాదంతో 1990లో విజయవాడలో ప్రారంభమైన సేవాభారతి వివిధ బస్తీల్లో పేదల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు అనేక సేవా కార్యక్రమాలను విస్తృత పరుస్తున్నది. బస్తీల్లోని బాలబాలికల అభివృద్ధి కోసం గత 33 ఏళ్లుగా అంకితమై ఈ సంస్థ పనిచేస్తున్నది. బాలబాలికల్ని బాధ్యతా యుతమైన పౌరులుగా, ప్రయోజకులుగా వారి కుటుంబాలకు, దేశానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దడమే సేవాభారతి లక్ష్యం.

విజయవాడలోని జక్కంపూడి కాలనీ, రాజరాజేశ్వరిపేట, కేదారేశ్వరపేట, నులకపేట, అజిత్‌సింగ్‌నగర్, వెంకటేశ్వరనగర్, డోలాస్ నగర్, రామరాజ్యనగర్, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కొండమెట్లు తదితర ప్రాంతాలలో 48 ఉచిత ట్యూషన్ సెంటర్ల ద్వారా మొత్తం 994 మంది బాలబాలికలు లబ్ధి పొందుతున్నారు. ఈ కేంద్రాలు రోజుకు 2 గంటలు, వారానికి 6 రోజుల చొప్పున చిన్నారుల సమగ్ర వికాసం కోసం కృషి చేస్తున్నాయి. ఈ కేంద్రాల్లోని చిన్నారులను ఉత్సాహ పరిచేందుకు నిర్వహించే వార్షిక సమ్మేళనాన్నే 'బాల మేళా' అంటారు.


ధర్మవరం


అనంతపురం

**అనంతపురం :** అనంతపురం విభాగ్‌లోని శ్రీ సత్యసాయి, అనంతపురం, కడప జిల్లాలలో ఆర్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో ఫిబ్రవరి 26న శాఖా వారిగా పథ సంచలన్ కార్యక్రమాలు నిర్వహించారు. స్వయంసేవకుల్లో గుణవికాసానికై, హిందూ సమాజంలో ధైర్య సాహసాలను నింపేందుకు పథ సంచలన్‌ను వేలాది మంది స్వయంసేవకులతో ఒకే రోజు నిర్వహించడం విశేషం.

## పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం




**కామారెడ్డి :** సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో ఫిబ్రవరి 22న కామారెడ్డి కళాభారతి మండపంలో సంత్ రవిదాస్, సంత్ సేవాలాల్, సంత్ గాడ్గే బాబా, రామకృష్ణ పరమహంస, స్వామి దయానంద సరస్వతి, ఛత్రపతి శివాజీ వంటి సమతామూర్తుల జయంతి ఉత్సవాల సందర్భంగా 300 మంది మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులను, పాదరక్షలు కుట్టేవారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. అన్ని కులాల్లోనూ మహనీయులు జన్మించారని, కులం కన్న గుణం మిన్న అని చాటిచెప్పిన మన పూర్వీకుల అడుగుజాడల్లో అందరం నడవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సామాజిక సమరసతా వేదిక కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజేందర్, జిల్లా సంయోజక్ బాలరాజ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి మన్నే కృష్ణ, జిల్లా సంఘచాలక్ బొడ్డు శంకర్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కథ

"ఈ కనకాంబరం రంగు పట్టుచీర నాకు నప్పిందా?" కుదురుగా కట్టుకుని పిన్ పెట్టుకుని, అద్దంలో చూసుకుంటూ నగలు పెట్టుకుంటూ అడిగింది అర్ధాంగి శ్రీలత. బావుందన్నట్టు బొటనవేలు పైకెత్తి చూపించాను. నేను కూడా ఆమె నా కోసం తీసి పెట్టి ఉంచిన సూట్ వేసుకున్నాను.

"చూడండి! ఇవాళ మావాళ్లెంత ఘనంగా మీ రిటైర్మెంట్ ఫంక్షన్ చేస్తారో! ఎవ్వరూ చెయ్యనంత బాగా చేస్తారు! మీరు మర్చిపోలేనంత అద్భుతంగా ఉంటుంది" అంది. "చూద్దాం.. చూద్దాం.." అన్నాను నేను నవ్వుతూ. శ్రీలత బంధువులు, స్నేహితులు అందరూ హైదరాబాద్‌లోనే ఉన్నారు. మా అత్తామావలిద్దరూ వైజాగ్‌లో ఉండేవారు. ఆయన రియల్ ఎస్టేట్ కాంట్రాక్టర్‌గా ఉండేవాడు. ఇద్దరూ చాలాకాలం క్రితమే పోయారు. పెద్ద బావమరిదీ, మరదలూ బల్కంపేటలో ఉంటారు. చిన్న బావమరిది అమెరికాలో ఉంటాడు. శ్రీలత పెదనాన్న కొడుకులిద్దరూ, మేనత్త పిల్లలూ, చాలా మంది కజిన్ సిస్టర్స్, బ్రదర్స్, తన క్లాస్‌మేట్స్ ఇక్కడ వివిధ ఉద్యోగాల్లో ఉన్నవాళ్లున్నారు. వైజాగ్‌లో గ్రాడ్యుయేషన్ చేసిన శ్రీలత కారును ఎక్కడికైనా హాయిగా నడుపుకుంటూ వెళ్లివస్తూ ఉంటుంది. ఆమె వాళ్లందరితోనూ నిత్యం టచ్‌లో ఉంటుంది.

నేను హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ బల్క్ డ్రగ్ కంపెనీలో ఎమ్మెస్సీ కెమిస్ట్‌గా జాయిన్ అయ్యి అంచెలంచెలుగా ప్రమోట్ అయ్యి జనరల్ మేనేజర్ అవ్వడం జరిగింది. ఉదయం ఎనిమిదికి బయలుదేరితే ఇంటికి వచ్చేప్పటికి రాత్రి తొమ్మిదో పదో అయ్యేది. ఇంటినీ, బంధువుల్నీ చక్కబెట్టుకోవడం ఒక్కగానొక్క కూతురు త్రిషని చూసుకోవడం అంతా ఆమే చేసేది. బి.టెక్ చేసిన త్రిష గడచిన సంవత్సరమే పెళ్లి చేసేసాం. ఎలాగూ అంతా పిల్లదే అయినా నలుగురిలో అందంగా ఉండాలని మంచి కట్నం ఇచ్చాం. పెళ్లికొడుకు ఐ.ఐ.టీ. మద్రాస్ విద్యార్థి. ఒక పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలో మంచి పోస్టులో ఉన్నాడు. త్రిష భర్తతో పుణేలో ఉంటోంది. మొన్ననే రిటైర్మెంట్ రోజుకి వచ్చింది. ఇప్పుడు రాలేనంది.

నేను గత నెలాఖరున రిటైర్ అయ్యాను. ఆఫీస్ వాళ్ల ఆఫీషియల్ పదవీ విరమణ సభా సన్మానాలూ, దగ్గరి సహోద్యోగుల పార్టీలూ, ఇతర మిత్రుల గెట్ టు గెదర్‌లతో ఈ నెల చకచకా గడిచిపోతోంది. ఇవాళ శ్రీలత బంధుమిత్రులంతా కలిసి ఒక స్టార్ హోటల్లో లంచ్ ఏర్పాటు చేసారు. అక్కడికే బయలదేరుతున్నాం. పదకొండయ్యేసరికి హోటల్‌కి చేరుకున్నాము. "వరప్రసాద్ గారి అభినందన పార్టీ" అన్న బ్యానర్ రిసెప్షన్ లో మమ్మల్ని ఆహ్వానించింది.

యాభై మంది పట్టేంత చిన్నహాల్ ఎంతో ముద్దుగా, రిచ్‌గా ఉంది. గోడలకి రంగు రంగుల గులాబీలు అతికారు. ఒక పక్క స్పెషల్ కుర్చీలు రెండువేసి టీపాయ్ మీద అందమైన చిన్న చిన్న పూల కుండీలు పెట్టారు. అందరూ అందరికీ కనబడేట్టుగా చైర్స్ అమర్చి ఉన్నాయి. అంతా ఒక్కసారిగా లేచి" కంగ్రాచ్యులేషన్స్! ప్రసాద్, శ్రీలతా" అంటూ చుట్టుముట్టారు. మమ్మల్ని తీసుకుని వెళ్లి మా స్పెషల్ కుర్చీలలో కూచోబెట్టారు. వాళ్ల ఉత్సాహం చూస్తుంటే నాక్కూడా హుషారు వచ్చింది. అందరినీ నేను కూడా పలకరించాను. వేం కూర్చోగానే ఒక్కొక్కరూ వచ్చి చేతులు కలిపి ప్రత్యేకంగా నాకు అభినందనలు చెప్పారు. "సో.. మన చీఫ్ గెస్ట్ శ్రీ వరప్రసాద్ గారు వచ్చేసారు. కార్యక్రమం ప్రారంభించేద్దాం" అంటూ శ్రీలత కజిన్ బ్రదర్, బ్యాంకు మేనేజర్‌గా చేస్తున్న శివశంకర్ మైక్ తీసుకున్నాడు.

"గౌరవ బంధుమిత్రులారా! ఈరోజు మనం అందరం ఇలా కలవడం ఎంతో ఆనందంగా ఉంది. దానికి కారణమైన వరప్రసాద్ దంపతులకి ముందుగా అభినందనలు చెబుదాం" అంటూ మొదలు పెట్టాడు. ముందుగా నా కెమిస్ట్రీ స్పెషలైజేషన్ గురించి చెప్పి, కెమిస్ట్ నుండి జనరల్ మేనేజర్‌గా బల్క్ డ్రగ్ కంపెనీలో నా ఉద్యోగ ప్రస్థానం చదివి నేను ఉద్యోగానికి ఎంత అంకితమై పనిచేశాడో చెప్పాడు. ఇంకా చెబుతూ "ఏ పండగలొచ్చినా, చిన్న ఫంక్షన్లు జరిగినా మాతో కలవడానికి బావగారికి కుదిరేది కాదు. వర్క్ ఈజ్ వర్షిప్ అనేది ఈయన్ని చూసే చెప్పుంటారు. వరప్రసాద్ నెమ్మదస్తుడు, నిదానస్తుడు, నిజంగా నైస్ జెంటిల్‌మాన్. ఇంతమంచి భర్తను పొందడం మా శ్రీలత అదృష్టం ఇంతటి కమిట్మెంట్ ఉన్న ఉద్యోగులు ఈ రోజుల్లో అరుదు" అని కూడా అన్నాడు. 'నా గురించి ఇంత ఆలోచించారా? వీళ్లంతా!' అని నాకు చాలా ఆనందంగా, తృప్తిగా, కాస్త గర్వంగా అనిపించింది.


తర్వాత ఆయనే శ్రీలత గురించి చెబుతూ "మా చెల్లాయి చిన్నప్పటి నుండీ ఎంతో సంస్కారవంతురాలూ, బంధుప్రీతి, మనుషుల్ని అభిమానించే వ్యక్తిత్వం గలదీ కూడా. మా వైజాగ్ నుంచి హైదరాబాద్‌కి పనుల మీద వచ్చే వారు శ్రీలత దగ్గరే దిగి పనులు చూసుకునేవారు. వారికి తగిన సూచనలూ, సలహాలూ ఇస్తూ ఎంతో సహాయకారిగా ఉండేది. ఇప్పటికీ అదే మంచితనం ఆమెది. ఆమెకు నా దీవెనలు" అంటూ ముగించాడు.

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ప్రొఫెసర్లుగా పని చేస్తున్న శ్రీలత అన్నా, వదినా మా ఇద్దరికీ బట్టలు పెట్టారు. వదిన గారు 'తాను ఎన్నో సార్లు బైటి ఊర్లకి రీసెర్చ్ పనిమీద వెళ్లినప్పుడు తన పిల్లలిద్దర్నీ శ్రీలత సొంత చెల్లెల్లా చూసుకుందని' చెప్పి మెచ్చుకుంది. రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తున్న శ్రీలత చెల్లెలు విద్య, ఆమె భర్తా కొంతకాలం వైజాగ్ మకాం మార్చినప్పుడు వాళ్లమ్మాయి శ్వేతని ఓ ఆరు నెలలు మా ఇంట్లో ఉంచి కాలేజీకి పంపింది శ్రీలత. ఇప్పుడా అమ్మాయి టీసీఎస్‌లో పనిచేస్తోంది. "మా పెద్దమ్మ నాకు రెండో అమ్మ" అంటూ శ్వేత ఎంతో ప్రేమా, కృతజ్ఞత ప్రకటించింది. అక్కడున్న ప్రతి ఒక్కరూ మైక్ తీసుకుని ఆమెతో తమ అనుబంధం గురించి చెప్పారు. ముఖ్యంగా స్నేహితుల్నీ, బంధువుల్నీ ఆదరించే విషయంలో శ్రద్ధ తీసుకుని తామందరినీ ప్రేమగా ఆదరించిందని వాళ్లంతా



# నా లాగ ఎందరో!

## అల్లూరి గౌరీలక్ష్మి




కబుర్లు చెప్పుకుంటూ సరదాగా డెసర్ట్‌తో సహా లంచ్ తిని వీడ్కోలు తీసుకునేసరికి మూడయ్యింది. ఇంటికి తిరిగి వస్తుంటే "నువ్వు చెప్పినట్టే అద్భుతంగా ఉంది పార్టీ" అన్నాను లతతో. "ఎంత యిందో ఎవరు పే చేసారో ?" అన్న నా మాటకి ఆనందంతో వెలిగిపోతోన్న మొహంతో "చెప్తారా మనకి?" అంది దర్పంగా. అంతమందితో నవ్వుతూ గల గలా కబుర్లు చెబుతూ అలిసిపోయిన ఆమె ఇంటికి రాగానే బట్టలు మార్చుకుని నిద్రపోయింది. నేను కూడా బట్టలు మార్చుకుని మొహం కడుక్కుని సోఫాలో ఆలోచిస్తూ కూర్చున్నాను. వాళ్లంతా ఎంతో అభిమానంతో మమ్మల్ని గౌరవించారు. అయితే ఎందుకో మరి, ఏదో అస్థిమితంగా ఉన్నట్టుగా ఉంది నా మనసులో.

గత నెల నా రిటైర్మెంట్ రోజుకి త్రిషా,అల్లుడూ, శ్రీలత అన్నావదినా, చెల్లెలూ, మరిదీ ఒకరోజు ముందుగానే రావడానికి ఒప్పుకున్నారు. "మా చెల్లాయిలిద్దరినీ పిలవనా?" అంటే "వద్దండీ తర్వాతెప్పుడైనా పిలుద్దాం'' అంటూ వారించింది శ్రీలత. చెల్లెళ్లకి ఫోన్ చేసాడు తాను. "ఈ నెలాఖరుకు రిటైర్ అవుతున్నా న్రా! మనం తర్వాత కలుద్దాం" అంటూ." అలాగే అన్నయ్యా! శుభాకాంక్షలు" అన్నా రిద్దరూ. అమ్మా నాన్నా ఏ రెండేళ్లకో వచ్చేవారు. చెల్లెళ్లిద్దరూ పెళ్లయిన కొత్తలో ఒకసారి వచ్చారు. తర్వాత వచ్చింది చాలా తక్కువే. శ్రీలత ఎందుకో అత్తామావల మీదా, ఆడపడుచుల మీద ఎప్పుడూ ఫిర్యాదు చెయ్యలేదు కానీ వాళ్లను కలుపుకోలేదేమో అని అప్పుడప్పుడూ అనిపించేది. అది లోకంలో ఉన్నదేలే అనుకున్నాడు తను. ఎప్పుడు రమ్మన్నా వాళ్లు తన దగ్గరికి రావడానికి ఉత్సాహం చూపించే వారు కాదు.

ఇవాళ ఈ బంధుమిత్రుల కలయిక చూస్తే ఆమె తన పరివారాన్ని ఎంతో జాగ్రత్తగా చూసుకున్నదని అనిపిస్తోంది. అమ్మా నాన్నా ఎలాగూ లేరు కనీసం తాను తన చెల్లెళ్లనయినా పిలవాల్సింది అని కొంచెం బాధ కలిగింది. ఎక్కడో పొరపాటు జరిగిందేమో అనిపిస్తోంది.నిజానికి తనెప్పుడూ ఉద్యోగం బిజీ లోనే ఉండేవాడు.ఎప్పుడైనా పండగలకి అమ్మా, నాన్నా వచ్చి రెండు రోజులుండి వెళ్లిపోయే వారు, పనులున్నాయనే వారు.అది పనులుండేనా? లేక శ్రీలత దగ్గర వాళ్లకు ఆదరణ లభించకా ? ఎప్పుడూ లేని ఆలోచనలు ఇప్పుడే వస్తున్నాయేమిటి నాకు? తల విదిలించాను.

నిద్ర నుంచి లేచి టీ తీసుకొచ్చి కూర్చుంది లత. "ఏవండీ చాలా బాగా జరిగింది కదా ఫంక్షన్?" అన్న ఆమె మాటలకి "ఆ.. ఆ.. నీ ఫ్యామిలీకి నువ్వింత కావలసిన దానివని, వాళ్లను నువ్వింత కేరింగ్‌గా చూసుకున్నావని ఇన్నాళ్లుగా నాకే తెలీలేదు" అన్నాను నవ్వుతూ. "అంతే కదా మరి మీ మగాళ్లు!" అని నవ్వేసింది శ్రీలత. "నిన్ను చూసి నేను నేర్చుకోవలసింది చాలానే ఉంది లతా" అన్నాను. "అదిగో వెక్కిరిస్తున్నారు" అంటూ కప్పులు తీసుకుని లేచింది చిరునవ్వుతో. మర్నాడుదయం టెర్రస్ మీద వాకింగ్ చేస్తుంటే మళ్లీ ఆలోచనలు చుట్టుముట్టాయి.

అమలాపురంలో ఇంజనీరింగ్ చదివే పెద్ద చెల్లాయి పెద్ద కూతురు శ్రావ్య రోజూ "గుడ్ మార్నింగ్ మామాశ్రీ" అంటూ ఒక కార్డు పెట్టేది. అలా రోజూ మేనకోడలు తనని పలకరిస్తుంటే తనకెంతో బావుండేది చెల్లాయితో మాట్లాడినట్టుండేది. దాని డీపీ చూస్తే చిన్నప్పటి చెల్లాయేననిపించేది. ఒక రోజు ఫోన్‌లో శ్రావ్య కార్డులన్నీ భార్యకీ, కూతురికీ చూపించాడు తను. అవి కొన్ని మంచి సీనరీలు, కొన్ని కొటేషన్లూ."అన్నీ బావున్నాయి డాడీ! శ్రావ్యది మంచి టేస్ట్" అంది త్రిష. శ్రీలత కూడా చూసింది. ఏమీ మాట్లాడలేదు. మర్నాటి నుండీ ఆ పిల్ల నుంచి గుడ్ మార్నింగ్ రావడం ఆగిపోయింది. శ్రావ్యని త్రిష పెళ్లికొచ్చినప్పుడు అడిగాడు తను "ఏమ్మా! గుడ్ మార్నింగ్ పెట్టడం మానేశావ్ ఈ మధ్య" అని. నా ఫోన్ తీసుకుని చెక్ చేసి నీ ఫోన్లో నా నంబర్ డిలీట్

చెప్పారు. చివరగా శ్రీలత లాంటి భార్య దొరకడం వరప్రసాద్ అదృష్టం అని అంతా అన్నారు.

ఇది నా రిటైర్మెంట్‌లా లేదు ఆమె సన్మానసభలా ఉందే అనిపించింది నాకొక్క క్షణం. ఆ వెంటనే 'నిజమే నేను ఎవరికీ సాయం చెయ్యలేదేమో! ఆ కెమికల్ కంపెనీకి జీవితం అంకితం చేశానేమో. నాతో చదివిన అనేక మంది మిత్రులు, మా రాజోలు కజిన్స్ హైదరాబాద్‌లోనే ఉన్నారని అప్పుడూ,ఇప్పుడూ వినడమే కానీ వారిని పలకరించింది లేదు తాను. ఆఖరికి ఈ సభలో కనీసం ఒక్కరు కూడా నా తరఫు నుంచి రానేలేదు సుమా అనిపించింది.

ప్రతి ఒక్కరూ శ్రీలతని కౌగలించుకుని తాము తెచ్చిన గిఫ్ట్ లిచ్చారు. నాకు హ్యాపీ రిటైర్మెంట్ చెప్పారు. తర్వాత అందరం మాకోసం ప్రత్యేకంగా అమర్చిన లంచ్ హాల్‌కి నడిచాం. వంటకాలన్నీ చాలా బావున్నాయి. అన్నీ మా ఇద్దరికీ నచ్చినవే ఉన్నాయి.

ఐపోయింది మావయ్యా! ఇంకెలా వస్తుందీ!" అని నవ్వేసింది. 'ఎలా డిలీట్ అయ్యింది?'తనకప్పుడు రాని అనుమానం ఇప్పుడు వస్తోంది. త్రిష పెళ్ళికి చెల్లెళ్ల ఫ్యామిలీలు వచ్చాయి కానీ ఎక్కువ ఉత్సాహంగా కనబడలేదు. బావుండదని వచ్చినట్టుగా ఉన్నారు. పెళ్లి అయిన మర్నాడే వెళ్లిపోయారు. మరో రెండు రోజులు ఉండమని అడిగినా ఉండలేదు.

ఒక రోజు మధ్యాహ్నం గెస్ట్‌బెడ్ రూమ్‌లో పడుకున్న తనకి నిద్రపట్టక క్రెడిట్ కార్డు కనబడని విషయం గుర్తొచ్చిమరోసారి వెతుకుదామనిపించి బెడ్ రూమ్‌లోకి వెళ్లాడు. అక్కడ తల్లీ కూతురూ అటుతిరిగి పడుకుని ఉన్నారు. అప్పటికి కూతురు పెళ్లయి ఆరు నెలలయింది. మరో నెలలో త్రిషని కాపురానికి భర్త దగ్గరికి పూణే పంపడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. త్రిషపై చెయ్యి వేసి శ్రీలత అంటోంది." నువ్వారికే ఆడబిడ్డా, అత్తా అంటూ వాళ్లతో బాగా కలిసి పోయి ఎక్కువ ప్రేమగా ఉండాలనుకోకు. కొంచెం దూరం గానే ఉండు. ఈ అమ్మ చెప్పేది నీ మంచికోసమే కదా సరేనా, కన్నా!" ముద్దుచేస్తూ అంటోంది శ్రీలత. ఆ సంఘటన ఇప్పుడు గుర్తు చేసుకుంటుంటే మనసులో చురుక్కున గుచ్చుకుంటోంది.

తను రాత్రి తొమ్మిదికే అలిసిపోయి పడుకునే వాడు. తర్వాత చెల్లెళ్ల ఫోన్‌లో తల్లితండ్రుల ఫోన్ లో వస్తే మర్నాడు చూసి "లతా ఎందుకో కనుక్కో" అనేవాడు తను హడావిడిగా వెళ్లిపోతూ మళ్లీ ఎప్పుడో గుర్తొచ్చినపుడు అడిగేవాడు "కనుక్కున్నావా? ఫోన్ చేసావా?" అంటూ. "ఊరికే చేశారట లెండి" అనేది శ్రీలత. క్రమంగా ఆ ఫోన్ లు కూడా చెల్లెళ్లు మానేశారు. అలా నెమ్మదిగా దూరం పెరిగింది. తను ఫోన్ చెయ్యకపోయినా నాన్నే తరచూ చేసి మాట్లాడి అమ్మతో మాట్లాడిస్తూ ఉండేవారు. అమ్మా నాన్నా చెల్లాయిలిద్దరి గురించీ వార్తలు చెప్తూ ఉండేవారు.



అమ్మా నాన్నా పోయాక రెండళ్ల నుంచీ చెల్లాయిల కుటుంబ విశేషాలు కూడా తెలియడం లేదు. మా ఊరు కోనసీమ రాజోలు దగ్గర శివకోడు. అక్కడ అమ్మా నాన్నా కట్టుకున్న పెంకుటిల్లు ఉంది. అది పాడవకూడదని నేనే మా బంధువులకే ఉండడానికి ఉచితంగా ఇచ్చి ఇంటిని శుభ్రంగా ఉంచమని చెప్పాను.

మర్నాడు ప్రొద్దున్నే చెల్లాయిలిద్దరికీ ఫోన్ చేసాను. "రిటైర్ అయ్యావు కదా వీలు చూసుకుని ఇద్దరూ రండి ఓ వారం ఉండాలి" అంది పెద్ద చెల్లి. చిన్న చెల్లి కూడా "రా రా ఒకసారి" అంది. ఇద్దరూ పక్క పక్క గ్రామాల్లోనే ఉంటారు. వ్యవసాయదారులే. మధ్య తరగతి ఆస్తి పరులు. లోటులేదు. ఇద్దరేసి పిల్లలు ఇద్దరికీ. చిన్న చెల్లాయి పిల్లలు హైస్కూల్‌లో ఉన్నారు చిన్నప్పుడు చెల్లాయిలిద్దరూ తన వెనకే ఉండే వారు. వాళ్లిద్దరూ కొట్టుకునేవారు కానీ నాతో గొడవ పడేవారు కాదు. ఇద్దరూ టెన్త్ చదివి మానేశారు. ప్రతీ పండగకీ వాళ్లే ఫోన్లు చేస్తుంటారు. తానెప్పుడూ చేసేవాడు కాదు.

ఏ పెళ్లిళ్లలో కలిసినా చెల్లాయిలూ,వారి భర్తలూ ఆంటీ ముట్టనట్టు ఏదో దూరపు బంధువుల్లా ఉంటుంటే పెద్దవాళ్లయ్యాకా అది సహజమే అని పొరబడ్డాడు తాను. ఇకనుంచీ చెల్లెళ్ల ఇళ్లకు రాకపోకలు చేస్తూ వాళ్లను కలుపుకోవాలి. వాళ్ల పిల్లల చదువుల, పెళ్లిళ్ల గురించి సలహా, సహాయాలు చెయ్యాలి. మన అనుకున్న బంధువులైనా మిత్రులైనా, వారితో బంధం పదిలంగా అల్లుకున్న అందమైన గూడులా ఉండాలి కానీ కాకి గూడులా ఉండ కూడదు. దానికి నా ప్రయత్నం ముఖ్యం. అది నా బాధ్యత. ఇన్నేళ్లూ నేనూ నా ఉద్యోగం, నా భార్యా, నా పిల్లా అనుకుంటూ నా ప్రపంచంలోనే ఉండి పోయాను. ఇక్కడే ఉన్న నా క్లాస్‌మేట్‌ల ఫోన్ నంబర్లు సంపాదించి వాళ్లనూ కలవాలి.

రెండురోజులయ్యాక ఆమెకి నా అభిప్రాయం చెప్పాను."లతా! నేనొక వారం రోజులు మా ఊరు వెళ్లొస్తాను. మా చెల్లాయిల్నీ, ఇతర బంధువుల్నీ చూసొస్తాను. ఇన్నేళ్లూ ఉద్యోగంలో పడి బిజీగా ఉండి పోయాను. ఇప్పుడొక్కసారి అందరినీ కలవాలని పిస్తోంది. పచ్చని చేలూ, కొబ్బరి తోటలూ ఉండే మా శివకోడుని చూడాలనిపిస్తోంది."

"ఇప్పుడెందుకు? వీలు చూసుకుని వెళదాం లెండి ఎప్పుడైనా" అంది శ్రీలత చటుక్కున.

"లేదు ఇప్పుడే వెళ్లాలి' అన్నాను ఖచ్చితంగా.

"మరి నేను? నేను రావద్దా? మీతో" అంది కినుకగా.

"నీకు అక్కడ సౌకర్యంగా ఉండదు. నువ్వుండ లేవులే. నిద్ర పట్టదు కూడా" అన్న నా మాటలకి మెత్తబడిందామె.

"ఒక్కదాన్నే ఎలా ఉంటాను?" మరో ప్రశ్న వేసింది. "మీ వాళ్లెప్పుడూ రమ్మని పిలుస్తూ ఉంటారు కదా! ఇప్పుడు వెళ్ళు " అన్నాను."మంచి ఐడియా, వెళ్తాను. అయితే వారం ఎందుకు ఓ నాలుగు రోజులుండి వచ్చెయ్యండి" అంది.

''ఫోన్లు చేస్తూ ఉంటానుగా, చూద్దాం "అన్నాను."మీ బట్టలు సర్దుతాను. బాగ్ తీసివ్వండి పైనుండి" అంది. నేను స్టూల్ ఎక్కి సూటుకేసు తీసిచ్చా. ఆమె చకచకా నా బట్టలన్నీ బైటికి తీసి సర్దడం మొదలెట్టింది.

నా కార్ డ్రైవర్‌గా పనిచేసిన రఫీక్‌కి మొన్ననే ఫోన్ చేసి డ్రైవర్ కావాలనడిగాను. కొడుకు ఖాదర్‌ను పంపుతానన్నాడు. మర్నాడుదయమే ఖాదర్ నాలుగున్నరకల్లా వచ్చాడు. తెల్లవారక ముందే ఐదు గంటలకే మంచి కాఫీ తాగి కారులో కూర్చుని బయలుదేరుతుంటే ఆకు పచ్చని కోనసీమలోని మా ఊరి కేసి రెక్కలు చాపి గువ్వలా ఎగిరిపోతున్న అనుభూతి! ఎంత బావుందో! వెంటనే నా వీపు నేనే తట్టుకుంటూ, తు.చ. తప్పకుండా నేను చేయాలనుకుంటున్న పనులన్నీ, ఫోన్‌లో ఒక చోట నోట్ చేసుకున్నాను. ఇప్పుడు నా ఉత్సాహం రెట్టింపయ్యింది. ★



భారత మహిళా టెన్నిస్ చరిత్రలో ఓ గొప్ప అధ్యాయం ముగిసింది. ప్రతి ఆరంభం ఓ ముగింపుకు నాంది. దానికి ఎంత గొప్పవారైనా మినహాయింపు కాదు. భారత మహిళా టెన్నిస్ ఆల్ టైమ్ గ్రేట్ సానియా మీర్జా సైతం తన రెండు దశాబ్దాల ప్రొఫెషనల్ టెన్నిస్ జీవితానికి ముగింపు పలికింది.



# సానియాను మరువగలమా!

హైదరాబాద్‌లో 12 సంవత్సరాల వయసులో టెన్నిస్ రాకెట్ చేతపట్టి.. 16 ఏళ్ల ప్రాయంలో ప్రొఫెషనల్ టెన్నిస్‌లో అడుగుపెట్టి..గత రెండు దశాబ్దాలుగా భారత టెన్నిస్‌కు అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చిన సానియా మీర్జా 36 ఏళ్ల వయసులో రిటైర్మెంట్ ప్రకటించింది. తరచూ గాయాలు, కుటుంబ బాధ్యతలు వంటి కారణాలతో తన టెన్నిస్ జీవితాన్ని ముగించాలని నిర్ణయించుకున్నట్లు కొద్దిమాసాల క్రితమే ప్రకటించిన సానియా.. మెల్బోర్న్ వేదికగా గత నెలలోనే తన చిట్టచివరి గ్రాండ్ స్లామ్ టోర్నీలో పాల్గొంది. 2023 ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ బొపన్నతో కలసి రన్నరప్ ట్రోఫీ అందుకోడం ద్వారా గ్రాండ్ స్లామ్ టైటిల్స్ వేటను ముగించింది. ఇక..2023 దుబాయ్ ఓపెన్ మహిళల డబుల్స్ బరిలోకి అమెరికాకు చెందిన మాడిసన్ కీస్‌తో జంటగా దిగిన సానియాకు తొలి రౌండ్లోనే 4-6, 0-6తో రష్యా జోడీ వెరోనికియా-లూద్మిలా సామ్సు నోవాల చేతిలో ఓటమి తప్పలేదు. ఈ పరాజయంతో సానియా టెన్నిస్ జీవితం ముగిసినట్లయ్యింది.

**భారత అత్యుత్తమ క్రీడాకారిణిగా..**

భారత మహిళా టెన్నిస్ చరిత్రలో సానియా సాధించినన్ని ఘనతలు మరే క్రీడాకారిణీ ఇప్పటి వరకూ సాధించలేదు. మహిళా టెన్నిస్ చరిత్రలో అత్యుత్తమ ర్యాంక్, అత్యధిక టైటిల్స్, అత్యధిక గ్రాండ్ స్లామ్ టైటిల్స్, ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన తొలి, ఏకైక భారత క్రీడాకారిణి సానియా మాత్రమే. 2015లో వింబుల్డన్, యూఎస్ ఓపెన్, 2016లో ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల డబుల్స్ గ్రాండ్ స్లామ్ టైటిల్స్ గెలుచుకొన్న సానియా మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ మరో మూడు టైటిల్స్ గెలుచుకోగలిగింది. 2009లో ఆస్ట్రేలియన్ ఓపెన్, 2012లో ఫ్రెంచ్ ఓపెన్, 2014లో యూఎస్ ఓపెన్ టైటిల్స్‌ను సాధించింది.

భారత మహిళా టెన్నిస్ చరిత్రలో ఆరు గ్రాండ్ స్లామ్ టైటిల్స్ గెలుచుకొన్న ఏకైక, మహిళ సానియా మాత్రమే. హైదరాబాద్ నుంచి అంతర్జాతీయ టెన్నిస్‌లోకి రాకెట్లా దూసుకొచ్చిన సానియా 2009లో తన మొట్టమొదటి గ్రాండ్ స్లామ్ టైటిల్‌ను మెల్బోర్న్ వేదికగా ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనే సాధించింది. కెరియర్‌లో ఆఖరి గ్రాండ్ స్లామ్ (రన్నరప్) ట్రోఫీని సైతం ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనే సాధించడం విశేషం. తన కెరియర్‌లో ఇప్పటికే మహిళల సింగిల్స్, మహిళల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాలలో ఎన్నో అపూర్వ విజయాలు సాధించిన సానియా.. వేర్వేరు భాగస్వాములతో మూడు మిక్స్‌డ్ డబుల్స్, మూడు మహిళల డబుల్స్ గ్రాండ్ స్లామ్ టైటిల్స్ గెలుచుకొంది. 2016 రియో ఒలింపిక్స్ మిక్సిడ్ డబుల్స్‌లో రోహన్ బొపన్నతో జంటగా కాంస్య పతకం పోరులో విఫలం కావటం సానియాకు తీవ్రనిరాశను మిగిల్చింది.

**అవార్డులు- రివార్డులు**

సానియాను భారత ప్రభుత్వం పలు పురస్కారాలతో సత్కరించింది. 2004లో అర్జున, 2006లో పద్మశ్రీ, 2015లో దేశ అత్యున్నత క్రీడాపురస్కారం రాజీవ్ గాంధీ ఖేల్ రత్న అవార్డు, 2016లో పద్మభూషణ్ పురస్కారాలు అందుకొంది. 2015లో బీబీసీ స్ఫూర్తిదాయక మహిళ అవార్డు సైతం సానియాకు దక్కింది.

**మెల్బోర్న్ వేదికగా..**

మెల్బోర్న్ వేదికగా జరిగిన 2023 ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో 42 సంవత్సరాల రోహన్, 36 ఏళ్ల సానియా జోడీ పోటీకి దిగారు. లేటు వయసులో ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్స్ చేరిన భారతజోడీగా రికార్డుల్లో చోటు సంపాదించారు. సానియా రన్నరప్ ట్రోఫీతో గ్రాండ్ స్లామ్ కెరియర్‌ను ముగించింది. తనకు 14 ఏళ్లు ఉన్న సమయంలో 20 సంవత్సరాల రోహన్‌తో కలసి తొలిసారిగా మిక్స్‌డ్ డబుల్స్ పోరుకు దిగిన సానియా.. ఇప్పుడు 36 సంవత్సరాల వయసులో.. 42 సంవత్సరాల రోహన్‌తో కలసి తన కెరియర్ ఆఖరి టోర్నీలో పాల్గొనటం, ఫైనల్స్ వరకూ రావటం, తన కుమారుడు ఇజాన్ మీర్జా చూస్తుండగా.. ఓ గ్రాండ్ స్లామ్ టోర్నీ ఫైనల్స్ ఆడటం, రన్నరప్ ట్రోఫీ అందుకోవటం కలకాలం గుర్తుండి పోతాయని పొంగి పోతూ చెప్పింది. గత 20 సంవత్సరాలుగా తాను టెన్నిస్ కెరియర్‌ను కొనసాగించి శారీరకంగా, మానసికంగా అలసి పోయానని, దుబాయ్ వేదికగా ముగిసిన టోర్నీ ద్వారా వీడ్కోలు తీసుకోడం గర్వకారణమని ప్రకటించింది.

**43 టైటిల్స్‌తో రికార్డు**

2009లో మహేశ్ భూపతితో జంటగా ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ ట్రోఫీ అందుకున్నానని, అదే తన కెరియర్‌లో తొలిగ్రాండ్ స్లామ్ ట్రోఫీ అని గుర్తు చేసుకొంది. మహిళల టెన్నిస్ సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాలలో సానియా మొత్తం 43 టైటిల్స్ సాధిస్తే, అందులో గ్రాండ్ స్లామ్ ట్రోఫీలే అరడజను ఉండటం విశేషం. టెన్నిస్ క్రీడాకారిణిగా తన కెరియర్‌లో విజయాలతో పాటు 100 కోట్ల రూపాయల వరకూ సంపాదించిన సానియా ప్రస్తుతం హైదరాబాద్‌లో తన పేరుతోనే ఓ టెన్నిస్ అకాడమీని నిర్వహిస్తోంది. మహిళా ఐపీఎల్‌లో బెంగళూరు రాయల్ చాలెంజర్స్ జట్టుకు మెంటార్‌గా సేవలు అందించనుంది. భారత మహిళా టెన్నిస్‌లోకి సానియా లాంటి మరో అసాధారణ క్రీడాకారిణి రావాలంటే ఎంతకాలం వేచిచూడాలో మరి! ★



క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

# లిక్కర్ స్కామ్‌లో తదుప

**బీఆర్ఎస్ వర్గాల్లో ఇంతకు ముందెన్నడూ లేని స్థాయిలో ఉత్కంఠ నెలకొంది. ఏ క్షణంలో ఏం జరుగుతుందో అన్న భయం వెంటాడుతోంది. ఎప్పుడు ఏ వైపు నుంచి ఏ దర్యాప్తు సంస్థ వస్తుందో, ఎవరికి నోటీసులు ఇస్తారో, ఎవరిని అరెస్టు చేస్తారో అన్న చర్చ కొనసాగుతోంది. ఈ పరిణామాలు ఎవరినీ స్థిమితంగా ఉండనీయడం లేదు. తెలుగు రాష్ట్రాల్లో ప్రకంపనలు పుట్టిస్తోన్న ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసుకు సంబంధించి ఈ పరిస్థితి నెలకొంది.**



మనీష్ సిసోడియా

ఢిల్లీ మద్యం స్కామ్ కేసులో ఫిబ్రవరి 26న కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎవరూ ఊహించని అనూహ్య ఘటన జరిగింది. ఏకంగా ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాను సీబీఐ అరెస్ట్ చేసింది. ఆమ్ ఆద్మీ పార్టీలో సిసోడియా ముఖ్యనేత. అంతేకాదు, ప్రభుత్వంలోనూ ఆయనది కీలక పాత్ర. సీఎం అరవింద్ కేజ్రీవాల్ తర్వాత స్థానం ఆయనదే. అయితే, సీబీఐ మాత్రం ఇవేవీ పరిగణనలోకి తీసుకోలేదు. ఏమాత్రం ఆలోచించ లేదు. మనీష్ సిసోడియాను అరెస్ట్ చేసినట్లు ప్రకటించింది.

సిసోడియా అరెస్ట్ అయితే.. తెలంగాణలో ప్రభుత్వ పెద్దలకు భయమెందుకన్న ఆలోచన సహజమే. కానీ, లిక్కర్ స్కామ్‌కు సంబంధించి ఢిల్లీలో తీగలాగితే డొంకలన్నీ తెలంగాణలోనే కదులుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కూ లింకులు బయట పడ్డాయి. ఇప్పటివరకు ఈ కేసులో తెలుగు రాష్ట్రాలకు చెందిన వాళ్లే ఐదుగురు అరెస్టయ్యారు. అంతేకాదు, అసలు ఈ స్కామ్‌కి సంబంధించిన వ్యవహారమంతా తెలంగాణ నుంచే జరిగిందన్నది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ చెబుతున్నాయి. ఇప్పటిదాకా ఈ కేసులో దాఖలు చేసిన చార్జిషీట్లు అన్నింటిలో ఈ సంకేతాలు బయట పడ్డాయి. ఇక ఈ కేసు విచారణలో సీబీఐ మరింత దూకుడు పెంచడంతో తర్వాత ఏం జరుగుతుందో! అని బీఆర్ఎస్ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. స్కామ్‌కు కేంద్ర బిందువుగా చెబుతోన్న సౌత్ లాబీని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కుమారుడు మాగుంట రాఘవ నడిపించారని మొదటి నుంచి ప్రచారం జరుగుతోంది. ఈ స్కామ్‌లో ఇప్పటివరకు 12 మందిని దర్యాప్తు సంస్థలు అరెస్ట్ చేశాయి. గతంలో ఎమ్మెల్సీ కవితను ఈ స్కామ్‌లో సాక్షిగా సీబీఐ విచారించింది. కేసులో నిందితులుగా పేర్కొంటున్న వారి రిమాండ్ రిపోర్టులు, దాఖలు చేసిన చార్జ్‌షీట్లలో కవిత పేరు ప్రస్తావించారు. స్కామ్ సమయంలో కవిత పలు ఫోన్లను ధ్వంసం చేశారని ఈడీ తన చార్జ్‌షీట్‌లో వెల్లడించింది. ఆప్ నేత విజయ్ నాయర్ ద్వారా సౌత్ లాబీ సిసోడియాకు వంద కోట్ల ముడుపులు చెల్లించిందన్న ఆరోపణలున్నాయి.

ఈ కేసులో మొదటగా మద్యం వ్యాపారులను అరెస్టు చేశారు. ఆ తర్వాత వారికి సహకరించిన వారినీ అరెస్టు చేశారు. ఆడిటర్లను, ఢిల్లీ ఎక్సైజ్ అధికారులను కూడా అరెస్టు చేశారు. చార్జిషీట్లలో ఇప్పటి వరకూ 15 మంది పేర్లను పేర్కొంటే.. వారిలో మెజారిటీ నిందితులు ఇప్పటికే అరెస్టయ్యారు. తాజాగా మనీశ్ సిసోడియాను అరెస్టు చేశారు. విచిత్రం ఏమిటంటే.. ఆయన పేరు చార్జిషీట్లలో ఎక్కడా లేదు. అయినా.. విచారణ పేరిట ఆయనకు నోటీసులు జారీచేసి పిలిచిన సీబీఐ.. తమకు సహకరించడం లేదంటూ అరెస్టు చేసింది. మరి, కేంద్ర దర్యాప్తు సంస్థల తదుపరి లక్ష్యం ఎవరన్నది ఇప్పుడు ప్రతి ఒక్కరిలోనూ ఆసక్తి రేకెత్తిస్తున్న మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. అయితే, ఇప్పటిదాకా ఢిల్లీ మద్యం వ్యవహారంలో ఎవరిపై చార్జిషీటు దాఖలు చేసినా అందులో తప్పనిసరిగా సౌత్ గ్రూప్ తరఫున ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేరును ప్రస్తావించాయి దర్యాప్తు సంస్థలు. ఇక, ఈ కేసులో ప్రధాన నిందితుడైన సమీర్ మహేంద్రుపై ఢిల్లీలోని సీబీఐ ప్రత్యేక కోర్టు దాఖలు చేసిన చార్జ్‌షీట్ బీఆర్ఎస్ నేతలకు వణుకు పుట్టిస్తోంది. 181 పేజీలతో దాఖలు చేసిన ఈ చార్జ్‌షీట్‌లో ఎమ్మెల్సీ కవిత పేరును 28సార్లు ప్రస్తావించారు. అసలు ఈ స్కామ్‌ని తెరవెనక ఉండి నడిపించింది కవితే అనీ.. తెరపైన ఉన్నది సమీర్ మహేంద్రు అని ఈడీ మొదటినుంచీ వాదిస్తోంది.

ఈ పరిణామాల నేపథ్యంలో దర్యాప్తు సంస్థల

ఈ కేసులో మొదటగా మద్యం వ్యాపారులను అరెస్టు చేశారు. ఆ తర్వాత వారికి సహకరించిన వారినీ అరెస్టు చేశారు. ఆడిటర్లను, ఢిల్లీ ఎక్సైజ్ అధికారులను కూడా అరెస్టు చేశారు. చార్జిషీట్లలో ఇప్పటి వరకూ 15 మంది పేర్లను పేర్కొంటే.. వారిలో మెజారిటీ నిందితులు ఇప్పటికే అరెస్టయ్యారు. తాజాగా మనీశ్ సిసోడియాను అరెస్టు చేశారు. విచిత్రం ఏమిటంటే.. ఆయన పేరు చార్జిషీట్లలో ఎక్కడా లేదు. అయినా.. విచారణ పేరిట ఆయనకు నోటీసులు జారీచేసి పిలిచిన సీబీఐ.. తమకు సహకరించడం లేదంటూ అరెస్టు చేసింది.

సుజాత గోపగోని, 6302164068

# ...రి అరెస్ట్..?



కవిత

తదుపరి లక్ష్యం తెలంగాణ సీఎం కేసీఆర్ కూతురు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితేనా? అనే ఉత్కంఠ నెలకొంది. ఇదే కేసులో రాబిన్ డిస్టిలరీస్ డైరెక్టర్ అభిషేక్ బోయిన్‌పల్లిని అరెస్టు చేశారు. ఆయనకు, కవిత కుటుంబంతో బంధుత్వం ఉందనే ప్రచారం జరిగింది. ఆ తర్వాత హైదరాబాద్‌కే చెందిన రాబిన్ డిస్టిలరీస్ మరో డైరెక్టర్ అరుణ్ రామచంద్ర పిళ్లైని అరెస్టు చేశారు. సమీర్ మహేంద్రుకు చెందిన ఇండో స్పిరిట్స్ కంపెనీలో ఆయన ద్వారానే కవిత పెట్టుబడులు పెట్టారంటూ చార్జిషీట్‌లోనూ పేర్కొన్నారు. కవిత వద్ద గతంలో ఆడిటర్‌గా పనిచేసిన బుచ్చిబాబును ఇటీవలే అరెస్టు చేశారు. తెలుగు రాష్ట్రాలకే చెందిన అరబిందో ఫార్మా కంపెనీ ఎండీ శరత్ చంద్రారెడ్డి, వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కుమారుడు రాఘవరెడ్డి, ముత్తా గౌతమ్ తదితరులనూ అరెస్టు చేశారు. ఆ సందర్భంగా దాఖలు చేసిన చార్జిషీట్లలోనూ కవిత పేరును ప్రస్తావించారు. మాగుంట రాఘవరెడ్డితో కలిసి కవిత ఢిల్లీలో మద్యం వ్యాపారం చేసినట్లు ఈడీ అధికారులు పేర్కొన్నారు. శ్రీనివాసులురెడ్డి, రాఘవరెడ్డి, కవిత, శరత్‌చంద్రారెడ్డిలతో కూడిన సౌత్ గ్రూప్ ద్వారా వంద కోట్ల రూపాయల ముడుపులను ఆమ్ ఆద్మీ పార్టీ నేతల తరఫున విజయ్ నాయర్ స్వీకరించారని ఈడీ తెలిపింది. ఈ గ్రూపునకు అభిషేక్ బోయిన్‌పల్లి, అరుణ్ రామచంద్ర పిళ్లై, బుచ్చిబాబు ప్రాతినిధ్యం వహించారని వివరించింది. రాజకీయ నాయకులు తమ పేర్లను బయటకు రాకుండా ఉంచడానికి బినామీలను ప్రయోగించారని స్పష్టంచేసింది. సౌత్ గ్రూప్‌లోని అందరినీ సీబీఐ, ఈడీ అరెస్టు చేశాయి. తాజాగా, చార్జిషీట్లలో ఎక్కడా పేరు లేని సిసోడియాను కూడా సీబీఐ అరెస్టు చేసింది. వరుస అరెస్టుల నేపథ్యంలో కవిత అంశం మరోసారి చర్చనీయాంశమైంది. ఈ కేసులో సాక్షిగా కవితకు 160 సీఆర్‌పీసీ కింద డిసెంబరులో సీబీఐ అధికారులు నోటీసులిచ్చి.. బంజారాహిల్స్‌లోని ఆమె నివాసంలోనే 7 గంటలకుపైగా విచారించారు. అవసరమైతే మరోసారి విచారిస్తామని అప్పట్లోనే చెప్పారు. కానీ, ఇప్పటివరకు కవితను మళ్లీ ప్రశ్నించలేదు. తాజా పరిణామాల నేపథ్యంలో త్వరలోనే మరోసారి నోటీసులిచ్చే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు తెలిపాయి. ఈసారి నేరుగా ఢిల్లీకి పిలిపించి ప్రశ్నించనున్నట్లు తెలుస్తోంది. గతంలో ఆమె ఇచ్చిన సమాచారం, అంతకుముందు, ఆ తర్వాత అరెస్టు చేసిన వారు ఇచ్చిన వివరాలు, దర్యాప్తులో లభించిన సమాచారం ఆధారంగా కవితను ప్రశ్నించనున్నట్లు తెలిపాయి. విచారణ అనంతరం సీబీఐ అధికారులు అవసరమైతే కవితను అరెస్ట్ చేసే అవకాశం లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. వెరసి, ఢిల్లీ మద్యం కేసులో జరుగుతున్న వరుస పరిణామాలు కవితకు ఇబ్బందికరంగానే మారాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**తీగ లాగితే..**

ఈ కేసు దర్యాప్తులో మొదటినుంచీ ఊహించని పరిణామాలు చోటు చేసుకున్నాయి. మనీశ్ సిసోడియాను సీబీఐ అరెస్టు చేయడం దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో అక్రమాలు జరిగాయని వెల్లువెత్తిన ఆరోపణలపై మనీశ్ సిసోడియాతో పాటు పలువురు అధికారులు, ప్రైవేటు వ్యక్తులపై గత ఏడాది ఆగస్ట్ 19న సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ స్కామ్‌లో కోట్లాది రూపాయలు చేతులు మారాయని ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ లోతుగా దర్యాప్తు చేసింది. ఢిల్లీ ప్రభుత్వం ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న లిక్కర్ పాలసీ అక్రమ సంపాదనకు ఊతమిచ్చిందనే ఆరోపణలు వెల్లు వెత్తాయి. కోట్లాది రూపాయలు ముడుపుల రూపంలో చేతులు మారాయనే ఆరోపణలు ప్రభుత్వాన్ని ఉక్కిరి బిక్కిరి చేశాయి. ఢిల్లీ లిక్కర్ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేయాలని లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా ఆదేశాలతో ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ అధికారులు రంగంలోకి దిగిన దగ్గర నుంచి సిసోడియా అరెస్టు వరకు ప్రతీది సంచల నంగా మారింది.

ఢిల్లీ లిక్కర్ పాలసీలో భాగంగా మద్యం దుకాణాల కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయని.. నిబంధనలకు విరుద్ధంగా గుత్తాధిపత్యం కనిపించిందన్న ఆరోపణలున్నాయి. మద్యం పాలసీలో మార్పులు చేస్తూ ప్రభుత్వానికి సిసోడియా 145 కోట్ల రూపాయల నష్టం కలిగించారని.. మద్యం వ్యాపారులు ప్రభుత్వానికి కట్టాల్సిన రూ. 145 కోట్లను కొవిడ్ పేరుతో ఏకపక్షంగా ఆప్ ప్రభుత్వం మాఫీ చేసిందన్న ఆరోపణలున్నాయి. ఇక సిసోడియా అనుచరుడు దినేశ్ అరోరా కంపెనీకి ఒక మద్యం వ్యాపారి కోటి రూపాయలు తరలించినట్లు సీబీఐ ఎప్పుడో గుర్తించింది. రిటైల్ వెండర్లకు క్రెడిట్ నోట్లు జారీచేయడం ద్వారా లంచాలు ఇచ్చినట్లు గుర్తించింది. కవిత, మాగుంట రాఘవ్, శరత్‌రెడ్డి నిర్వహిస్తున్న సౌత్‌గ్రూప్.. ఈ స్కామ్‌లో కీలకంగా ఉందని దినేశ్ అరోరా విచారణలో సందర్భంలోనే చెప్పిన విషయాన్ని ఈడీ ప్రస్తావించింది.

**వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్**



# బాల జాగృతి

## తెలుసుకుందాం

## వీరభద్రస్వామి ఆలయం - కురవి

తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా, కురవి గ్రామంలో ఈ దేవాలయం కొలువుదీరింది. సకల శక్తిమూర్తి, వరప్రదాత అయిన వీరభద్రస్వామి ఇక్కడ భద్రకాళి సమేతంగా కొలువై ఉన్నారు. తొలి కాకతీయ రాజైన ఒకటో బేతరాజు ఈ ఆలయాన్ని పునరుద్ధరించారు. ఈ ఆలయంలో శిల్పకళ ఉట్టిపడుతోంది. గర్భగుడిలో మూలవిరాట్ వీరభద్రస్వామి త్రినేత్రుడై దశహస్తాలతో రౌద్రరూపంగా ఉండటం విశేషం. ప్రతియేటా మహాశివరాత్రి నాడు జాతర ప్రారంభమై ఉగాదికి ముగుస్తుంది. దీనిని మేడారం తర్వాత అతిపెద్ద జాతరగా పిలుస్తారు.



## కథ | ఆకలి

భువనగిరి రాజ్యాన్ని పాలించే సుదర్శనుడి వద్ద రామశర్మ అనే తెలివైన మంత్రి ఉండేవాడు. అతనికి భూతదయ కూడా ఎక్కువే.

మంత్రి గురించి ఎవరు పొగిడినా రాజు మనసులో ఈర్ష్య పడేవాడు. అనికంటే తెలివైన వాడినని, తనకే భూతదయ ఎక్కువగా ఉందని జనం చేత అనిపించుకోవాలనే కోరిక రాజుకు బలంగా ఉండేది.

ఒకనాడు ఉదయమే రాజుగారు మంత్రికి కబురు చేశాడు, వేటకు వెళదామని. మంత్రి గుర్రం మీద రాగా 'ఇద్దరికి ఒక గుర్రం చాలు. నీ గుర్రాన్ని ఇక్కడే కట్టేయి' అన్నాడు రాజు.

మంత్రి రాజు వెనకే గుర్రం ఎక్కాడు. ఇద్దరి బరువు మోస్తూ పరుగెత్తడమంటే గుర్రానికి శక్తికి మించిన పని. అయినా ఎదురు చెపితే ఏమనుకుంటాడోనని మంత్రి మాట్లాడలేదు.

మధ్యాహ్నం వరకూ అడవిలో జంతువుల్ని వేటాడాక ఇద్దరూ ఒక చెట్టుకింద కూర్చున్నారు అలసటతో. గుర్రం దూరంగా ఉంది. అదీ అలసట తీర్చుకుంటున్నట్లు గసపోయసాగింది.

'మంత్రి! నాకు జంతువులంటే చాలా ప్రేమ. ఇప్పుడు చూడు గుర్రాన్ని పిలవగానే నా దగ్గరికే వస్తుంది. నేను ఈ చెట్టు దగ్గర ఉంటాను. నువ్వు ఆ చెట్టు దగ్గర నిలబడు.' అన్నాడు రాజు.

మంత్రి 'తప్పుతుందా' అనుకుని లేచి కాస్త



## పద్యం

**ఎడ్డెమనుష్యు(డేమెఱు(గు నెన్ని దినంబులు గూడియుండినన్**
**దొడ్డ గుణాఢ్యునందు(గల తోరపు వర్తనల(బ్రజ్ఞ బే**
**ర్పడ్డ వివేకి రీతి; రుచిపాకము నాలుక గాకెఱుంగనే?**
**తెడ్డది కూరలో(గలయ ద్రిమ్మరుచుండినైన భాస్కరా!**

**భావం :** భాస్కరా! మూఢాత్ముడు గుణవంతుని వెంట తిరుగుచున్ననూ అతని సద్గుణములతో కూడిన నడవడికలు గుర్తించలేడు. జ్ఞాని గుర్తించగలడు. ఎలాగనగా కూరలో తిరుగుచున్న తెడ్డు ఆ రుచిని గుర్తించలేదు. కూర రుచి నాలుక గుర్తించును.

## సూక్తిరత్నం

**'అవశ్యమనుభోక్తవ్యం...'**

**'అవశ్యమనుభోక్తవ్యం**
**కృతం కర్మ శుభాశుభమ్**
**నా భుక్తం క్షీయతే కర్మ**
**కల్పకోటి శతైరపి'**

**భావం :** మనుషులు చేసే పనులలో మంచిచెడులు ఉండవచ్చు. వాటి ఫలితాలను అనుభవించవలసిందే. ఎన్ని యుగాలైనా వాటి నుంచి తప్పించుకోజాలరు.

## జత పరచండి


ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| సైకిల్ | బి. మాన్‌ఫ్రిడి |
| టెలిగ్రాఫ్ | ఎం. లామండ్ |
| టెలివిజన్ | జాన్ షెఫర్డ్ బారన్ |
| వాచ్ | జె.ఎల్. బయర్డ్ |
| ఏటీఎం | మెక్‌మిలన్ |

**జవాబులు :** సైకిల్-మెక్‌మిలన్, టెలిగ్రాఫ్-ఎం. లామండ్, టెలివిజన్-జె.ఎల్. బయర్డ్, వాచ్-బి. మాన్‌ఫ్రిడి, ఏటీఎం-జాన్ షెఫర్డ్ బారన్

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### రవిశంకర్ వ్యాస్



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు. రవిశంకర్ మహరాజ్‌గా ప్రసిద్ధి. గుజరాత్‌కు చెందిన ఈయన ఫిబ్రవరి 25, 1884న జన్మించారు. 1915లో స్వాతంత్ర్య సమరంలో చేరారు. గాంధీజీ, వల్లభభాయి పటేల్‌లతో సన్నిహితంగా ఉండేవారు. 1928లో బార్డోలి సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయ్యారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమంల్లోనూ పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. భూదానోద్యమంలో వినోబా భావేతో కలిసి 6000 కిలోమీటర్లు ప్రయాణించారు. జూలై 1, 1984న గుజరాత్‌లోని బోర్సాడ్‌లో మరణించారు.

## జనరల్ నాలెడ్జ్

1. ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడిగా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?
2. కన్హా జాతీయ పార్క్ ఏ రాష్ట్రంలో ఉంది?
3. ఇటీవల కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన 'శ్రీఅన్న' పథకం దేనికి సంబంధించినది?

సమాధానాలు :1. అజయ్ బంగా; 2. మధ్యప్రదేశ్; 3. చిరుధాన్యాలు



ఎడంగా ఉన్న చెట్టు దగ్గరకు వెళ్లాడు.

రాజు ఈల కొట్టగానే గుర్రం కదిలింది. పరుగెత్తుకుంటూ వస్తూనే ఇద్దరినీ మార్చి చూసింది.

అది నేరుగా మంత్రి దగ్గరికి వెళ్లి చేతిలోని పచ్చిగడ్డి నోటితో అందుకొని తినసాగింది.

'జంతువులకైనా, మనుషులకైనా ఎదుటి వారు చూపించే ప్రేమకన్నా, వారి వారి అవసరాలకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. గుర్రం ఉదయం నుంచీ పరుగుత్తి.. పరుగెత్తి.. చాలా ఆకలితో ఉంది మహరాజా' అన్నాడు మంత్రి.

'ఎంతైనా నీ తెలివితేటలు అమోఘం మంత్రివర్యా!' అన్నాడు రాజు మెచ్చుకుంటూ.. ★

## మెదడుకు మేత

అంగుళం ఆకు,
అడుగున్నర కాయ?

జవాబు : మునక్కాయ

## మంచిమాట

ఔన్నత్యమంటే
కోరికలను
చంపుకోవడం కాదు,
వాటిని అదుపులో
ఉంచుకోవడం.



# వారఫలాలు

06-12 మార్చి 2023




సింహంభట్ల సుబ్బారావు

6300674054


**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

అద్భుతాలు జరుగుతాయి. ఆశించిన రాబడి సమకూరి అవసరాలు తీరతాయి. వివాహ, ఉద్యోగయత్నాలు అనుకూలం. వాహనయోగం. ఇంటి నిర్మాణ యత్నాలు ముమ్మరం చేస్తారు. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు పదోన్నతులు రావచ్చు. రాజకీయవర్గాలకు కొత్త పదవులు. 6,7 తేదీల్లో ఆరోగ్య, కుటుంబ సమస్యలు. మానసిక అశాంతి. కనకదుర్గాదేవి స్తోత్రం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

నిరుద్యోగుల కృషి ఫలించే సమయం. అదనపు రాబడి దక్కుతుంది. ఇంట్లో శుభకార్యాలు. పుణ్య క్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారులకు పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగులకు హోదాలు మరింత పెరుగుతాయి. కళాకారులకు పురస్కారాలు, సన్మానాలు. సాంకేతిక నిపుణులు, రచయితలు అనుకున్న లక్ష్యాలు సాధిస్తారు. 8, 9 తేదీల్లో ఖర్చులు. ఆస్తి వివాదాలు. గణేశాష్టకం పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

ఆదాయం అంతంత మాత్రం. తరచూ ప్రయాణాలు. ముఖ్య కార్యక్రమాలు మొదట్లో మందగించినా ఎట్టకేలకు పూర్తిచేస్తారు. దేవాలయాలు సందర్శిస్తారు. విలువైన సామగ్రి కొంటారు. వ్యాపారులు ఒడిదుడుకుల నుంచి బయట పడతారు. ఉద్యోగులకు శుభవార్తలు. రచయితలు, మేధావులు సత్తా చాటతారు. 10, 11 తేదీల్లో ఆస్తి వివాదాలు. అనుకోని ఖర్చులు. రాఘవేంద్ర స్తోత్రం పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి. దూరప్రాంతాల నుంచి అందిన సమాచారం గందర గోళం పెట్టవచ్చు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. మీ నిర్ణయాల కోసం కుటుంబ సభ్యులు ఎదురు చూస్తారు. అయినా తొందరపాటు వద్దు. తరచూ ప్రయాణాలు. దేవాలయాల సందర్శనం. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు తప్పవు. 8,9 తేదీల్లో శుభవార్తలు. వాహనయోగం. హనుమాన్ ఛాలీసా పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

కొత్త కార్యక్రమాలు చేపడతారు. భూ, గృహ యోగాలు కలిగే సూచనలు. మీ నిర్ణయాలను అందరూ హర్షిస్తారు. వ్యాపారులకు మరింత అనుకూల స్థితి. ఉద్యోగులకు ఉన్నత శ్రేణి నుంచి ప్రశంసలు అందుతాయి. కళాకారులకు అవార్డులు. పరిశోధకులు, క్రీడాకారులు సత్తా చాటుకుంటారు. 11,12 తేదీల్లో దూరప్రయాణాలు. వృథా ఖర్చులు. శారీరక రుగ్మతలు. దక్షిణామూర్తి స్తోత్రం పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

కార్యక్రమాలు విజయవంతంగా సాగుతాయి. దేవాలయ దర్శనాలు. రాబడి పెరిగి అప్పులు తీరే మార్గం ఏర్పడుతుంది. విద్యార్థులు ప్రతిభను నిరూపించుకుంటారు. ఇంట్లో శుభకార్యాలు నిర్వహిస్తారు. వ్యాపారులకు ఊహించని లాభాలు. ఉద్యోగులకు విధి నిర్వహణలో ఆటంకాలు తొలగు తాయి. 6,7 తేదీలలో దూరప్రయాణాలు. ఆరోగ్య సమస్యలు. ఖర్చులు అధికం. ఆదిత్య హృదయం పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

కొత్త ఉద్యోగ యత్నాలు అనుకూలిస్తాయి. మీ ఆశయాలు నెరవేరే సమయం. కుటుంబంలో శుభకార్యాలపై సంప్రదింపులు. వ్యాపారులకు కొత్త పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగులకు విధి నిర్వహణలో చికాకులు తొలగుతాయి. కళాకారులకు సన్మానాలు. పరిశోధకులు, క్రీడాకారులకు అరుదైన పురస్కారాలు. 10, 11 తేదీలలో వివాదాలు. శారీరక రుగ్మతలు. సుబ్రహ్మణ్యేశ్వరుని పూజించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ఆదాయం ఆశించినంతగా సమకూరుతుంది. దీర్ఘకాలికంగా వేధిస్తున్న కొన్ని సమస్యల నుంచి గట్టెక్కుతారు. చర, స్థిరాస్తుల వృద్ధి. విద్యార్థుల నైపుణ్యానికి గుర్తింపు. గృహం, వాహనాలు కొంటారు. వ్యాపారులు చిక్కులు అధిగమిస్తారు. ఉద్యోగులకు ఉన్నత పోస్టులు రావచ్చు. కళాకారులు, క్రీడా కారులకు అవార్డులు. 8, 9 తేదీల్లో వృథా ఖర్చులు. శారీరక రుగ్మతలు. అంగారక స్తోత్రం పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

ముఖ్యమైన కార్యక్రమాలు కొంత నిదానించినా సమయానికి పూర్తిచేస్తారు. ఇళ్లు, వాహనాలు సమ కూర్చుకుంటారు. మీ పట్ల బంధువులు ప్రేమాను రాగాలు చూపుతారు. విద్యార్థులు ప్రతిభను చాటు కుంటారు. వ్యాపారులకు క్రమేపీ అనుకూల పరిస్థి తులు. ఉద్యోగులకు విధి నిర్వహణలో ఆటంకాలు తొలగుతాయి. 11,12 తేదీలలో అనారోగ్యం. ఆకస్మిక ప్రయాణాలు. దేవీఖడ్గమాల పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

కష్టానికి తగిన ఫలితం. ఆర్థిక ఇబ్బందులు తీరి ఊరటచెందుతారు. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు. తీర్థయాత్రలు చేస్తారు. వ్యాపారులు ఆశించిన లాభాలు. ఉద్యోగులకు అరుదైన అవ కాశాలు. పారిశ్రామిక, రాజకీయవేత్తలకు అంచ నాలు నిజమవుతాయి. క్రీడా కారులు నైపుణ్యాన్ని చాటుకుంటారు. 7,8 తేదీల్లో వృథా ఖర్చులు. విష్ణుసహస్రనామ పారాయణం పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

శుభవార్తా శ్రవణం. అనుకున్న పనులు పూర్తిచేసే వరకూ విశ్రమించరు. కోర్టు వ్యవహారాల్లో అనుకూలత. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వాహనాలు, భూముల కొనుగోలులో ప్రతిబంధకాలు తొలగుతాయి. ఉద్యోగులకు ఉన్నత పోస్టులు రావొచ్చు. రచయితలు, పరిశోధకులు ప్రత్యేకతను నిలుపుకుంటారు. 9, 10 తేదీలలో వృథా ఖర్చులు. ఆరోగ్య సమస్యలు. నవగ్రహ స్తోత్రాలు పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

యత్నకార్యసిద్ధి. ఆదాయం పెరుగుతుంది. దీర్ఘకాలిక రుణబాధలు తొలగుతాయి. నిరు ద్యోగులకు ఉద్యోగయోగం. మీ నిర్ణయాలు కుటుంబ సభ్యుల్ని మెప్పిస్తాయి. సంఘంలో గౌరవం పొందు తారు. వాహన యోగం. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు ప్రోత్సాహకరం. రాజకీయ వర్గాలకు పదవీయోగం. క్రీడాకారులు, సాంకేతిక నిపుణులకు విశేష గుర్తింపు. 10, 11 తేదీల్లో ఖర్చులు. శారీరక రుగ్మతలు. లక్ష్మీస్తుతి మంచిది. ★

# పదరసం-406

## ఆధారాలు

**అడ్డం**

1. 'హోలీ... రంగ హోలీ..... పాట పల్లవిలో తరువాత (7)
6. ముండ్లమండ (2)
7. స్త్రీ – కథాకన్న పెద్దది చివర దీర్ఘంతో (3)
9. సమయాన్ని కొలిచేది (4)
11. జిడ్డు నూనె ఆ సంతోషం!?(4)
12. విభీషణుని కూతురు (3)
14. భూమి (3)
19. స్త్రీలు (4)
20. కుదించిన తనివి స్త్రీ (2)
21. మెఱుపులు (5)
22. ద్వారబంధము (3)
24. ఈ పిట్టకూత అపశకునంగా భావిస్తారు (3)
25. మునుపు పెన్నులో పోసుకుని రాయాల్సి వచ్చేది
27. అసహ్యము, ఉపద్రవము (3)
29. రుద్రుని పిలవండి (2)
30. దీనికే రాముడు కట్టుబడ్డాడు అంటారు (3)

**నిలువు :**

1. లక్ష్మి, నిలకడలేనిది (3)
2. జెండా, ధ్వజము (3)
3. లక్ష్మికి వికృతి
4. లయించినది, కలిసిపోయిన (3)
5. గాయముపై పూయు లేపనము (3)
6. అస్థిపంజరం (3)
8. మోము, ముఖము (3)
10. బహుజనసమాజ్‌పార్టీ అధినేత్రి (4)
11. క్రీడ (2)
13. ఆటలో ఒకవైపు ఆడేందుకు ఏర్పడిన బృందం (2)
15. హోలీకి పరస్పరం చల్లుకునేవి (3)
16. బ్రహ్మ (3)
17. మార్చి 8 మహిళాదినోత్సవం జరుపుకునే స్థాయి (5)
18. దూషిక, నేత్ర మలము (4)
19. మగతనములో రెలిజియన్ (3)
21. తరువులు ఆద్యంతాలు (2)
22. తరువు చెల్లాచెదురు
23. ధ్వని (2)
26. శ్రీకృష్ణుని ప్రేయసి (2)
27. నెత్తురు తోడిది పేర్కొనేది (2)
28. యుద్ధం (2)

మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 | | 2 | | 3 | | 4 | ✠ | 5 |
| 6 | | ✠ | | ✠ | | ✠ | 7 | 8 | |
| 9 | | 10 | | ✠ | ✠ | 11 | | | |
| | ✠ | | ✠ | 12 | 13 | | ✠ | | ✠ |
| ✠ | 14 | | | ✠ | | ✠ | 15 | ✠ | 16 |
| 17 | ✠ | | ✠ | 18 | ✠ | 19 | | | |
| 20 | | ✠ | 21 | | | | | ✠ | |
| | ✠ | 22 | | | ✠ | | ✠ | 23 | ✠ |
| 24 | | | ✠ | 25 | 26 | ✠ | 27 | | 28 |
| | ✠ | 29 | | ✠ | 30 | ర్మ | | ✠ | |

పదరసం – 406

పేరు : ..............................................................................

చిరునామా:..............................................................................

..............................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ................................................

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2023 మార్చి 20 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 402 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 మా | 2 ఘ | మా | 3 సం | ✠ | 4 గో | 5 దా | వ | 6 రి |
| 7 ఘం | ✠ | టం | ✠ | బ | ✠ | ✠ | సి | ✠ | క్త |
| 8 ట | పా | ✠ | 9 అ | ర | కొ | 10 ర | ✠ | 11 ఊ | హ |
| సా | ✠ | 12 ప | ✠ | ము | ✠ | 13 మ | బ్బు | ✠ | స్తం |
| 14 ల | 15 హ | రి | ✠ | ✠ | ✠ | ణ | ✠ | 16 కో | ✠ |
| ✠ | 17 యం | మ | గో | ✠ | 18 దో | మ | ✠ | 19 పం | 20 పా |
| 21 నె | ✠ | ళం | ✠ | ✠ | ✠ | 22 హ | స్తి | ✠ | ను |
| 23 ల | జ్జ | ✠ | 24 వా | క | 25 ము | ల్షి | ✠ | 26 యా | గం |
| వం | ✠ | 27 శ | ✠ | ✠ | స్రా | ✠ | 28 లా | ✠ | టి |
| 29 క | థా | ని | క | ✠ | 30 బు | ధ | వా | రం | ✠ |

**విజేతలు:** వి.పద్మారంగనాథ్, పి.శాంతకుమారి, వి.బాబు, రాయవరపు శేషు, సోమశ్రీపాద, గుండ్లపల్లి సత్యంగౌడ్, రుద్రభట్ల సుగుణరాజారాం, కె.పాండు రంగాచారి, కె.ప్రభావతీదేవి, జి. ప్రవీణ్‌సాయి, డా. బి. ధన్వంతరి, వెల్లాల ఉమామహేశ్వరరావు, వై.వి.రమణమూర్తి, ఆర్. కౌముది, వారణాసి సరస్వతి, టిఎస్ఆర్. ఆంజనేయులు, కె.వి.ఆర్.మూర్తి, మణిమాల ప్రభు, మంత్రిప్రగడా శ్రీహరి రావు, చింతకుంట దేవలక్ష్మి, పప్పిరెడ్డి వీరారెడ్డి, వి.ఆర్. రావు, పలుకూరి సురేష్‌బాబు, ఎ.గాయత్రి, జి. సీతామహలక్ష్మి, మత్స్యరాజ విజయలక్ష్మి, ఆర్.ఆంజనీదేవి, కల్లూరి వెంకటరమణమూర్తి, టి. సుబ్రహ్మణ్యం

**బహుమతి పొందిన విజేత : వి.అనుపమ, వికారాబాద్**

# కనదగిన వినరో భాగ్యము విష్ణు కథ



ఈ మధ్య కాలంలో కుటుంబ సమేతంగా చూడ దగ్గ చిత్రాలు మరీ తక్కువ అయిపోయాయి. పైగా ఓటీటీ వచ్చిన తర్వాత రకరకాల జానర్ మూవీస్ ఎక్కువైపోయాయి. అయితే అందుకు భిన్నంగా నవరసాల సమ్మిళితంగా వచ్చిన చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'. జీఏ 2 బ్యానర్ మీద అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించిన ఈ మూవీతో మురళీ కిశోర్ అబ్బూరు దర్శకుడిగా పరిచయం అయ్యాడు. 'రాజాగారు రాణివారు' మూవీతో హీరోగా టాలీ వుడ్ ఎంట్రీ ఇచ్చిన కిరణ్ అబ్బవరం 'ఎస్.ఆర్. కల్యాణ మండపం'లో నటించి, సక్సెస్ అందుకు న్నాడు. కానీ ఆ తర్వాత వరు సగా మూడు పరాజయాలను తన ఖాతాలో వేసుకున్నాడు. ఇప్పుడీ 'వినరో భాగ్యము విష్ణు కథ'తో మళ్లీ సక్సెస్ ట్రాక్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు.


విష్ణు (కిరణ్ అబ్బవరం) తల్లిదండ్రులది తిరుపతి. తల్లికి ఉన్న నోటి దురుసుతనం వల్ల చుట్టుపక్కల వాళ్లందరూ వీళ్లను దూరం పెడతారు. ఓ సంఘటనలో వాడకట్టులోని అందరికీ చులకన అయిపోవడంతో విష్ణు తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకుంటారు. దాంతో అతన్ని తాతయ్యే ('శుభలేఖ' సుధాకర్) పెంచుతాడు. ఎప్పుడూ నలుగురితో మంచిగా ఉండాలని, చేతనైనంత సాయం చేయాలని అప్పుడే మనిషి జన్మకు సార్థకత అని హితం బోధిస్తాడు. విష్ణు దానినే ఆచరిస్తుంటాడు. అలాంటి విష్ణు జీవితంలోకి యూట్యూబర్ దర్శన (కశ్మీర పర్దేశి) వస్తుంది. ఆమె నైబర్ నంబర్ ఫ్రెండ్ అనే కాన్సెప్ట్‌తో ఇటు విష్ణుకు, అటు శర్మ (మురళీ శర్మ)కు పరిచయం అవుతుంది. ఆమె సెల్ ఫోన్‌కు అటూ ఇటూ నెంబర్స్ వీళ్లిద్దరివీ. దర్శనతో తొలి చూపులోనే ప్రేమలో పడిపోతాడు విష్ణు. అయితే అతని ప్రేమకు కాస్తంత అడ్డంకిగా నిలబడతాడు శర్మ. తీరా చూస్తే శర్మకు దర్శన కుటుంబంతో పాత పరిచయమే ఉంటుంది. కానీ ఆ విషయం వారికి తెలియదు. ఓసారి శర్మ మీద హత్యాయత్నం జరిగినప్పుడు విష్ణు రక్షిస్తాడు. ఆ తర్వాత శర్మ ఊహించని విధంగా చనిపోతాడు. మరో వైపు తిరుపతి కేంద్రంగా టెర్రరిస్టులు ఓ భారీ పథక రచన చేస్తారు. అందుకోసం విదేశాల నుండి 'మాల్' తెప్పిస్తారు. దానిని తిరుపతిలోని కీలకమైన వ్యక్తికి అందించే పని రాజన్ (శరత్ లోహితస్య) స్వీకరిస్తాడు. ఈ విషయం ఎన్.ఐ.ఎ. వర్గాలకు తెలియడంతో రాజన్ కోసం వాళ్లు వల పన్నుతారు. మరి విష్ణు ప్రేమలో విజయం సాధించాడా? శర్మ మర్డర్ వెనక మిస్టరీ ఏమిటీ? టెర్రరిస్టుల కుట్రను విష్ణు సాయంతో ఎన్.ఐ.ఎ. ఎలా వమ్ము చేసింది? అనేది మిగతా కథ.

ఈ మధ్య కాలంలో ఇంత పకడ్బందీ స్క్రీన్ ప్లేతో మరో చిత్రం రాలేదనే చెప్పాలి. పైగా సంక్లిష్టమైన కథను తీసుకుని, దానికి వినోదాన్ని మిళితం చేసి అందించే ప్రయత్నం దర్శకుడు మురళీ చేశాడు. ఓ లవ్ ట్రాక్, దానిలో బోలెడంత వినోదం, మరోవైపు ఆదర్శవంతమైన కథానాయకుడు, అతనికో బాధాకరమైన నేపథ్యం, దేశంలోని పుణ్య క్షేత్రాలను టార్గెట్ చేసే టెర్రరిస్టులు, వారిని అడ్డుకునే ఇంటెలిజెన్స్ అధికారులు, రాజకీయంగా ఎదగడం కోసం కోట్లు కుమ్మరించడానికి సిద్ధంగా ఉండే నేతలు, వారి ఎత్తులను చిత్తు చేసే కుట్రదారులు.. ఇన్ని అంశాలు ఈ కథతో ముడిపడి ఉన్నాయి. కాబట్టి ఇలాంటి ట్విస్ట్స్ అండ్ టర్న్స్ ఉన్న సినిమాలను చూసి ఆస్వాదించాల్సిందే. ప్రతి పావుగంటకూ కథ ఊహించని మలుపు తిరుగుతుంది. హీరో, హీరోయిన్ క్యారెక్టరైజేషన్స్ బాగున్నాయి. ఇక మురళీ శర్మ పాత్ర ప్రథమార్థంలో కాస్తంత కామెడీగా అనిపించినా, థియేటర్‌లో జనం దానిని ఎంజాయ్ చేస్తారు. అయితే ఆ పాజిటివ్ క్యారెక్టర్‌లోని మరో కోణాన్ని మరింత పకడ్బందీగా తెర మీద చూపించాల్సింది. ఠక్కున మరో వేరియేషన్‌కు తిప్పేయడంతో ప్రేక్షకులు జీర్ణించుకోవడం కష్టం. అలానే సినిమా మొత్తాన్ని ఫ్లాష్ బ్యాక్‌లో చూపించడంతో మోనాటనీగా అనిపిస్తుంది. కానీ ఈ మధ్య కాలంలో ఇంత క్లీన్ మూవీ మరొకటి రాలేదు. పైగా సంభాషణలు, పాటలు చాలా బాగున్నాయి. కథానాయకుడి పాత్ర స్వభావాన్ని తెలియచేసే గీతం, అలానే తిరుపతిలోని మనుషుల నైజం తెలిపే పాట మూవీకి హైలైట్. దీనిని కల్యాణ్ చక్రవర్తి త్రిపురనేని చాలా అర్థవంతంగా రాశాడు. వాటి స్వరరచన కూడా బాగుంది. అందుకు సంగీత దర్శకుడు చైతన్ భరద్వాజ్‌ను అభినందించాలి. విశ్వాస్ డేనియల్ సినిమాటోగ్రఫీ, అలానే యాక్షన్ సీన్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి.

నటీనటుల విషయానికి వస్తే దర్శకుడు మురళీ కిశోర్ 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దగ్గర వర్క్ చేయడంతో ఇందులో కన్నడ ఆర్టిస్టులకు పెద్ద పీటే వేశాడు. వారంతా చాలా చక్కటి నటన కనబరిచాడు. కిరణ్ అబ్బవరం, కశ్మీర పర్దేశి ఆ పాత్రల్లో చక్కగా ఒదిగిపోయారు. ఇతర ప్రధాన పాత్రల్లో మనకు మురళీశర్మ, శరత్ లోహితస్య, లక్కీ లక్ష్మణ్, శుభలేఖ సుధాకర్, ఎల్బీ శ్రీరామ్, మాథ్యూ వర్గీస్, భరత్ రెడ్డి, తారక్ పొన్నప్ప, దేవి ప్రసాద్, ఆమని, పమ్మి సాయి, వడ్లమాని సత్య శ్రీనివాస్, కృష్ణ పెనుమర్తి, సురభి ప్రభావతి, దయానందరెడ్డి, ప్రభావతి, ప్రవీణ్, శ్రీనివాస్ తదితరులు కనిపిస్తారు. ప్రతి పాత్ర కూడా రిజిస్టర్ అయ్యేలా వాటిని దర్శకుడు డిజైన్ చేసిన తీరు బాగుంది. కొన్ని సన్నివేశాలు సాదాసీదాగా ఉన్నా, మొత్తం మీద థియేటర్ నుండి బయటకు వచ్చేప్పుడు ఓ పూర్తి స్థాయి సినిమాను చూసిన అనుభూతిని 'వినరో భాగ్యము విష్ణు కథ' అందిస్తుంది. మన చుట్టూ ఉన్న మనుషుల గురించి, ఈ దేశం గురించి ప్రతిఒక్కరూ ఆలోచించాలనే విషయాన్ని దర్శకుడు చక్కగా వివరించాడు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్


# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.200/-




వెల : ₹.200/-




వెల : ₹.390/-




వెల : ₹.300/-




వెల : ₹.200/-





వెల : ₹.200/-




వెల : ₹.200/-





వెల : ₹.200/-





వెల : ₹.250/-





వెల : ₹.250/-





వెల : ₹.599/-





వెల : ₹.695/-




వెల :₹.799/-




వెల : ₹.799/-




వెల : ₹.549/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 63035 41244

From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 20

